ప్రజలే ప్రభువులు

# జనబలం

జూన్ 2023 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-



## FDR, లోక్‌సత్తా స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదిక యథాతథంగా అమలు

## ఏపీ రెవెన్యూ లోటు భర్తీకి రూ. 10,461 కోట్లు విడుదల








## వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచాలి..

## రైతుకి న్యాయం కోసం తెలంగాణ, ఏపీ సీఎంలు స్పందించాలి

## దేశ ఆర్థికానికి, రైతులకు నష్టం చేస్తున్న

# వంటనూనెల దిగుమతులు..

### సుంకం పెంచాలి.. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు వెంటనే స్పందించాలి






వంటనూనెల దిగుమతిలో ప్రపంచంలోనే నెంబర్‌వన్ దేశం భారత్. దాదాపు 19% వ్యవసాయ భూమిలో సుమారు 2.6 కోట్ల మంది రైతులు నూనెగింజల సాగు చేస్తున్నారు. అయినా కూడా దిగుమతి సుంకాల్ని 37.5% నుంచి 5.5%కి తగ్గించారు. మన వ్యవసాయ రంగం సుదీర్ఘకాలంగా సంక్షోభంలో ఉంది. వ్యవసాయంలో మిగతా చర్యలతోపాటు మన రైతులకి మంచి ధరలనిచ్చే విధానాలు కూడా కావాలి. ఇందుకోసం కొనుగోలుదారుల మధ్య పోటీ, గుత్తాధిపత్యాల్ని తొలగించటం, ధరల స్థిరత్వం కోసం కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించటం, ప్రాసెసింగ్‌ని, ఎగుమతుల్ని ప్రోత్సహించటం, దిగుమతుల నుంచి రక్షణ కల్పించటం అవసరం. కానీ వంటనూనెలపై మన దిగుమతి సుంకం అతి తక్కువగా ఉంది. ఆహారధాన్యాలకు ఇతర దేశాల్లో డిమాండ్ ఉన్నప్పుడు ఎగుమతుల్ని నిషేధిస్తున్నారు. రైతులకు సంకెళ్లు తెంచేందుకు, మార్కెట్‌లో కొనుగోలుదారుల మధ్య పోటీ ఉండి రైతుకు మెరుగైన ధర లభించేందుకు 2020లో వ్యవసాయ చట్టాల్లో సవరణలు తీసుకొస్తే.. ఉత్తరాది రాష్ట్రాల్లో కొంతమంది పనిగట్టుకుని వాటికి వ్యతిరేకంగా ప్రచారం చేసి రైతులను రెచ్చగొట్టారు. తెలుగు రాష్ట్రాలు సహా కొన్ని దక్షిణాది రాష్ట్రాల్లో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా గట్టివాదనలు వినిపించటం వల్ల ఇక్కడి రైతుల్లో ఆ చట్టాల పట్ల వ్యతిరేకత రాలేదు. చివరికి ఉత్తరాది రాష్ట్రాల రైతుల ఆందోళనలకు తలొగ్గి యూనియన్ ప్రభుత్వం ఆ చట్టాల్ని రద్దు చేసింది. తమకు సంకెళ్లు ఉండాలని, స్వేచ్ఛ అక్కర్లేదని రైతుల చేతే ఆందోళన చేయించే రాజకీయం, నాయకత్వం మన దేశంలోనే కనిపిస్తాయి. వంటనూనె ప్రధాన ఆహారావసరం. దిగుమతులపై మరీ ఎక్కువగా ఆధారపడలేం. మనం 1994లో వంటనూనెల విషయంలో స్వయంసమృద్ధంగా ఉండేవాళ్లం. కానీ దిగుమతుల సుంకం బాగా తక్కువగా ఉండటం వల్ల దిగుమతులు భారీఎత్తున పెరిగాయి. మనం 1998లో 30% వంటనూనెల్ని దిగుమతి చేసుకుంటే, ఇప్పుడు అది 60 శాతానికి పెరిగింది. గత ఏడాది రూ.1,60,000 కోట్ల వంటనూనెల్ని దిగుమతి చేసుకున్నాం. కొవిడ్, ఉక్రెయిన్ యుద్ధం కారణం చూపుతూ వంటనూనెలపై దిగుమతి సుంకం భారీగా తగ్గించిన ప్రభుత్వం.. రిఫైన్డ్ ఆయిల్‌పై మాత్రం తగ్గించలేదు. దీంతో పరిశ్రమలకు లాభాలు కొనసాగాయి. నూనెగింజల ధరలు పడిపోయి రైతులు మాత్రం దెబ్బతిన్నారు. పామోలిన్ పంట ధర సగానికి సగం తగ్గింది. నూనెను రిఫైన్ చేసే పరిశ్రమలను ఆదుకోవాల్సిందే, కానీ ముడి ఉత్పత్తిని అందించే రైతును ఆదుకోనక్కర్లేదా? మన రైతులు దక్షిణాసియా దేశాలతో పోటీ పడలేరు. మనం తిరిగి హేతుబద్ధమైన దిగుమతి సుంకాలను విధించాలి. ఆ డబ్బును మన రైతులకే ఇస్తే నాలుగైదేళ్లలో మనదేశం వంటనూనెల్లో స్వయంసమృద్ధం కాగలుగుతుంది. మనం ఆహారధాన్యాలను అవసరానికి మించి ఉత్పత్తి చేస్తున్నాం. కానీ ఉన్నకొద్దీ డిమాండ్ పెరుగుతున్న వంటనూనెలు, పప్పులు, పండ్లు, కూరగాయల్ని తగినంత ఉత్పత్తి చేయటం లేదు. ఆహార ప్రాసెసింగ్ మన వద్ద చాలా తక్కువ. ఈ అంశాలన్నిటిపై సరైన చర్చ, విధానాలు ఉంటేనే మన రైతుల జీవితాల్ని మెరుగుపరచగలం. వ్యాపారంలో తీవ్ర ఒడిదుడుకుల్ని నియంత్రించగలం. 'మంచి ఉద్దేశాలు' ఉన్నవారే తరచూ మన రైతుల్ని, వ్యవసాయాన్ని నష్టపరుస్తున్నారు. జరుగుతున్న అన్యాయంపై రైతులు మేలుకోవాలి, వంటనూనెలపై దిగుమతి సుంకం విధించేలా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన స్పందించాలి.

- డా॥ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 | సంచిక 6

జూన్ 2023

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |


*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ప్రజాస్వామిక ప్రభుత్వాలకు రాజకీయ పార్టీలే పునాదులు

ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామిక ప్రభుత్వాలకు రాజకీయ పార్టీలే పునాదులుగా ఉంటాయని భారత రాష్ట్ర సమితి అధినేత, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హైదరాబాదులో భారత్ భవన్ శంకుస్థాపన సందర్భంగా జరిగిన సమావేశంలో అన్నారు. భావి భారత నిర్మాతలుగా రేపటి యువతను తయారు చేసే దిశగా దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో "భారాసా"కు కేటాయించిన 11 ఎకరాల స్థలంలో భారత్ భవన్ పేరిట పదిహేను అంతస్తులలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ సెంటర్ కి ఇటీవలే ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ మాటలు ఎవరు చెప్పారు అనే దానికంటే ఆ మాటలలో ఉన్న వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్య సౌధానికి రాజకీయ పార్టీలు పునాదులుగా ఉంటాయి. ఉండాలి కూడా! ప్రజాస్వామ్య మూల సూత్రాలైన స్వేచ్ఛ, ప్రజల నిర్ణయాధికారం, ప్రజల భాగస్వామ్యం, చట్టబద్ధ పాలన, స్వయం దిద్దుబాటు అనే ఐదు స్తంభాల మీద ప్రజాస్వామ్యం నిలబడాలి. కానీ సాంప్రదాయ రాజకీయ పక్షాలు "మనీ అండ్ లిక్కర్ "పాలిటిక్స్ చేస్తూ అనుచిత ఉచితాలతో ఓటర్లను ప్రలోభ పెడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలను అవలంబిస్తున్న ఈ పరిస్థితులలో దేశానికి సమర్థవంతమైన నాయకత్వం రావాలంటే నేటి యువతకు మంచి రాజకీయాల పట్ల అవగాహన కల్పించే శిక్షణ అవసరమని రాజకీయ పార్టీలు గ్రహించడం అంటే మంచి పరిణామానికి దారి తీసినట్లే.

రాజకీయ పార్టీల కార్యకర్తలకు, సమాజంలోని యువతకు రాజకీయ పార్టీలు శిక్షణ ఇవ్వడం కొత్త కాదు. భారతదేశంలో మొట్టమొదటి రాజకీయ పార్టీగా 1885లో విదేశీయుడైన ఏవో హ్యూమ్ మన దేశ జాతీయ నాయకులతో కలసి ప్రారంభించిన భారత జాతీయ కాంగ్రెస్ రాజకీయ పార్టీ నాయకత్వం శిక్షణకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. వలస పాలన వ్యతిరేకిస్తూ జాతీయ ఉద్యమానికి సమాయుత్తం కావడానికి ఆనాడు ఈ శిక్షణ చాలా పనికి వచ్చింది. అలాగే ఆ తర్వాత 1924లో ఏర్పడ్డ కమ్యూనిస్టు పార్టీ కూడా మార్క్సిజం ఆలోచనా ధోరణితో సమ సమాజం నిర్మించే దిశగా యువతకు రాజకీయం శిక్షణ ఇచ్చింది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఏర్పడ్డ స్వతంత్ర, స్వరాజ్య పార్టీలు కూడా ఈ రకమైన రాజకీయ శిక్షణలు  ఇచ్చాయి. అలాగే భారత స్వాతంత్ర్యానికి పూర్వం హైదరాబాద్ స్టేట్ లో జోగిపేట లో జరిగిన ప్రథమ ఆంధ్ర మహాసభ నుండి ప్రస్తుత సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో చివరి 13వ ఆంధ్ర మహాసభ వరకు నైజాం ఆంధ్ర మహాసభలు జరిగినప్పుడు అక్కడ కూడా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించబడ్డాయి. అలాగే ఆర్య సమాజ్, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా ఆనాడు యువతకు రాజకీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

అది గతం. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీల తో పాటు కొత్తగా వచ్చిన పార్టీలు కూడా రాజకీయ శిక్షణ ఇచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు 1982 లో ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదంతో ఎన్టీఆర్ నెలకొల్పిన తెలుగుదేశం పార్టీ శిక్షణ తరగతులు ఒక మంచి ఉదాహరణ. తరువాత లోక్ సత్తా ఉద్యమ సంస్థ, అలాగే లోకసత్తా పార్టీ కూడా మంచి రాజకీయాలను ప్రోత్సహించే విధంగా అనేక శిక్షణా కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించింది. ప్రజారాజ్యం పేరు మీద రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన శిక్షణా తరగతులలో వేలాది మంది పాల్గొని రాజకీయాల పట్ల సమగ్ర అవగాహన తెచ్చుకున్నారు. రాజకీయం అంటేనే ప్రజల ఆశలను ఆకాంక్షలను అర్థం చేసుకొని దానికి అనుగుణంగా మంచి పాలనను అందించే విధంగా విధాన నిర్ణయాలు తీసుకునేటట్లు లోక్ సత్తా ఇచ్చిన శిక్షణ ఉపయోగపడింది.

ప్రజల అపరిమితమైన ఆకాంక్షలకు పరిమితమైన వనరులకు వారధి నిర్మించేదే రాజకీయం. రాజకీయ పార్టీ అంటేనే ఒక అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అన్న మహాత్మా గాంధీ స్ఫూర్తితో రాజకీయ పార్టీలు ప్రజలలోకి వెళ్లాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుతం ఉన్న "సారా" సాంప్రదాయ పార్టీలలో ఈ ధోరణి కొరవడింది.

అంతర్గత ప్రజాస్వామ్యం అడుగంటింది. దేశంలోని  ప్రాంతీయ పార్టీలన్నీ ప్రైవేటు ఆస్తులుగా మారిపోయాయి. జాతీయ పార్టీలు జాతీయ విధానాలు అవలంబించకుండా ఎప్పటికెయ్యది  ప్రస్తుతం అన్నట్లు వ్యవహరించడంతో రాజకీయం అంటే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రజలను ఏకం చేసే రాజకీయాలు మారిపోయి ప్రజల మధ్య విభజన రేఖలు గీసే రాజకీయాలు వచ్చాయి. వ్యక్తులు, కుల మతాలు, ప్రాంతాలు, భాష ఇలా ప్రతిదీ ప్రజలను విడదీసే అంశంగా తయారైంది. ఇది మారాలి మారాలంటే ఎక్కడో ఒకచోట మొదలుపెట్టాలి. ఎవరో ఒకరు ముందుకు రావాలి. అందుకు అనుగుణంగా రాజకీయ పార్టీలు యువతకు మంచి రాజకీయాల పట్ల అవగాహన కల్పించే శిక్షణ ఇవ్వడం మరింత మంచిది. అందుకు ఏ పార్టీ పూనుకున్నా కూడా అభినందించదగ్గ విషయమే కదా!!!.

-బండారు రామ్మోహనరావు

# కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పాఠాలు

ప్రభుత్వ పనుల్లో 40 కమీషన్లు, అభివృద్ధి–సంక్షేమం మధ్య సమతూకం సాధించలేకపోవటం, బెంగళూరేతర కర్ణాటకలో మౌలిక వసతులు, ఉపాధి కల్పన, మహిళా సాధికారతపై నిర్లక్ష్యం, బలమైన స్థానిక నాయకత్వం కొరవడటం మొదలైన కారణాల వల్ల కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. ఆ పార్టీకి తగ్గిన ఓట్లు నామమాత్రమే (2018లో 36.22 శాతం, ఈ ఎన్నికల్లో 36%) అయినా, సాంప్రదాయంగా ఆ పార్టీకి ఓటు వేసేవారు ఎక్కువగా ఉన్నారనుకునే నియోజకవర్గాలలో సైతం ఈసారి కాంగ్రెస్‌కు గణనీయ ఆదరణ లభించింది. ఫిరాయింపులు, బేరసారాలకు అవకాశం కల్పించకుండా కాంగ్రెస్‌కు గట్టి మెజారిటీని (2018లో కంటే 4.8 శాతం అదనపు ఓట్ షేర్‌తో ఈసారి 42.9 శాతం ఓట్లు లభించాయి) కన్నడిగులు అందించారు. ఆ క్రమంలో జేడీఎస్ కూడా ఓట్లు కోల్పోయింది. ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలుపు, తక్కువ వస్తే ఎన్ని ఓట్లు వచ్చినా ఓటమి అనే మన ఎన్నికల వ్యవస్థలో మూడో పార్టీకి స్థానం ఉండదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తరచూ చెప్పే మాట ఈసారి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. కింగ్‌మేకర్ ముసుగులో రాజకీయాలు చేసే పార్టీని ఎన్నుకోవటం కంటే డైరెక్ట్‌గా తాము కింగ్‌గా భావించేవారిని ఎన్నుకోవటమే మెరుగని ప్రజలు భావించారు. అధికార పార్టీని మార్చటమనే ఆనవాయితీ కర్ణాటకలో ఉన్నా, రాజకీయ సందర్భం ఈసారి ఫలితాల ప్రాధాన్యతను గణనీయంగా పెంచింది.



కులం, మతం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో కూడా బలమైన ప్రభావం చూపాయిగానీ.. వాటిని దాటి కూడా ప్రజలు చూడగలుగుతున్నారని, తమకు ఉపాధి అవకాశాలు, మెరుగైన ఆదాయాలను కోరుకుంటున్నారని, బీజేపీ అభివృద్ధి నమూనా ఈ అంశాలకు సృజనాత్మక పరిష్కారాలను చూపించకుండా అవినీతిలో మునిగితేలటం, ఈడీ, సీబీఐ వంటి సంస్థలు బీజేపీవారి అవినీతిపై కళ్లు మూసుకుని ప్రత్యర్థులపై దాడులకు దిగటం, హిజాబ్, హలాల్, టిప్పు సుల్తాన్, లవ్ జిహాద్ అంటూ మతపరమైన అంశాల చుట్టూ తరచూ వివాదాలను రేకెత్తించటం ప్రజల్లో వ్యతిరేకతను పెంచిందని ఓటింగ్ సరళిని బట్టి అర్థమవుతుంది. ఈ నేపథ్యంలోనే బీజేపీకి ఓటు బ్యాంకు అనుకున్న కొన్ని కులాలవారు సాంప్రదాయాన్ని ఛేదించి కాంగ్రెస్‌కు ఓటు వేశారు. ప్రజలు కులం, మతం దాటి ఆలోచించగలుగుతున్నా వాటి ప్రభావం మరీ ఎక్కువ ఎందుకు తగ్గలేదు అంటే.. రాజకీయ పార్టీల తీరే అందుకు కారణం. జేపీ చెప్పినట్లు, మన దేశంలోని రాజకీయ పార్టీలు తమ మౌలిక బాధ్యతల్ని నెరవేర్చకుండా, తమ వైఫల్యం వల్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఎదుర్కోవటానికి ఎన్నికల్లో ప్రలోభాలు, తాత్కాలిక తాయిలాలతోపాటు కులం, మతం వంటి ఆటవిక భావోద్వేగాలను రెచ్చగొడుతున్నాయి.

ప్రజలు ఆర్థికపరంగా ఎదుర్కొంటున్న ఉపాధి, మెరుగైన ఆదాయాల సమస్యలను పరిష్కరించటానికి ఒక మహానగరం, సేవల రంగం మాత్రమే పరిష్కారం చూపుతాయన్నట్లు బీజేపీ వ్యవహరించింది. ఈ నమూనాను కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించినప్పటికీ ఈ నమూనాలోని లోపాల్ని మాత్రం పట్టించుకోలేదు. అవి ఇప్పుడు ప్రజలకు విస్తృతస్థాయిలో అనుభవంలోకి వస్తున్నాయి. ఆ లోపాల్ని సవరించి అందరికీ ఎదిగే అవకాశాలుండే నమూనాను ఆవిష్కరించటంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైంది. బీజేపీకి ఇది జాతీయ స్థాయి నమూనాయే గానీ, లోపం కర్ణాటకలో ప్రస్ఫుటంగా బయటపడింది. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం సాధించటం, అభివృద్ధిని వికేంద్రీకరించటం వంటి ఏర్పాట్లతో సమ్మిళిత వృద్ధిని నినాదాల్లో కాకుండా చేతల్లో చూపే విధానాల్లో విఫలమవటం రాష్ట్రంలో బీజేపీకి నష్టం చేకూర్చింది. ఆ సమస్యల్ని గుర్తించి అందుకున్న కాంగ్రెస్ పార్టీ అందుకు వాస్తవ పరిష్కారాలు చూపకుండా, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ సహా పలు ఉచితాల్ని బెంగళూరేతర, దిగువాదాయ ఓటర్లను బాగా ఆకట్టుకుంది. ఒక అంచనా ప్రకారం కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఇచ్చిన హామీల్ని నెరవేర్చటానికి ఏటా

అదనంగా రూ. 34,000 కోట్లు ఖర్చవుతాయి. ఈ డబ్బును ఏ రూపంలో ఈ ప్రజల కోసమే ఖర్చు పెడితే వారి జీవితాల్లో గుణాత్మక మార్పు వస్తుందన్న చర్చ లేకుండా కేవలం తాత్కాలిక పథకాల రూపంలో ప్రకటించి కాంగ్రెస్ ప్రజల మద్దతు పొందింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించే లక్షణమున్న బీజేపీ కూడా కొన్ని ఉచితాల్ని ప్రకటించినా కాంగ్రెస్‌తో పోటీపడలేకపోయింది. సమస్యలు వాస్తవం, ప్రజల ఆకాంక్షలు వాస్తవం, కానీ ఆదాయాలు పెంచి ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చే విధానాలు మాత్రం దాదాపు శూన్యం.

రాజకీయ పార్టీల్లో సృజనాత్మకత కొరవడటం వల్ల ప్రతి ఎన్నికలో తాము కొత్తగా కనిపెట్టే తాత్కాలిక పరిష్కారాల వైపు ప్రజల్ని ఆకర్షించటానికి ప్రచారాన్ని, సాంకేతికతను నమ్ముకున్నాయి, రకరకాలుగా మభ్యపెడుతున్నాయి. ప్రజలకు డబ్బు పంచటం దగ్గర్నుంచి, ప్రజల్లో చిచ్చు పెట్టటం వరకూ అన్ని అంశాల్లో నేతల అభీష్టాలకు అనుగుణంగా పార్టీల్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి రెడీమేడ్‌గా పనిచేసేందుకు కొన్ని సంస్థలు పొలిటికల్ కన్సల్టెన్సీలుగా ఆవిర్భవించాయి. ఈ కన్సల్టెన్సీలు రాజకీయానికున్న ప్రజాస్వామ్య స్వభావాన్ని మేనేజ్‌మెంట్‌లాగా మార్చేశాయి. పార్టీ టికెట్ ఆశిస్తున్నవారిలో లేదా పార్టీ చెప్పినవారిలో గెలుపు గుర్రాలెవరో సర్వే ద్వారా తేల్చటం, అభ్యర్థులను ఓ బ్రాండ్‌లా మార్కెట్ చేయటం, గెలుపుకి అవసరమైన ప్రచార గిమ్మిక్కులు చేయటం వంటివన్నీ ఆ కన్సల్టెన్సీలే చూసుకుంటాయి. ప్రధాన పార్టీలన్నీ ఇదే తరహాలో వ్యవహరిస్తుండటంతో ఈ హోరులో ప్రజల ఎజెండా మరుగునపడిపోయి, తక్షణ ఆకర్షణలైన ఉచితాలు, ఉద్వేగాలు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఎన్నికల్లో స్వచ్ఛందం పోయి అంతా డబ్బుమయమై రాజకీయం ఫక్తు వ్యాపారంలా తయారవుతోంది. ప్రజల అవసరాలు, భావోద్వేగాలు అంగడి సరకుగా మారిపోతున్నాయి. ఈ మొత్తం నేపథ్యంలో కర్ణాటక ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రధాన పార్టీ అభ్యర్థులు ఒక్కొక్కరు 30–40 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా.

దేశంలోనే కాదు, ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల్లో కూడా అత్యంత ప్రజాదరణ పొందిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఎన్నికల్లో 19 సభలు, అరడజను వరకు రోడ్డు యాత్రలతో భారీస్థాయి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే కర్ణాటకకు చెందిన నేత. సోనియా గాంధీ, రాహుల్ సహా కాంగ్రెస్ అగ్రనేతలంతా ప్రచారం చేశారు. అయితే, అందరూ ఉన్న వ్యవస్థలోనే ఎలాగోలా అధికారం పొందుతామని తాపత్రయపడ్డారే తప్ప ఏమిటీ డబ్బు, ఇదేమి ప్రజాస్వామ్యం అన్న చిన్నపాటి ఆత్మపరిశీలన కూడా చేసుకోలేదు. చట్టబద్ధపాలన తీసుకొద్దాం, ఎన్నికల్లో చట్టవిరుద్ధ డబ్బు గుమ్మరించాల్సిన అవసరం లేకుండా దామాషా ఎన్నికల పద్ధతి వంటి మార్పుల్ని తీసుకొద్దాం అని మాటవరసకైనా అనలేదు.

జేడీఎస్ నుంచి ముస్లిం ఓట్లను పొందే వ్యూహంతో బజరంగ్ దళ్‌ను పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాను ఒకే గాటన కడుతూ నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించింది. బజరంగ్ దళ్‌ను వ్యతిరేకించేవారు కూడా పీఎఫ్‌ఐతో సమానంగా ఆ సంస్థను చూడటం సరికాదని అంగీకరిస్తారు. అయినా ఓట్ల కోసం కాంగ్రెస్ తాత్కాలిక ప్రయోజనం కోసం బాధ్యతారహితంగా ఆ పనిచేసింది. ముస్లిం రిజర్వేషన్ విషయంలో బీజేపీ ఒక రకమైన రాజకీయం చేస్తే, కాంగ్రెస్ రిజర్వేషన్లేదో శాశ్వత పరిష్కారమన్నట్లు వాటాల రాజకీయం చేసింది. అలాగే సాక్షాత్తూ ప్రధానమంత్రి నోట ఎన్నికల ప్రచారంలో మతపరమైన అప్పీళ్లు వెలువడ్డాయి. జై బజరంగ్‌బలీ అని నినాదాలిస్తూ, 'ది కేరళ స్టోరీ' సినిమా గురించి మాట్లాడుతూ మత విశ్వాసాల ఆధారంగా ఓటర్లను సమీకరించే ప్రయత్నం ప్రధాని చేశారు. అలాగే ఉత్తరాది రాష్ట్రాలు కొన్నింటిలో చేసినట్టు, బీజేపీ ఈ ఎన్నికల్లో ముస్లింలను గంపగుత్తగా దూరంగా పెట్టింది. ఈ హార్డ్‌కోర్ వ్యూహానికి కూడా పరిమితులున్నాయని, ఒక పరిధి దాటి ప్రజలు కులం, మతం పట్టుకుని వేలాడలేరని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. మతాన్ని, అందులోని ఉప శ్రేణి కులాల్ని కలిపి విజయం సాధించాలనే ఫార్ములా ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష ఓట్ల చీలికకు, బీజేపీకి అదనపు ఓట్లకు ఉపయోగపడలేదు.

జేపీ చెప్పినట్లు, బీజేపీలాంటి మితవాద పార్టీలు తమ పునాదిని కాపాడుకుంటూ ఉదారవాద భావజాలురలోకి విస్తరిస్తుంటేనే ఎన్నికల్లో గెలుస్తూండటం సాధ్యమవుతుంది. ఈ ప్రయత్నాన్ని బీజేపీ ఇప్పటికే ప్రారంభించింది. అయితే ఆ ప్రయత్నంలో చాలా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఈ పని సక్రమంగా చేయలేకపోవటం వల్లే, గంపగుత్తగా ముస్లిం ఓట్లనో, మరో వర్గం ఓట్లనో కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది. తన మితవాద భావజాలం, ఉదారవాదం మధ్య సమతుల్యత సాధించకపోవటం వల్ల చోటుచేసుకున్న పలు ఉదంతాలు పౌర సమాజంలోనే కాకుండా సాధారణ పౌరుల్లో కూడా బీజేపీ పట్ల వ్యతిరేకతను పెంచాయి. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయటం, శాంతియుతంగా అధికార మార్పిడి జరగటం మాత్రమే ప్రజాస్వామ్యం అనుకుంటుంటే మన దేశాన్ని పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలతో పోల్చుకుంటున్నట్లు. కాబట్టి చట్టబద్ధపాలన, ఎన్నికల సంస్కరణలు, ప్రజల వాస్తవ ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉపాధి నైపుణ్యాలు, అధికార వికేంద్రీకరణ మొదలైన మార్పులకు రాజకీయ పార్టీలు ఆచరణ ప్రారంభించాలి. సమర్థులు, నిజాయతీపరులు నాయకులయ్యేలా పార్టీల్ని ప్రజాస్వామీకరించాలి. జేపీ సూచించినట్లు, ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ ఈ మార్పుల కోసం బీజేపీ మీద గట్టి ఒత్తిడి తేవాలి. బీజేపీ కూడా ఈ విజయాల్ని తన ఖాతాలో వేసుకునేందుకు పోటీ పడాలి. దేశాభివృద్ధికే కాదు, పార్టీల మనుగడకు కూడా ఈ దిద్దుబాటు, ఆరోగ్యకరమైన పోటీ అవసరం.

# రాజకీయ కన్సల్టెన్సీలు - ఎన్నికల సంస్కరణలు

ఎన్నికల్లో ఎలాగోలా గెలవటమే మన దేశంలో ఇప్పుడు రాజకీయంగా మారిపోయింది. ఎన్నికల్లో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేసే అవకాశం, నచ్చింది మాట్లాడే అవకాశం ఉండటమే ప్రజాస్వామ్యంగా తయారైంది. ఎన్నికల్లో గెలిచాక ఏం చేస్తున్నారు, గెలిచాక ఏమీ చేయలేనివాళ్లనే ఎందుకు గెలిపిస్తున్నాం అనే ఆలోచన వివిధ కారణాల వల్ల ప్రజల్లో ఇంకా రావటం లేదు. ఎంతోకొంత ఆ అవగాహన ఉన్నవాళ్లు, అవకాశమున్నవారు ప్రచార యావలో పడి కొట్టుకుపోతున్నారు. ఈ చర్చను లేవనెత్తి దేశాన్ని బాగుచేయాల్సిన బాధ్యత ఉన్న రాజకీయ నాయకులు ఒక విషవలయంలో కూరుకుపోయి ఉన్నారు. ఈ పరిస్థితుల్ని, మన సమాజంలో పెత్తందారీ సంస్కృతి వల్ల పదవి పట్ల ఉన్న పిచ్చిని, పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో డబ్బు కనిపిస్తుండటం వంటి కారణాలతో ఎన్నికలను ఒక వ్యాపారంగా తయారుచేసేందుకు కన్సల్టెన్సీలు ప్రత్యక్షమయ్యాయి. రాజకీయ పార్టీల సొంత సోషల్ మీడియా, ఇతర బృందాలకు ఇవి అదనం. ఈ ధోరణుల్ని తాజాగా కర్ణాటక ఎన్నికల్లో కూడా చూశాం.




ఎన్నికల్లో ప్రజాభిప్రాయం తెలుసుకోవటం తప్పేమీ కాదు, కొత్త కూడా కాదు. అమెరికా వంటి దేశాల్లో కన్సల్టెన్సీలు దాదాపు యాభై అరవై ఏళ్ల క్రితమే ఉన్నాయని చెబుతారు. మన దేశంలో కూడా పార్టీల నేతలు జనం నాడి తెలుసుకునేందుకు తమకు నమ్మకస్తులైన కొంతమంది స్థానిక నాయకులను ఏర్పరచుకునేవారు. స్వాతంత్ర్యం వచ్చాక పార్టీ అంటే కాంగ్రెసే అనే గుత్తాధిపత్యం దశాబ్దాల పాటు కొనసాగింది. ఈ రకమైన నిర్మాణం కూడా కాంగ్రెస్ సంస్కృతిలో భాగంగానే వేళ్లూనుకుంది. బ్రిటిష్ కాలంలో అధికారులంటే ప్రజలకుండే భయభక్తులు స్వతంత్రం వచ్చాక కూడా కొనసాగుతూ ఒక ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ వారు ప్రజలకు, ప్రభుత్వ కార్యాలయాలకు మధ్య వారధిగా పనిచేస్తూ పనులు చేసి పెడుతుండేవారు. ఎక్కువ శాతం కాంగ్రెస్ వారు సేవాభావంతోనే ఈ పనిచేసేవారు. ప్రభుత్వంలోని పార్టీ నేతలు కూడా వీరి కోసం పెద్దగా ఖర్చు చేసేవారు కాదు. స్థానికంగా ప్రజలకు పౌర సేవల్ని అందుబాటులోకి తెచ్చే కార్యకర్తలకు నేతృత్వం వహించే నేతల్లో ఎక్కువమంది తమ పోషణను, తమ చుట్టూ ఉన్న పోషణను సొంతంగా చూసుకోగలిగేవారు. అయితే ఈ స్థానిక నేతల్లో ఎక్కువమంది పెత్తందారీ మోతుబరులు. ఇలాంటి నేతలు కులం పేరుతో అణగారిన కులాలను ఇంకా అణగదొక్కుతారని భయపడే బాబాసాహెబ్ అంబేద్కర్ మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగపరంగా అధికారాలు, నిధుల బదిలీతో సాధికారత కల్పించటాన్ని వ్యతిరేకించారు. దానివల్ల లాభం కన్నా నష్టం ఎక్కువ జరిగిందని, స్వతంత్ర భారతంలో అనేక వైఫల్యాలకు మూల కారణమైందని గత ఏడు దశాబ్దాల అనుభవాలు రుజువు చేశాయి. ఇదే సమయంలో ఇంకో వైఫల్యం కూడా సమాంతరంగా చోటు చేసుకుంది.

బ్రిటిష్ కాలం నాటి ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రక్షాళన చేసి ప్రజాస్వామ్య రాజ్యాంగం హామీ ఇచ్చినట్టు ఉద్యోగులు ప్రజలకు సేవకులుగా జవాబుదారీతనంతో వ్యవహరించే వ్యవస్థను నిర్మించటంలో పాలకులు విఫలమయ్యారు. దీంతో, ప్రభుత్వంలో ఒక సామాన్య ఉద్యోగి కూడా ఈ దేశంలో అత్యధిక శాతం ప్రజల కంటే అన్ని రకాలుగా అనేకరెట్లు పైస్థాయిలో ఉండే పరిస్థితి ఏర్పడింది. ఈ అసమతుల్యత వల్ల క్రమంగా ప్రభుత్వోద్యోగులు-పార్టీ కార్యకర్తల మధ్య లాలూచీ వేళ్లూనుకుని ఒక అవ్యవస్థ తయారైంది. తెలుగునాట ఎన్.టి రామారావు రాజకీయాల్లోకి వచ్చాక గ్రామాల్లో పెత్తందారీ నాయకుల ఆధిపత్యానికి గండిపడి మాస్ పాలిటిక్స్ మొదలయ్యాయి. ఈ ఒరవడి దేశవ్యాప్తంగా ప్రభావం చూపింది. మాస్

## ఇతనే నన్ను ముఖ్యమంత్రిని చేస్తాడు.



పాలిటిక్స్ వచ్చాక ఎన్నికల్లో పోటీకి డబ్బు నేపథ్యం లేకపోయినా అవకాశాలు అందివచ్చాయి. ఇది కీలక మార్పే గానీ, ఆటనియమాల్ని మార్చే ప్రయత్నం జరగకపోవటంతో చివరికి ఆటగాళ్ల మార్పుగా మిగిలిపోయింది. ఎన్నికల్లో పోటీ పెరిగి, దాంతోపాటు ప్రజలను మెప్పించే సుపరిపాలన అందించే వ్యవస్థ కొరవడటంతో డబ్బు చుట్టూ రాజకీయం గెలుపు మార్గంగా మారిపోయింది. ఈ పరిస్థితుల్లో విలువలకు కట్టుబడిన పాతతరం నేతలు, చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేయాలనుకునేవారు క్రమంగా రాజకీయాలకు దూరం జరగటం మొదలైంది. నేతలే కాదు, కార్యకర్తలు కూడా స్వచ్ఛంద సేవా భావాల్ని విడనాడి దీన్నో వృత్తిగా భావించటం మొదలుపెట్టారు.

ఓటర్లను ఆకర్షించేందుకు ప్రలోభాలు, వారితో నిరంతర సంబంధాలు నెరపేందుకు కార్యకర్తలను పోషించటం కోసం డబ్బు అవసరం పెరిగిపోయింది. సుపరిపాలన లేకపోవటంతో ప్రజల్లో అసంతృప్తి ప్రతి ఎన్నికకూ పెరిగిపోతుండటం వల్ల డబ్బు, ఇతర ప్రలోభాల ప్రభావం పెరిగిపోసాగింది. ఈ క్రమంలో కులం, మతం, ప్రాంతం వంటివి కూడా ప్రవేశించాయి. దీంతో ఉన్నకొద్దీ పోటీ ఎక్కువై ఎన్నికలంటే డబ్బు, డబ్బు లేకుంటే బరిలో ఉండే అవకాశమే లేదు అనే పరిస్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రాలతోపాటు కేరళ మినహాయించి ఇతర దక్షిణాది రాష్ట్రాలు ఇందులో ముందుండి మిగతా దేశాన్ని కూడా డబ్బు రాజకీయంలోకి నడిపిస్తున్నాయి. ఈవేళ చాలా రాష్ట్రాల్లో ఎన్నికల్లో డబ్బు ప్రభావం తారాస్థాయికి చేరింది. కేవలం ఎన్నికల్లో గెలుపు కోసమే అవినీతిని కొత్త పుంతలు తొక్కించటం జరుగుతోంది. డబ్బున్నవాళ్లు పదవి పిచ్చితో సొంత డబ్బు ఖర్చు పెట్టి రాజకీయం చేయటం ఇప్పటికీ మన దేశంలో కొనసాగుతున్నప్పటికీ, ఆ సంఖ్య గతంలో కంటే బాగా తగ్గిపోయింది. పార్టీ ఫండ్, నేతల రోజువారీ అవసరాలకు అవినీతికి పాల్పడటం తప్పదు అన్నట్లు వసూళ్లు చేయటం, అవినీతికి పాల్పడటం, ఇందులో కొంతభాగాన్ని సొంతంగా కైంకర్యం చేయటం ఆనవాయితీగా మారిపోయింది. ఈ క్రమంలో కమీషన్ల కోసం భారీ ప్రాజెక్టులు, నిర్మాణాల పథకాల రూపకల్పన కూడా జరుగుతోంది. తెలంగాణలో జరిగిన హుజూరాబాద్, మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో వ్యయం ఈ పరాకాష్టలో కూడా కొత్త స్థాయిలకు చేరింది. బ్రిటన్‌లో పార్లమెంటు ఎన్నికల్లో చేసిన ఖర్చును మించి డబ్బును మునుగోడులో పార్టీలు ఖర్చు చేసినట్లు అంచనా. డబ్బు తీసుకోకుండా ఓటు వేయండని నీతులు చెబితే వినేస్థాయిని ఓటర్లు దాటిపోయారు.

ఈ రకమైన అవ్యవస్థ వల్ల ప్రభుత్వానికి, శాసన వ్యవస్థకు మధ్య గీత చెరిగిపోయింది. విధానాలను రూపొందించాల్సిన శాసన సభ్యులు ఆ పనిని ముఖ్యమంత్రికి వదిలేసి, విధానాలను అమలు చేయాల్సిన ప్రభుత్వం పనుల్లో జోక్యం చేసుకోవటం తమ పని అన్నట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో ఎమ్మెల్యేరాజ్యం ఏర్పడి, శాసనసభ్యులు సామంతరాజుల్లా వ్యవహరిస్తున్నారు. చట్టసభల్లో సమస్యలు ప్రస్తావన, లోతైన చర్చతో శాసనాలు చేయటం వదిలేసి ప్రభుత్వంలో పైరవీలు చేస్తున్నారు. తాను పదవిలో కొనసాగాలంటే ఎమ్మెల్యేల మద్దతు తప్పనిసరి కాబట్టి ముఖ్యమంత్రికి శాసనసభ్యులు నియోజకవర్గాలలో చేసే పైరవీలను, అవినీతిని సహించక తప్పని పరిస్థితి. ముఖ్యమంత్రికి మద్దతుగా నిలబడటం, శాసనసభలో అధికార పార్టీ ఏం చెప్పినా ప్రశ్నించకుండా ఆమోదించటం, నియోజకవర్గంలో మాత్రం ప్రచ్ఛన్న ప్రభుత్వంలా తిరుగులేని అధికారాల్ని చెలాయించటం.. ఇదీ ఎమ్మెల్యే పాత్రగా మారిపోయింది. అధికారాలు కలగాపులగమై ప్రభుత్వం–శాసన వ్యవస్థ మధ్య అధికారాల విభజన కొరవడిన ఈ క్రమంలో స్థానిక ప్రభుత్వాలను కూడా అణగదొక్కారు. రాజ్యాంగపరంగా స్థానిక ప్రభుత్వాలకు సాధికారత లేకపోవటం వారికి కలిసివచ్చింది. దీంతో, స్వతంత్రం వచ్చిన సమయంలో ఎమ్మెల్యే కంటే ఎక్కువ అధికారాలున్న స్థానిక ప్రభుత్వ ప్రతినిధులు క్రమంగా ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. ఎన్నికల్లో భారీ డబ్బు వ్యయం–ఆ తర్వాత మళ్లీ ఇంకో ఎన్నిక వచ్చే లోపు కార్యకర్తల పోషణకు 'ఓ ఎమ్మెల్యే స్థాయిలో నెలకు లక్షల్లో వ్యయం–రోజూ

దుష్పరిపాలన-వంశపారంపర్య రాజకీయాలతో పార్టీలు సొంత ఆస్తులుగా మారిపోవటం-పెత్తందారీ రాజకీయం కొత్తరూపు దాల్చటం-అణగారిన కులాలు కూడా పెత్తందారీ రాజకీయ నమూనానే అనుకరించటం'.. ఈ విషవలయాన్ని ఛేదించే సంస్కరణలు తేకపోవటంతో సమర్థులు, నిజాయతీపరులు గెలిచే అవకాశం దాదాపుగాలేని ఒక పెద్ద సంక్షోభం మన ఎన్నికల వ్యవస్థలో కొనసాగుతోంది. ఎన్నికల్లో తమకు నచ్చినవారికే ప్రజలు ఓటు వేయగలుగుతున్నా, శాంతియుతంగా అధికార మార్పిడి జరుగుతున్నా ప్రజాస్వామ్యం, సుపరిపాలన ఇంకా పైపై పూతలుగానే మిగిలిపోయాయి. ఈ సంక్షోభాన్ని ఉపయోగించుకునే క్రమంలోనే పొలిటికల్ కన్సల్టెన్సీలు ఒక వృత్తిగా మన దేశంలో ఆవిర్భవించాయి. ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు, మలిచేందుకు, ఉత్పత్తి చేసేందుకు ఈ సంస్థలు పోటీ పడుతున్నాయి.

రాజకీయాల్లో కార్పొరేట్ సంస్కృతిని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియా వ్యవహారాలు చూడటానికి, జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్వహణకి ఆయన పార్టీ వారి కన్నా ప్రొఫెషనల్స్‌ని నమ్ముకున్నారు. తాను రాష్ట్ర ముఖ్యమంత్రిని కాదు, సీఈఓని అని ప్రకటించుకున్న బాబు.. అదే రీతిలో పార్టీ నిర్వహణను కూడా ఒక వ్యాపార సంస్థ నిర్వహణలా మార్చారు. ఆ తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రి స్థాయి నుంచి దేశ ప్రధానమంత్రి స్థాయికి ఎదిగే క్రమంలో నరేంద్ర మోదీ 2014 ఎన్నికల్లో గెలవటానికి ఈ తరహాను ఆశ్రయించారు. ఆ ఎన్నికల్లో మోదీ ప్రచారం జరిగిన తీరు అప్పటిదాకా గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన పట్ల దేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ప్రతికూల ముద్రను చెరిపేశాయి. పలువురు మైనారిటీ యువత కూడా మోదీ.. మోదీ అని ఆ ఎన్నికల్లో జపం చేశారు. తాను ఆ ఎన్నికల్లో విజయం సాధించబోతున్నట్లు మోదీ ముందుగానే ప్రకటించగలిగారు. మోదీ అసాధారణ గెలుపుతో ప్రశాంత్ కిషోర్ అనే పొలిటికల్ కన్సల్టెంట్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. అప్పటికే మన దేశంలో వంశపారంపర్య రాజకీయాల వల్ల యువ నాయకులుగా ఎదుగుతున్న ఉన్నత విద్యావంతులు, ఎటువంటి ప్రజాసేవ నేపథ్యం లేకపోయినా డబ్బు వెదజల్లి నాయకులుగా ఎదగాలని ఆశపడుతున్న వ్యాపారవేత్తలు ఇలాంటి వారికి ఈ నమూనా అందివచ్చిన అవకాశంలా కనిపించింది. దీంతో ప్రశాంత్ కిషోర్ సంస్థ ఐప్యాక్ బృందానికి డిమాండ్ విపరీతమైంది. ఆయన వద్ద పనిచేసిన వారిలో కూడా కొందరు సొంత దుకాణాలను తెరిచారు. 2018లో తెలంగాణ అసెంబ్లీకి జరిగిన ముందస్తు ఎన్నికల్లో, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో, జాతీయ స్థాయిలో జరిగిన ఎన్నికల్లో ఈ బృందాలు చాలా పెద్ద పాత్ర పోషించాయి. ముఖ్యంగా ఏపీలో చంద్రబాబు నాయుడి కేంద్రీకృత పాలన దుష్పరిణామాలను కొన్ని కులాల మధ్య కుంపటిలా మార్చి రగల్చటంలో వైసీపీ తరపున పనిచేసిన ఐప్యాక్ సంస్థ విజయం సాధించింది. తన మూలంగానే పార్టీలు గెలిచాయని ప్రశాంత్ కిషోర్ బహిరంగంగా ప్రకటించినా ఆయా పార్టీలు ఖండించలేదు సరికదా, ఆయన్ను పక్కన కూర్చోబెట్టుకుని ఆ పార్టీల అధినేతలు ప్రమోట్ చేశారు. ఇప్పుడు పొలిటికల్ కన్సల్టెన్సీలు లేకుండా దాదాపు ఏ ప్రధాన పార్టీ పనిచేయలేని పరిస్థితి ఏర్పడింది. 2023, 2024 ఎన్నికల కోసం ఇప్పటికే ఆయా పార్టీలు ఆ కన్సల్టెన్సీల సాయం తీసుకుంటున్నాయి పార్టీలే కాకుండా పార్టీల అభ్యర్థులు కూడా ఈ సేవల్ని విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. అయితే ఈ కన్సల్టెన్సీ నిపుణుల సామర్థ్యం, సాంకేతికత ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచటానికేమీ ఉపయోగపడటం లేదు. ఎన్నికల వ్యవస్థలోని లొసుగుల్ని ఇంకా సమర్థంగా వినియోగించటానికే వీరి సేవలు ఉపయోగపడుతున్నాయి.

ప్రజాభిప్రాయమే అంతిమమనే భావాన్ని కన్సల్టెన్సీల వృత్తి నిపుణులూ అనుసరిస్తారు. అయితే ఈ ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవటానికి అనైతిక, చట్టవిరుద్ధ పద్ధతుల్ని అనుసరించటమే కాకుండా.. విద్వేషాల్ని రెచ్చగొట్టటానికి రాజకీయ నేతలకు కూడా తట్టని ఐడియాలను, వాళ్లు కూడా ఊహించనిస్థాయిలో ఫలితాలనిచ్చేలా ఉపయోగిస్తున్నారు. తెలుగునాట విద్వేషాలను రగిల్చి ఎన్నికల ఫలితాల మీద ప్రశాంత్ కిషోర్ ప్రభావం చూపారన్న విమర్శను కొందరు ఆమోదించకపోవచ్చు, కానీ ఆమధ్య బీహార్‌లో తన పాదయాత్ర చేస్తున్న సందర్భంగా ఈ విషయంలో తాను పొరపాటు చేశానని ప్రశాంత్ కిషోర్ స్వయంగా చెప్పారు. అలాగే కొంతకాలం క్రితం దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో చూశాం. సోషల్ మీడియా సాంకేతికతను ఉపయోగించుకుని నకిలీ వీడియోల్ని, అబద్ధపు ప్రచారాల్ని వ్యాపింప చేశారు. ఇది బరిలో ప్రధాన పార్టీల నుంచే జరిగినా, పోలీసులు ప్రతిపక్షాల మీదే గురిపెట్టారు. చట్టం అధికారంలో ఉన్నవారి చుట్టం కాబట్టి, నిజానిజాల కోసం ప్రజలు పోలీసుల్ని కూడా నమ్మే పరిస్థితి ఉండదు. ఆమధ్య తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వార్ రూమ్ ఇంఛార్జి సునీల్ కనుగోలుపై కూడా ఈ రకమైన ఆరోపణల మీదే పోలీసులు కేసు నమోదు చేశారు. అబద్ధాలను నిజాలుగా, నిజాలను అబద్ధాలుగా ప్రచారం చేయటం కేవలం వర్తమాన అంశాలకు, రోజువారీ పరిణామాలకు మాత్రమే కాకుండా చరిత్రలోని అంశాలకు కూడా వర్తింపచేస్తున్నారు. పోటీ, నూతన సాంకేతికతల యుగంలోని వేగం, తరం మారి కొత్త తరం రావటం

కారణాల వల్ల అబద్ధపు ప్రచారాన్ని నిజాలుగా నమ్మేస్తున్నారు. ఫిలిప్పిన్స్ గత ఎన్నికల్లోనూ అదే జరిగింది. ఫెర్డినాండ్ మార్కోస్ ఆ దేశ అధ్యక్షుడిగా 1965 నుంచి 1986 వరకు పాలించారు. 1972 నుంచి 1981 వరకు సైనిక పాలన విధించారు. మార్కోస్ హయాం ఆ దేశ చరిత్రలో అత్యంత అవినీతిమయ, నియంతృత్వ కాలంగా పేరుమోసింది. ఆయన భార్య విలాసాలు ఏ స్థాయిలో ఉండేవంటే, ఆమె పేరు మీద అలాంటి ధోరణులకు ఏకంగా నిఘంటువులో ఓ పదమే వచ్చి చేరింది. ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టిన నేతగా ఇటీవలికాలం వరకు గిన్నెస్‌బుక్‌లో ఆయన రికార్డు ఉండేది. మార్కోస్ కుటుంబంపై ఉన్న ఈ ముద్రను చెరిపేసి 2022లో మార్కోస్ కుమారుడు భారీ మెజారిటీతో ఫిలిప్పిన్స్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధానంగా సోషల్ మీడియాలో అబద్ధాల్ని నిజాలుగా నమ్మిస్తూ ఎన్నికల్లో మార్కోస్ జూనియర్ గెలిచాడు. సోషల్ మీడియా టూల్స్‌ని ప్రభావవంతంగా ఉపయోగించుకోవటానికి ఎన్నికలకు ఎంతో ముందునుంచి ప్రయత్నాలు ప్రారంభించాడు. తన తండ్రి మార్కోస్‌పై ఉన్న అవినీతి, నియంతృత్వ ముద్రను చెరిపివేయగలిగాడు. మార్కోస్ హయాంలో ఉల్లాసభరిత సన్నివేశాల్ని టిక్‌టాక్ వీడియోలుగా చెలామణిలోకి తెచ్చి ఆ సమయంలో సైనిక పాలన అన్నదే లేదన్న అభిప్రాయాన్ని యువతలో కలిగించారు. ఇందుకోసం మార్కోస్ జూనియర్ ఎన్నికలకు ఎంతో ముందునుంచీ ప్రణాళికతో పనిచేశారు. తన తండ్రికి వ్యతిరేకంగా ఉన్న రికార్డులన్నిటినీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల నుండి తొలగించాలని, తాను ఎన్నికల్లో గెలవటానికి సహాయపడాలని మార్కోస్ జూనియర్ కోరినట్లు పొలిటికల్ కన్సల్టింగ్ సంస్థ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

అమెరికాలో ఎన్నో దశాబ్దాల కిందటే ఉన్న ఈ రకమైన పొలిటికల్ కన్సల్టెన్సీలు.. ఫలితాల్ని తారుమారు చేశాయని కొన్ని బలమైన ఆరోపణలున్నాయి.

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్లు, ప్రజల నాడి తెలుసుకోవటంలో తప్పు లేదు. కానీ సరైన ఎజెండా లేకుండా ఎలాగోలా ఆ మనోభావాలను ఓట్ల రూపంలో మలచుకోవటమే లక్ష్యమైతే, కేవలం అందుకోసం రాజకీయ కన్సల్టెన్సీలు నడుస్తుంటే, అప్పుడు ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలు ప్రమాదంలో పడతాయి. తల్లిదండ్రులు పిల్లల్ని పెంచేటప్పుడు ఇదేతీరుగా వ్యవహరిస్తే ఆ పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుంది? మంచి, చెడు చెబుతూ వారికి దిశానిర్దేశం చేస్తూ తాము కొన్ని త్యాగాలు, పొదుపు చేస్తూ వాళ్లు బిడ్డల భవిష్యత్తుకి పటిష్ఠ పునాది నిర్మిస్తారు, దేశాన్ని ఆర్థికాభివృద్ధి పథంలోకి తీసుకెళ్తారు. భారతీయ సంప్రదాయం ఇదే. కానీ రాజకీయ కన్సల్టెన్సీల పేరుతో ఎటువంటి సిద్ధాంతం, నిర్మాణాత్మక దృక్పథం లేకుండా, కేవలం ఎన్నికల్లో అధికారమే పరమావధి అయితే అది దేశానికి, ప్రజాస్వామ్యానికి, సమాజానికి కూడా సమస్యాత్మకమవుతుంది.

కాబట్టి రాజకీయ కన్సల్టెన్సీలను తప్పు పట్టాల్సింది లేదు. ఎన్నికల బరిలో సాంకేతికతను, టెక్నోక్రాట్స్ సామర్థ్యాన్ని వినియోగించటం మారుతున్న కాలంతోపాటు వచ్చిన మార్పుగానే భావించవచ్చు. అయితే మన దేశం ఉన్న పరిస్థితుల్లో ప్రజాభిప్రాయాన్ని ఉత్పత్తి చేసే ధోరణి మరింత ఎక్కువ దుష్ఫలితాలనిస్తుంది. అమెరికా వంటి దేశాల్లో కంటే ఎక్కువ నష్టం జరుగుతుంది. ఎన్నికల్లో గెలుపుకి ప్రధాన పార్టీలు అనుసరిస్తున్న అడ్డగోలు పద్ధతులు, అడ్డగోలు ఖర్చు నేపథ్యంలో పొలిటికల్ కన్సల్టెన్సీలు చేస్తున్న పని కూడా అక్రమ, ధన రాజకీయాల పరిధిలోనే సాగుతూ పలు సందర్భాల్లో సమస్యలో భాగంగా మారుతున్న పరిస్థితి భారత్‌ను మరింత దెబ్బతీయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి. పొలిటికల్ కన్సల్టెన్సీలు ఒక నియంత్రణా వ్యవస్థ పరిధిలో జవాబుదారీతనంతో పనిచేసే చర్యలు తీసుకోవాలి.

కన్సల్టెన్సీలు లేకపోయినా మన ఎన్నికల ప్రజాస్వామ్యం అధ్వాన్నంగా ఉందని గుర్తించటం అంతకంటే ముఖ్యం. ఓటుకి, మన జీవితాలకి సంబంధం లేకుండా ఎన్నికలు జరుగుతున్నాయి. సమర్థ పాలన అందించగలిగినవారు ఎన్నిక కాలేకపోతున్నారు, ఎన్నికైనవారిలో అత్యధికులు సమర్థంగా పాలించలేకపోతున్నారు. కన్సల్టెన్సీల సేవలను నియంత్రణ కంటే కూడా ఎన్నికల సంస్కరణలను తీసుకురావటం ఇప్పుడు ఇండియాకి ముఖ్యం. ఇప్పుడున్న ఎన్నికల పద్ధతిని మార్చి.. డబ్బు, ప్రలోభాల ప్రభావాన్ని నియంత్రించటానికి ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, ప్రతి ఓటుకూ విలువ ఉండే ఎన్నికల వ్యవస్థను తీసుకురావాలి. రాత్రికి రాత్రి నాయకులుగా ఎదిగి ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలనుకుంటున్న కార్పొరేట్ వ్యాపారవేత్తల స్థానంలో సమర్థత, నిబద్ధత, ప్రజాసేవ నేపథ్యం గలవారు ప్రజల నుండి నాయకులు, ప్రజాప్రతినిధులయ్యే వ్యవస్థను నిర్మించాలి.

రాజకీయ కన్సల్టెన్సీలు, సొంత సోషల్/మీడియా ద్వారా ప్రచారాన్ని హోరెత్తిస్తూ మౌలిక ప్రజాసమస్యల ప్రస్తావన లేకుండా చేయటం, వ్యక్తి ఆరాధనను పరాకాష్టకు తీసుకెళ్లటం వంటి పద్ధతుల వల్ల రాజకీయం ఇంకా దిగజారి ప్రజాప్రయోజనాలు దెబ్బతినటంతోపాటు రాజకీయ పార్టీలు కూడా కాలక్రమంలో మూల్యం చెల్లిస్తాయి. దేశంలో కేంద్రీకృత పాలన, వ్యక్తి రాజకీయం మరింత బలపడే అవకాశముంది. స్వేచ్ఛాయుత ఓటింగ్, శాంతియుత అధికార మార్పిడికే పరిమితమైన ప్రజాస్వామ్యం మనది అనే విమర్శను మించి తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.


# కర్ణాటక ఎన్నికలు -
# ప్రజా స్వభావ సర్వే

ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్ ఒక వ్యాసం రాశారు. గతంలో సెఫాలజిస్టుగా కూడా పనిచేసిన అనుభవం నేపథ్యంలో అందులో ఆయన కొన్ని పరిశీలనల్ని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ మీడియాను సృష్టించేందుకు నిబద్ధమైన ఓ బృందం.. పెద్దమొత్తాలను చెల్లించి తెచ్చుకున్న వృత్తినిపుణులతో కాకుండా పౌర పాత్రికేయులతో నిర్వహించిన ఎన్నికల పూర్వ సర్వే ఎలా ప్రజా స్వభావంతో ఉందో వివరించారు. ఏప్రిల్ 28, 2023న (కర్ణాటక ఎన్నికలు జరగడానికి రెండు వారాల ముందు) ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన యోగేంద్ర యాదవ్ వ్యాసం సంక్షిప్తంగా..

కర్ణాటక శాసనసభ ఎన్నికలు అలనాటి నా పిచ్చాపాటీలను గుర్తుచేస్తున్నాయి. నేను రాయాలని అభిలషించిన, రాయని వ్యాసంలో చెప్పదలచిన విషయాలను చెప్పేందుకు ఇప్పుడు నాకొక అవకాశం లభించింది.

కన్నడ భాషలో ప్రత్యామ్నాయ, ప్రజల మీడియాను సృష్టించేందుకు నిబద్ధులైన 'ఈ దిన' (Eedina) అనే మీడియా క్రియాశీలుర బృందంతో నేను ఇటీవల సమావేశమయ్యాను. వారితో జరిపిన చర్చల్లో ఎన్నికల వ్యవహారాలలో వర్గం ప్రాధాన్యమేమిటో నాకు స్పష్టంగా తెలిసివచ్చింది. 'ఈ దిన' సభ్యులు కర్ణాటక వ్యాప్తంగా ఎన్నికల పూర్వ సర్వే నొకదాన్ని నిర్వహించారు. నేనూ స్వయంగా అనేక ఎన్నికల సర్వేలు నిర్వహించిన వాడిని కనుక ఇదేమీ నాకు నాకు పెద్దగా ఉత్సాహం కలిగించలేదు. అయితే 'ఈ దిన' సర్వేలో నన్ను అమితంగా ఆకట్టుకున్న విషయమేమిటంటే దాని ప్రజాస్వభావం. పెద్ద మొత్తాలను చెల్లించి తెచ్చుకున్న వృత్తి నిపుణులతో కాకుండా తాము స్వయంగా శిక్షణ ఇచ్చిన 1000 మంది పౌర పాత్రికేయులతో 'ఈ దిన' ఈ సర్వేను నిర్వహించింది. ఈ స్వచ్ఛంద సేవకులు రాష్ట్ర వ్యాప్తంగా 204 నియోజకవర్గాలకు వెళ్లి (మొత్తం నియోజకవర్గాలు 224) 41,169 మంది ఓటర్లతో ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకున్నారు. ఈ ఎంపిక కర్ణాటక జనసంఖ్యా సంబంధి చిత్రాన్ని చక్కగా ప్రతిబింబించిందని చెప్పితీరాలి. సహేతుకమైన కారణాలతోనే నేను 'ఈ దిన' సర్వే ఫలితాలను విశ్వసిస్తున్నాను.

తొట్టతొలుత చెప్పవలసిన విషయమేమంటే కర్ణాటక




ఎన్నికలలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయి. కాంగ్రెస్ గెలుపు దాదాపు ఖాయమని 'ఈ దిన' సర్వే స్పష్టం చేసింది. 224 సీట్లు గల కర్ణాటక శాసనసభలో 132 నుంచి 140 స్థానాల దాకా కాంగ్రెస్‌కు దక్కుతాయని 'ఈ దిన' పేర్కొంది. నిజంగా ఇన్ని స్థానాలను గెలుచుకోవటం జరిగితే గత మూడు దశాబ్దాలలో కర్ణాటకలో కాంగ్రెస్ ఇన్ని అత్యధిక స్థానాలు గెలుచుకోవటం ఇదే మొదటిసారి అవుతుంది. పాలక భారతీయ జనతా పార్టీ సంఖ్యా బలం 57 నుంచి 65 స్థానాలకు పరిమితమవుతుంది. ఇక 'కింగ్‌మేకర్' జనతాదళ్ (సెక్యులర్) పార్టీ 19 నుంచి 25 స్థానాలను మాత్రమే గెలుచుకోగలుతుంది. సాధించుకోగల ఓట్లలో 10 శాతం తేడా ఆధారంగా 'ఈ దిన' ఈ అంచనాకు వచ్చింది. కాంగ్రెస్‌కు 43 శాతం (2018లో కంటే అయిదు శాతం అధికం), బీజేపీకి 33 శాతం (గతంలో కంటే మూడు శాతం తగ్గుదల), జేడీ (ఎస్)కు 16 శాతం (రెండు శాతం తగ్గుదల) ఓట్లు రావచ్చని అంచనా.

ఈ అంచనాలను విశ్వసించకపోవటానికి కారణాలేవీ నాకు కన్పించటం లేదు.

'ఈ దిన' సర్వేలో నన్ను బాగా ఆకట్టుకున్న అంశం ఓటర్ల

ఆర్థిక నేపథ్యం గురించిన ప్రశ్నలు. ఓటింగ్ తీరుతెన్నులు, వర్గ నేపథ్యం మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునేందుకు ఈ ప్రశ్నలు విశేషంగా తోడ్పడతాయి. దురదృష్టవశాత్తు పోల్ సర్వే నిర్వాహకులు అనేకమంది అసలు ఓటర్ల ఆర్థిక నేపథ్యాన్ని కనీసం నమోదు చేయడాన్నే నిలిపివేశారు (సిఎస్‌డిఎస్–లోక్‌నీతి బృందం ఇందుకొక మినహాయింపు). ఓటింగ్ తీరుతెన్నులను ఓటర్ల ఆదాయ నేపథ్యం ప్రభావితం చేస్తుందా అన్న ప్రశ్న వేసేందుకు 'ఈ దిన' సర్వే దోహదం చేసింది. అవును అనేదే ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం. వివిధ వృత్తి నేపథ్యాలు ఉన్నవారి ఓటింగ్ తీరుతెన్నులలో ఒక స్పష్టమైన సరళి కన్పిస్తుంది. వృత్తిగత వివరాలతోపాటు కుటుంబ ఆస్తుల (వాహనాలు, ఫ్రిజ్, స్మార్ట్ ఫోన్లు మొదలైనవి)ను కలుపుకొని ఉన్నత తరగతి నుంచి నిరుపేద స్థాయి దాకా వర్గ నేపథ్యంపై ఒక అంచనాకు వచ్చాను. ఆర్థిక అంతస్తులో కిందిస్థాయికి వెళ్లేకొద్దీ కాంగ్రెస్ పట్ల మొగ్గు స్పష్టంగా కనిపిస్తుంది. ఇందుకు పూర్తి విరుద్ధమైనది బీజేపీ పరిస్థితి. ఓటరు ఎంత స్థితిమంతుడైతే అంతగా బీజేపీ వైపు మొగ్గుతున్న వైనం కనిపించింది. జనతాదళ్ (ఎస్) విషయంలో కూడా ఇదే తీరు వెల్లడయింది. ఉన్నత వర్గంవారు రాష్ట్ర జనాభాలో నాలుగు శాతం మంది కాగా వారిలో 29 శాతం మంది కాంగ్రెస్ వైపు, 41 శాతం మంది బీజేపీ వైపు, 20 శాతం మంది జేడీ (ఎస్) వైపు మొగ్గారు. రాష్ట్ర జనాభాలో 10 శాతంగా ఉన్న మధ్యతరగతి వారు కాంగ్రెస్ వైపు 37 శాతం, బీజేపీ వైపు 38 శాతం, జేడీ (ఎస్) వైపు 18 శాతం మొగ్గు చూపారు. కిందిస్థాయి నాలుగు శాతం మధ్యతరగతి ఓటర్లు రాష్ట్ర జనాభాలో 26 శాతం దాకా ఉన్నారు. వీరిలో 39 శాతం మంది కాంగ్రెస్ వైపు, 36 శాతం మంది బీజేపీ వైపు, 18 శాతం జనతాదళ్ (ఎస్) వైపు మొగ్గారు. పేదలు రాష్ట్ర జనాభాలో 37 శాతంగా ఉండగా వారిలో 46 శాతం కాంగ్రెస్‌కు, 32 శాతం బీజేపీకి, 15 శాతం జేడీ (ఎస్)కు అనుకూలంగా ఉన్నారు. 23 శాతంగా ఉన్న నిరుపేదల్లో 48 శాతం మంది కాంగ్రెస్ వైపు, 28 శాతం మంది బీజేపీ వైపు, 15 శాతం మంది జేడీ (ఎస్) వైపు మొగ్గు చూపారు.

కాంగ్రెస్, బీజేపీ ఓట్ల బలాన్ని లైన్‌గ్రాఫ్‌లో చూడండి. ఆర్థిక ప్రాతిపదికన ఓటింగ్‌కు ఇది పరిపూర్ణ ఉదాహరణగా నిలుస్తుంది. ఉన్నత వర్గాలలో కాంగ్రెస్‌పై బీజేపీకి 13 పాయింట్ల ఆధిక్యత ఉన్నది. మధ్యతరగతికి వచ్చేటప్పటికి అది ఒక పాయింట్‌కు తగ్గిపోయింది. కింది స్థాయి మధ్యతరగతిలో కాంగ్రెస్‌కు మూడు పాయింట్ల ఆధిక్యత ఉన్నది. పేదలలో 14 పాయింట్లు, నిరుపేదలలో 20 పాయింట్ల ఆధిక్యత కాంగ్రెస్‌కు లభించింది. కాంగ్రెస్ వైపు నిర్ణయాత్మక మొగ్గుకు ఆయా వర్గాల సాపేక్ష పరిమాణమే ప్రధాన కారణమని చెప్పవచ్చు. పైస్థాయి మూడు వర్గాల వారు రాష్ట్ర జనాభాలో 40 శాతంగా ఉన్నారు. ఈ వర్గాల మద్దతు బీజేపీకే ఉన్నందున ఆ పార్టీ కాంగ్రెస్‌ను అధిగమించవచ్చు లేదా సమానస్థాయిలో ఉండవచ్చు. ఇక పేదలు, నిరుపేదలు రాష్ట్ర జనాభాలో 60 శాతంగా ఉన్నందున వారి ఓట్లలో అత్యధికం కాంగ్రెస్‌కు దక్కే అవకాశం ఎంతైనా ఉంది.

మరి కులం పాత్ర ఏమిటి? అవును, ఓటింగ్ తీరుతెన్నులపై కులం ప్రభావం అమితంగా ఉన్నది. నిజానికి ఓటర్లు చాలావరకు కులం ప్రభావంతోనే ఎవరికి ఓటు వేయాలనే విషయమై ముందుగా ఒక నిర్ణయానికి రావటం జరుగుతుంది. ఈ దృష్ట్యా అగ్రకులాలలో 58 శాతం మంది మద్దతును బీజేపీ పొందుతుండగా, కాంగ్రెస్ వైపు 28 శాతం మందే మొగ్గు చూపుతున్నారు. లింగాయతులలో 53 శాతం మంది బీజేపీ వైపే ఉన్నారు. వొక్కళిగలలో 38 శాతం మంది జనతాదళ్ (ఎస్)కు ప్రాధాన్యమిస్తున్నారు. కిందిస్థాయి కులాలలో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యత కనిపిస్తోంది. ఎస్.సి, ఎస్.టి, కురుబలలో 50 శాతానికి పైగా, ముస్లింలలో 70 శాతానికి పైగా కాంగ్రెస్ వైపే ఉన్నారు.

కులాధారిత ఓటు బ్యాంకుల వాదనను అంగీకరించే ముందు మూడు వాస్తవాలను మీరు పరిగణలోకి తీసుకోవాలి. అవి: ఒకటి– ఒక రాజకీయ పార్టీకి కులపరమైన మద్దతు తరచు విశ్వసిస్తున్నట్టుగా అధిక స్థాయిలో లేదు. రెండు– ఓటర్లు తొలుత కుల ప్రభావంతో ఒక రాజకీయ పార్టీ వైపు మొగ్గు చూపవచ్చు. అయితే ఆ తరువాత లేదా తదుపరి ఎన్నికలలో తమ మనస్సును మార్చుకునేందుకు అవకాశమున్నది. ఇలా ఎందుకు జరిగిందన్న దాన్ని పూర్వానుకూలత వివరించదు. ఉదాహరణకు ప్రతీ కులంలోనూ ఈసారి కాంగ్రెస్ మద్దతుదారుల సంఖ్య పెరిగింది. ఈ పెరుగుదలకు కుల పరమైన కారణాలను చెప్పలేము. మూడు– ప్రతీ కులంలోనూ వర్గం ప్రభావం పనిచేస్తుంది. ప్రతీ కులంలోని పేదలు, సంపన్నులు తమ తమ ఆర్థికాంశాల ప్రభావంతో ఓటు వేయటం పరిపాటిగా ఉన్నది.

కర్ణాటక శాసనసభ ఎన్నికలను, మీరు విన్న లేదా చదివిన మరే అంశం కంటే ధనిక–పేద అంతరాలే అధికంగా ప్రభావితం చేస్తున్నాయని స్పష్టంగా చెప్పవచ్చు. ముస్లింలకు రిజర్వేషన్ల కోటా రద్దు చేయటం, ఎస్.సి రిజర్వేషన్ల విభజన, బీజేపీపై లింగాయతుల ఆగ్రహం మొదలైన విషయాలపై మీడియాలో తీవ్ర చర్చలు జరుగుతున్నప్పటికీ అవేవీ ఓటింగ్ తీరుతెన్నులను అంతగా ప్రభావితం చేయలేవు. మరి పేదలు, నిరుపేదలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నాలుగు హామీలు (ప్రతీ గృహిణికి గౌరవ భత్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పది కిలోల ఉచిత బియ్యం, విద్యావంతులైన యువతకు నిరుద్యోగ భృతి) ఇవ్వడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఆ హామీలు ఓటింగ్ తీరుతెన్నులను ప్రభావితం చేయనుండటమూ విస్మయం కలిగించే విషయం కాదు. రాజకీయ వేత్తలు, రాజకీయ విశ్లేషకులు మత విభేదాలు, కులపరమైన చీలికలపై దృష్టి పెడుతున్నారు. అయితే భారతీయ ఓటర్లలో ఆదాయపరమైన విభజన ఒకటి మౌనంగా చోటు చేసుకుంటోంది.

# పదేళ్లయింది .. ప్రత్యేక హోదా ఏదీ?



రాష్ట్ర విభజన జరిగి నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతోంది. రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలైన తెదేపా, వైకాపా అధికారంలోకి వచ్చాయి. త్వరలో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. కానీ ఇప్పటికీ రాష్ట్రం సుస్థిరాభివృద్ధికి అవసరమైన బలమైన పునాదిని ఏర్పరచుకోలేకపోయింది. ఇందుకు అవసరమైన రాజకీయ కృషి బలంగా జరగకపోవటంతోపాటు రెండు ప్రధాన పార్టీల మధ్యా స్పర్థగా ఉండాల్సిన పోటీ శత్రుత్వంలాగా, వికృత రాజకీయంలాగా తయారై రాష్ట్రాభివృద్ధికి శాపంగా మారింది. ఒకప్పుడు తమిళనాడులో ఇలాంటి దిగజారుడు రాజకీయం ఉండేది. డీఎంకే లేదా ఏఐఏడీఎంకేలలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్ష పార్టీ పట్ల అవమానకరంగా ప్రవర్తించేది. వస్త్రాపహరణం స్థాయికి ఆ రాష్ట్ర రాజకీయం దిగజారింది. అయినా కూడా రాష్ట్ర ప్రయోజనాల విషయం వచ్చేసరికి రెండు ప్రధాన పార్టీల నేతలూ కలసికట్టుగా పోరాడేవారు. ఇటీవలికాలంలో తమిళనాడులో కొంత రాజకీయ సంస్కృతి మెరుగుపడి నేతల్లో హుందాతనం కనిపిస్తోంది. కానీ అక్కడి దిగజారుడు సంస్కృతిని తెలుగు రాష్ట్రాలు దిగుమతి చేసుకున్నాయి. అదే సమయంలో తమిళనాడు ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం అక్కడి రాజకీయ పార్టీల్లో కనిపించిన ఐక్యతను మాత్రం ఇప్పటికీ మనం అలవరచుకోలేకపోయాం. ఈ భ్రష్టత్వం వల్లే ప్రజలకు, ప్రజాప్రయోజనాలకు దూరంగా అధికార క్రీడలో మునిగితేలుతూ నేతలు రాష్ట్రాన్ని కుదురుకోకుండా చేస్తున్నారు.

విభజన జరిగినా ఏపీకి 975 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం, ఇతర ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్నాయి. వర్షపాతానికి లోటు లేదు. ప్రజల్లో ఎంటర్‌ప్రెన్యూర్ సామర్థ్యాలున్నాయి. సంపదసృష్టి కోసం రిస్కు తీసుకోవటానికి వెనుకాడరు. ఇప్పటికే మంచి చదువు అందించిన అవకాశాలతో ఈ ప్రాంతం నుంచి ఇతర దేశాలకు వెళ్లి ఎదిగినవాళ్లు కూడా ఇక్కడ పెట్టుబడులకు ఉత్సాహం చూపుతున్నారు. అయినా ఫక్తు పెత్తందారీ ధోరణి అధికార క్రీడ రాజకీయాన్ని కులం, ప్రాంతం వంటి అంశాల చుట్టూ తిరుగుతూ రాష్ట్ర భవిష్యత్తును అయోమయంగా మార్చాయి. ఈ క్రమంలోనే విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన కీలక హామీల్ని సాధించుకోవటంలో విఫలమయ్యారు. ఫలితంగా పారిశ్రామిక రంగం, బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరం, మౌలిక వసతులు, ఉపాధి రంగం మూల్యం చెల్లించాయి.

రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక కేటగిరీ హోదా ఎంతో కీలకమని ప్రతి పార్టీ చెబుతుంటుంది. ఎన్నో భారీ నిరసన కార్యక్రమాల్ని, సభల్ని ఈ అంశం మీదే నిర్వహించాయి. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక హోదా ఫలితాల కోసం కొట్లాడినట్లు తెదేపా నేత చంద్రబాబు నాయుడు చెప్పుకుంటుండగా, ఆ సమయంలో హోదాను తాకట్టుపెట్టారని, తమ ఎంపీల్ని గెలిపిస్తే ప్రత్యేక హోదా సాధించుకొస్తామని చెప్పిన వైకాపా నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి 22 మంది లోక్‌సభ ఎంపీలున్నా, రాష్ట్రంలో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ సాధించలేకపోయారు. ఏపీ ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఇచ్చే వినతిపత్రంలో ప్రత్యేక హోదా ప్రాధాన్యాంశంగా ఉన్నట్లు అధికారిక మీడియా ప్రకటనల్లో తెలియచేస్తుంటారు. కానీ ఫలితం మాత్రం కనిపించటం లేదు. ఎక్కడ సమస్య ఉంది?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేక హోదా వర్తింప చేయాలనటం మొట్టమొదటి సమస్య. 2014లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే హోదా కోసం ప్రయత్నం చేయకుండా తాత్సారం చేయటం రెండో సమస్య. ఆ తర్వాత కూడా ఇతర రాష్ట్రాల నుండి అభ్యంతరాలు లేకుండా వారిని కూడా ఒప్పించేలా పరిష్కారం చూపుతూ హోదా సాధించుకునే ప్రయత్నం చేయకపోవటం మూడో సమస్య. ఈ మూడు సమస్యలకూ ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా।। జయప్రకాష్ నారాయణ్ పరిష్కారాలతో ముందుకొచ్చినా ప్రధాన రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో స్పందించకపోవటం వల్ల ఏపీకి ప్రత్యేక హోదా ఇప్పటికీ నెరవేరని లక్ష్యంగా మిగిలిపోయింది.

రాష్ట్ర విభజన నేపథ్యంలో నూతన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాలకు ప్రత్యేక కేటగిరి హోదా ఇవ్వాలని మొట్టమొదట ప్రతిపాదించింది జేపీ. ఆదాయాన్నిచ్చే హైదరాబాద్‌ను కోల్పోతుంది కాబట్టి ఏపీ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణ కోసం ఈ ప్రతిపాదన చేశారు.

విభజన వల్ల హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి సాయాన్ని అందించాలో ఓట్లు, సీట్లు పొందిన పార్టీలు చెప్పకుండా సమైక్యాంధ్ర పేరుతో విద్వేషాల్ని రెచ్చగొట్టటంలో మునిగితేలినా.. జేపీ మాత్రం ఏపీ సుస్థిరాభివృద్ధికి అవసరమైన ఏర్పాట్లకి గట్టి కృషి చేశారు. అందుకోసం స్పష్టమైన రోడ్‌మ్యాప్ అందించారు. ఈ క్రమంలోనే




జనవరి 18, 2014న అసెంబ్లీలో జేపీ మాట్లాడుతూ.. ప్రత్యేక తరగతి హోదా ప్రతిపాదన చేశారు. ఇందులో జేపీ రాయలసీమకు హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేకసాయం అని ప్రతిపాదించారు.

**మిగిలిన రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు రాకూడదనే ఈ రకమైన ప్రతిపాదన**

రాయలసీమకే హోదాను జేపీ ఎందుకు ప్రతిపాదించారంటే, సీమలోని వెనుకబాటుతనం గణంకాలు.. ప్రత్యేకహోదా రాష్ట్రాల్లోని గణాంకాల కంటే అధ్వాన్నంగా ఉన్నాయి. "మనం ఏదైనా ఒక ప్రతిపాదనను కేంద్రానికి చేశామంటే, అది ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వచ్చేలా ఉండకూడదు. రాజ్యాంగబద్ధంగా, ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా ఉండాలి" అని స్పష్టంచేశారు. ప్రత్యేకహోదా వల్ల సీమకు పారిశ్రామిక రాయితీలు ఇస్తే.. బెంగళూరు, చెన్నై, మహారాష్ట్ర నుంచి కూడా పెట్టుబడులు వస్తాయని, ఇది కాలక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకూ లాభం చేకూరుస్తుందని, దక్షిణాదిన ఒక్క రాష్ట్రానికి కూడా హోదా లేనందున ఈ డిమాండ్‌ను మనం సహేతుకంగానే వినిపించవచ్చని వివరించారు. ఒకరకంగా మహారాష్ట్ర నుంచి తమిళనాడు కన్యాకుమారి వరకూ.. దక్కన్ ద్వీపకల్పంలోనే ఏకైక హోదాగల ప్రాంతం రాయలసీమ అవుతుందన్నారు. ఇది ఎవరూ అభ్యంతరం చెప్పలేని వాదన కూడా అవుతుంది కాబట్టి, కేంద్రానికి ఇబ్బందులుండవన్నారు.

**("అధ్యక్షా, దేశంలో 11 ప్రత్యేక ప్రతిపత్తి గల రాష్ట్రాలున్నాయి. ఈశాన్య భారతంలో 7 ఉన్నాయి, హిమాలయ సానువుల్లో మూడు ఉన్నాయి, ఇంకోటి జమ్మూ కాశ్మీర్. దాన్లో అధ్యక్షా, మనతో, మన రాయలసీమ ప్రాంతాన్ని తీసుకున్నట్టయితే, దాంతో పోల్చదగ్గ నాలుగు రాష్ట్రాలను నేను తీసుకున్నాను అధ్యక్షా. అస్సాం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంచల్, జమ్మూ కాశ్మీర్. మిగతావి మరీ చిన్న రాష్ట్రాలు. సిక్కిం, లేకపోతే మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్, కొన్ని వేల జనాభాలో ఉన్నవి లెక్కకు తీసుకోవాల్సిన పన్లేదు. అధ్యక్షా, వీటిల్లో 3 కోట్ల 10 లక్షలేమో అస్సాం జనాభా 2011 లెక్కల ప్రకారం, 68 లక్షలేమో హిమాచల్ ప్రదేశ్ జనాభా, 1 కోటీ 1 లక్ష ఉత్తరాంచల్ జనాభా, 1 కోటీ 25 లక్షలు జమ్మూ కాశ్మీర్ జనాభా. 1 కోటీ 51 లక్షలు రాయలసీమ జనాభా అధ్యక్షా. మీరు చూడండి అధ్యక్షా, రాయలసీమను ఈ రాష్ట్రాలతో పోలిస్తే కరెక్టుగా అదేస్థాయిలో ఉందని అర్థమవుతుంది. జనసాంద్రతలో అస్సాం 397, హిమాచల్ ప్రదేశ్ 123, ఉత్తరాంచల్ 189, జమ్మూ కాశ్మీర్ 56, రాయలసీమ 225. అధ్యక్షా, శిశుమరణాల రేటు చూస్తే, 55 అస్సాంలో, 38,36,31 ఇతర ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రాలలో, 44.5 రాయలసీమలో. అక్షరజ్ఞానం. 72శాతం అస్సాం, 83శాతం హిమాచల్ ప్రదేశ్, 79శాతం ఉత్తరాంచల్, 67 శాతం జమ్మూ కాశ్మీర్, 66శాతం రాయలసీమ. 2011 గణాంకాలు అధ్యక్షా, సెన్సస్ లెక్కలివి. అలాగే అధ్యక్షా, మహిళల విద్య, ఆడపిల్లల విద్య- 56శాతం అస్సాం, 67 శాతం హిమాచల్ ప్రదేశ్, 61 శాతం ఉత్తరాంచల్, 49 శాతం జమ్మూ కాశ్మీర్, 56 శాతం రాయలసీమ.**

**మనందరం కలిసి దేశం నుంచి పొందే ప్రయత్నం చేస్తున్నాం. దాని కోసం మన వాదన ఉండాలి. ఈవేళ తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర కాదు, ముగ్గురం కలిసి ఢిల్లీ మీద పోరాడి తెచ్చుకుంటే అందరికీ లాభమని చెబుతున్నాను. దయచేసి దీని మర్మాన్ని గుర్తించండి. ఇంగ్లీషులో లేదు కాబట్టి మనసు విప్పి చెబుతున్నాను. మనందరం కూడా మనలో ఒకరి మీద ఒకరు విమర్శల వల్ల లాభం లేదు. మనందరం కలిసి ఢిల్లీ నుంచి ఎలా తెచ్చుకోవాలో ఆలోచించాలి. పంజాబ్ విభజన జరిగినప్పుడు హిమాచల్ ప్రదేశ్‌ని ప్రత్యేక రాష్ట్రం చేశారు. ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చారు వాళ్లు. మనకెందుకు ఇవ్వరు వాళ్లు అదే అంకెలుంటే ఇక్కడ. అధ్యక్షా, మంచినీళ్లు లేనటువంటి గ్రామాలు, మంచినీళ్లు లేనటువంటి ఇళ్లు అధ్యక్షా, 45శాతం అస్సాంలో, 44శాతం హిమాచల్‌లో, 42శాతం ఉత్తరాంచల్‌లో, 52శాతం జమ్మూ కాశ్మీర్‌లో, 71శాతం రాయలసీమలో.**

**అధ్యక్షా, లెట్రిన్ లేనటువంటి ఇళ్లు 35శాతం అస్సాం, 31శాతం హిమాచల్, 34శాతం ఉత్తరాంచల్, 41శాతం జమ్మూ కాశ్మీర్, 61శాతం రాయలసీమ. అధ్యక్షా, బీదరికంలో ఉన్న కుటుంబాలు- 32శాతం అస్సాం, 8శాతం హిమాచల్, 11శాతం ఉత్తరాంచల్, 10శాతం జమ్మూ కాశ్మీర్, 28శాతం రాయలసీమ. అధ్యక్షా, తలసరి ఆదాయం- రూ.27,200 అస్సాం, రూ.50,365 హిమాచల్, రూ.59,594 ఉత్తరాంచల్, రూ.30,600 జమ్మూ కాశ్మీర్, రూ.42,000 రాయలసీమ. మళ్లీ దీన్లో కూడా మీరు హిమాచల్ కంటే, ఉత్తరాంచల్ కంటే రాయలసీమ తక్కువ అధ్యక్షా. అధ్యక్షా, ఇదే సమయంలో, ఎందుకీ విషయం తీసుకొచ్చానంటే, కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని చూడండి. కేంద్రం నుంచి ఆ రాష్ట్రాలకు వచ్చే నిధుల్ని చూడండి. మన రాష్ట్రానికి గానీ, రాయలసీమకు గానీ వచ్చే నిధుల్ని చూడండి అధ్యక్షా. చాలా కీలకమైన అంశాలు అధ్యక్షా. ప్రస్తావనకు రాని అంశాలు. చర్చ కావాలి అధ్యక్షా. కేంద్రం నుంచి మనందరం కలిసి ఉమ్మడిగా సాధించుకోవాలి" అని జేపీ ఆనాడు అసెంబ్లీలో వివరించారు).**

హైదరాబాద్ ఆదాయం, విడిపోతే ఆ ఆదాయం కోల్పోవటం వల్ల ఏపీకొచ్చే నష్టం తదితర అంకెల్ని తొలుత బైట పెట్టింది కూడా జేపీయే. ఆ అంకెల్నీ, హోదా తదితర ప్రతిపాదనలున్న రోడ్మ్యాప్‌నీ కేంద్రంలో అధికారానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ తీసుకున్నాయి. అయితే రాయలసీమకు కాకుండా మొత్తం ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేకహోదాను ప్రకటించాలని మార్పు చేశాయి.

**మొత్తం రాష్ట్రానికి హోదా అంటూ అవరోధాన్ని సృష్టించారు**

తెలంగాణవారికి ప్రత్యేక రాష్ట్రాన్ని, ఏపీవారికి ప్రత్యేకహోదా రాష్ట్రాన్ని ఇచ్చేస్తే రెండుచోట్లా మనమే పవర్‌లోకి వస్తామని కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన అడ్డగోలు రాజకీయ వాదనల ఉచ్చులో ఆ పార్టీ నాయకత్వం చిక్కుకుంది. ఈ మేరకే ఫిబ్రవరి 20, 2014న అప్పటి ప్రధాని డా॥ మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ప్రకటన చేశారు. ఎక్కడ వెనకబడిపోతామోనన్నట్టు.. ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లు ఉండాలని బీజేపీవారు పట్టుబట్టారు. ఏపీలో ప్రత్యేక హోదాకి తొలి అవరోధం అప్పుడే మొదలైంది. ప్రధాని ప్రకటన చేసిన వెంటనే సభలో బీహార్‌కు చెందినవారు, మాయావతి వంటివారు అభ్యంతరం కూడా వ్యక్తం చేశారు. తమకు ప్రత్యేకహోదా కావాలని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా మళ్లీ డిమాండ్‌ను ఎత్తుకున్నారు.


ఏపీ మొత్తానికీ ప్రత్యేకహోదా ఇస్తున్నట్టు మార్చి 1, 2014న యూపీయే ప్రభుత్వ కేబినెట్ తీర్మానించింది. కానీ ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావటానికి రెండు వారాల వ్యవధి ఉన్నా దాన్ని చట్టబద్ధం చేసే ప్రయత్నం చేయలేదు. ఈలోపు జరిగిన పరిణామాల్ని గమనిస్తే, ఏపీ మొత్తానికీ ప్రత్యేక హోదా ఇవ్వటానికి అంకెలు, వాస్తవ పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నాయని చూచాయగానే అయినా స్పష్టంగానే అర్థమవుతుంది. రాజ్యాంగపరంగా మన వాదనలో బలం లేదని అర్థమవుతున్నా




ఏదోకరకంగా మెడలు వంచి సాధించగలమని అప్రజాస్వామిక ధీమా ఉండటం వల్ల ఈ పరిణామాలు పెద్దగా పరిగణలోకి రాలేదు. అప్పటి ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లూవాలియాతోపాటు కొందరు అధికారులు ఏపీకి ప్రత్యేకహోదా పట్ల అసంతృప్తితో పక్కనపెట్టారు. ఈలోగా ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్టీకి పూర్తి మెజారిటీ రావటం, ప్రధాని పదవికన్నా బీజేపీని గెలిపించటమే తన లక్ష్యమన్నట్టు ఆయన భావించటంతో కథ వంకరలు తిరగటం మొదలైంది.

తెలుగు నేతల పెత్తందారీ రాజకీయ ధోరణి, అధికార దాహం వల్ల జరిగిన ఈ తప్పిదం వల్ల యూనియన్ ప్రభుత్వం ప్రత్యేక హోదా హామీ నుంచి తప్పించుకోవటం తేలికైంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వటం సాధ్యం కాదని ఇప్పటిదాకా రకరకాలుగా దాటవేస్తూ వచ్చిన యూనియన్ ప్రభుత్వం 2023 బడ్జెట్ సమావేశాలలో పార్లమెంటులో అసలు విషయంపై కొంత స్పష్టతనిచ్చింది. గతంలో 5 లక్షణాల ఆధారంగానే ప్రత్యేక హోదా ఇచ్చారని చెప్పటం ద్వారా.. ఆ అర్హత ఏపీకి లేదని గుర్తుచేసింది.

"రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వటానికి అనుసరించే విధానమేంటి? ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వకపోవటానికి కారణమేంటి? 2014లో విభజన తర్వాత రాష్ట్రం ఎదుర్కొనే ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకొని ఏపీకి కేంద్రం ఏదైనా వాగ్దానం చేసిందా? విభజన చట్టంలో ఇంకా ఏయే వాగ్దానాలు పెండింగ్‌లో ఉన్నాయి, వాటి జాప్యానికి కారణాలేంటి? ప్రత్యేక హోదా కోసం గత ఆరునెలల్లో ఏపీ ప్రభుత్వం నుంచి విజ్ఞాపన వచ్చిందా?" అని వైకాపా లోక్‌సభ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బాలశౌరి



మార్చి 21 న అడిగిన ప్రశ్నలకు యూనియన్ హోం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బదులిస్తూ.. ప్రత్యేకహోదా ఇవ్వటానికి యూనియన్ ప్రభుత్వం గతంలో 5 లక్షణాలను నిర్దేశించిందని, వాటి ఆధారంగానే జాతీయ అభివృద్ధి మండలి కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కట్టబెట్టిందని తెలిపారు.

"ప్రత్యేక హోదా కోసం ఏపీతోపాటు కొన్ని రాష్ట్రాల నుంచి కేంద్రానికి విజ్ఞప్తులు అందాయి. ప్రణాళికా సాయం కోసం గతంలో జాతీయ అభివృద్ధి మండలి కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక కేటగిరీ హోదా కల్పించింది. 1. కొండ, సంక్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు 2. తక్కువ జనసాంద్రత/ అధిక సంఖ్యలో గిరిజన జనాభా 3. ఇరుగుపొరుగు దేశాల సరిహద్దుల్లో వ్యూహాత్మక ప్రాంతాల్లో ఉండటం 4. ఆర్థిక, మౌలిక వసతుల పరంగా వెనుకబాటుతనం 5. రాష్ట్రానికి ఆర్థిక సుస్థిరత లేకపోవటం లాంటి లక్షణాలన్నీ ఉంటేనే గతంలో ప్రత్యేక కేటగిరీ హోదా కల్పించారు" అని మంత్రి తెలిపారు.

"కేంద్ర ప్రాయోజిత పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ఏపీకి 90:10 నిష్పత్తిలో ఇచ్చి ఉంటే 2015-16 నుంచి 2019-20 మధ్యకాలంలో ఎంత అదనపు మొత్తం వచ్చి ఉండేదో దాన్ని భర్తీ చేయటానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. 2015-16 నుంచి 2019-20 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణాల వడ్డీ, అసలును చెల్లించటానికి సిద్ధపడింది. దానిప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు 2018-19లో కేంద్ర ప్రభుత్వం విదేశీ రుణాల తిరిగి చెల్లింపు కోసం రూ.15.81 కోట్లు విడుదల చేసింది. ఏపీ పునర్విభజన చట్టంలోని చాలా అంశాలను అమలు చేశాం. మిగిలినవాటి అమలు వివిధ దశల్లో ఉంది" అని హోం శాఖ సహాయమంత్రి చెప్పుకొచ్చారు.

ఆరోజే జేపీ చెప్పినట్లు రాయలసీమకు ప్రత్యేక హోదా, విశాఖ నగరం మినహా ఉత్తరాంధ్రకు ప్రత్యేక సాయానికి, అందుకు చట్టబద్ధ ఏర్పాటు కోసం మనందరం కలసికట్టుగా కృషి చేసి ఉంటే, ఏపీకి ఈవేళ బలమైన ఆర్థిక పునాది ఏర్పడి ఉండేది.

**2014లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే హోదా కోసం ప్రయత్నం చేయకుండా తాత్సారం చేయటం రెండో సమస్య.**

రాష్ట్ర విభజన అనంతరం 2014లో ఎన్నికలు జరిగి జాతీయ స్థాయిలో, తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాక కూడా హోదా విషయంలో జరిగిన లోపాన్ని సరిచేసే ప్రయత్నం చేయలేదు. పరిస్థితిని, ప్రధాన పార్టీల వాదనల్లోని బలహీనతల్ని గుర్తించి 2014 ఏడాది చివరి నుంచే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుని జేపీ హెచ్చరించారు. ప్రత్యేకహోదాకు ఇతర రాష్ట్రాలు అడ్డం కొట్టే పరిస్థితి ఏర్పడుతోంది కాబట్టి, హోదా పరిధిలోని మిగతా అంశాల్ని పక్కనపెట్టి అందులో కీలకమైన పారిశ్రామిక రాయితీల్ని సాధించుకునేందుకే వెంటనే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎవరి ఆమోదంతో ప్రమేయం లేకుండా యూనియన్ కేబినెట్ ఒక్క సంతకంతో ఈ పనిచేసేయొచ్చని సూచించారు. అలాగే రెవెన్యూలోటు వివరాల్ని వెల్లడించాలని, జాతీయ ప్రాజెక్టుగా చట్టంలో పేర్కొన్న పోలవరాన్ని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసేలా మోదీ ప్రభుత్వాన్ని కోరాలని, ఇందుకు తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని జేపీ బహిరంగ ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని జేపీ అసెంబ్లీలో కోరిన రెండు రోజుల్లోనే అప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత కేంద్రానికి లేఖ రాశారు. ఆ తర్వాత కూడా ఇంకో లేఖ పంపారు. ఏపీకి హోదా వల్ల వచ్చే పన్ను రాయితీల వల్ల తమ పరిశ్రమలు తెలుగు ప్రాంతానికి తరలిపోతాయేమోనన్న ఆందోళనను ఆమె వాటిల్లో వ్యక్తం చేశారు. కానీ ఏపీకి హోదా వద్దని ఆమె అనలేదు. ఈ విషయాలన్నిటినీ కూడా చంద్రబాబు దృష్టికి జేపీ తీసుకెళ్లారు. జయలలిత ఎంతో హుందాగా స్పందించారని, తమ రాష్ట్రానికి నష్టం కలగకుండా చూడాలని కోరారుతప్ప ఏపీకి ఇవ్వొద్దని చెప్పలేదని గుర్తుచేశారు. దీన్ని అవకాశంగా ఉపయోగించుకుని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఒప్పించి వెంటనే హోదా అమలు చేసేలా యూనియన్ ప్రభుత్వాన్ని కదిలించాలని సూచించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుకున్న పరిచయాలతో ఈ పని సులభంగానే అవుతుందన్నారు. కానీ చంద్రబాబే కాదు, కొన్ని పార్టీలు, ప్రజాసంఘాలు కూడా జేపీ దూరదృష్టిని,

రాజ్యాంగబద్ధ వ్యవహారశైలిని బలహీన వ్యూహంగా చూశాయి. మార్చి, 2015లో విభజన హామీల అమలు కోసం కార్యక్రమాల్లో భాగంగా జేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఏపీలోని ప్రధాన పార్టీలు తెదేపా, వైకాపా నేతలు డుమ్మా కొట్టి ఓ గొప్ప అవకాశాన్ని జారవిడిచాయి. కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, కొన్ని ప్రజాసంఘాలు మాత్రం హాజరై సంఘీభావం తెలిపాయి.

ప్రత్యేక హోదా ప్రయోజనాలను వేగంగా సాధించే అవకాశాన్ని వినియోగించుకోవటం కంటే.. అడ్డగోలు రాజకీయంతో, వ్యక్తిగత ఆర్భాటంతో, రోడ్ల మీద రచ్చ చేసి లక్ష్యాన్ని సాధించుకోవటం మీదే ఏపీలోని ప్రధాన రాజకీయ శక్తులు దృష్టి పెట్టాయి. ప్రత్యేకహోదా ఓ కోడ్ మాత్రమే, ఆ సాయాన్ని ఏ రూపంలో అందించినా మనం తీసుకోవటంలో తప్పులేదని జేపీ చెబితే.. రోజుకో మాట మారుస్తూ గందరగోళ పరుస్తున్నారని దానిపైనా కొందరు విమర్శలు, నిందలు గుప్పించారు.

హోదా బదులు ప్యాకేజీ ఇస్తామన్నారంటూ చంద్రబాబు 2016 సెప్టెంబర్‌లో దానికి అంగీకరించారు. ఆ సమయంలో ఒక మౌలికమైన ప్రశ్న తలెత్తింది. హోదాలో పారిశ్రామిక రాయితీలు భాగమా, కాదా?.. ఈ ప్రశ్నకు 'కాదు' అని యూనియన్, చంద్రబాబు ప్రభుత్వం చెప్పాయి. పన్ను రాయితీలు లేని ప్యాకేజీని అందుకే తీసుకున్నామంటూ ఆనాడు బాబు చెప్పారు. కానీ వాస్తవానికి హోదాలో పారిశ్రామిక రాయితీలు భాగమే. లోక్‌సత్తా ఈ విషయాన్ని పలుమార్లు సాధికార వివరాలతో ప్రకటించింది. కానీ 2016లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తటంలో ప్రతిపక్ష వైకాపా, ఇతర శక్తులు విఫలమయ్యాయి. హోదా ఇవ్వాల్సిందేనంటూ వీధిపోరాటాలు చేసి రాజకీయంగా తక్షణ లబ్ధి పొందే ప్రయత్నం తప్ప.. ప్రజలకు హోదా ఫలితాల్ని వేగంగా అందించే ప్రయత్నానికి మాత్రం వారు ఉత్సుకత చూపలేదు. హోదా కంటే ప్యాకేజీతో ఇదిగో ఇంత నష్టం.. అని వారు నిర్దిష్ట ఆధారాలతో ప్రజల్లో ప్రచారం చేసి ఉంటే, యూనియన్ ప్రభుత్వానికి, చంద్రబాబుకి హోదాకి కట్టుబడి ఉండటం తప్ప గత్యంతరం ఉండేది కాదు. వైకాపాను నిలువరించటం కోసం తెదేపా రాజకీయ ఎత్తుగడ, బీజేపీ నిర్లక్ష్యం వల్ల మళ్లీ హోదా డిమాండ్ తెర పైకి వచ్చిందిగానీ.. లేకపోతే ప్యాకేజీతో ఏపీ ప్రజలు సరిపెట్టుకోవాల్సి వచ్చేది. అంతలా ప్రజలు మోసపోయేవారు. ఈ మోసాన్ని వివరిస్తూ లోక్‌సత్తా, కొన్ని ప్రజాసంఘాలు వాదించినా, బుక్‌లెట్‌లు విడుదల చేసినా ఈ గొంతులు చాలలేదు.

చివరికి నాలుగేళ్లు గడిచిపోయాక.. హోదా ఇవ్వలేదు కాబట్టి తూచ్ అంటూ మిత్రపక్షంగా ఉన్న బీజేపీతో తెదేపా తెగతెంపులు చేసుకుంది.

ఇదే సమయంలో అప్పటి ప్రతిపక్షం వైకాపా హోదా విషయంలో రోడ్ల మీద పోరాటాలు చేసిందిగానీ, వాటి ప్రచారానికిచ్చిన ప్రాధాన్యతను పరిష్కారాలకి ఇవ్వలేదు. 2014 ఎన్నికల ఫలితాల రీత్యా తెలంగాణలో ప్రతిపక్షం బలహీనంగా ఉంటే, ఏపీలో అప్పటి ప్రతిపక్ష వైకాపా బలంగా ఉంది. ఈ అవకాశాన్ని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హోదా విషయంలో చట్టసభల్లో సద్వినియోగం చేసుకున్న దాఖలాలు లేవు. పార్లమెంటులో కూడా అధికారపార్టీని రాజ్యాంగపరంగా ఇరకాటంలో పెట్టేలా ప్రశ్నలు సంధించలేదు. ప్రజల కోసం పోరాడుతున్నట్టు కనిపిస్తూ, కేంద్రంతో వ్యక్తిగత అవసరాల రాజీధోరణిని ప్రదర్శించారు. ఎంతసేపూ వ్యక్తిగత, ఎన్నికల రాజకీయ లబ్ధే దృష్టిగా హోదాపై వైకాపా పోరాటం సాగింది. ఆ ఎత్తుగడల్లో కూడా తప్పించుకునే ధోరణులు అనేకం. హోదా ఇవ్వకపోతే ఎంపీలు రాజీనామా చేస్తారని చెప్పి తూచ్ అన్నారు. ఎన్నికల సంవత్సరం వచ్చేశాక.. మొత్తం 25 మంది ఎంపీల్ని తమ పార్టీ నుంచి గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి హోదా సాధిస్తామన్నారు. 2019 ఎన్నికల్లో తెదేపా ఓడిపోయి లోక్‌సభ స్థానాల్లో, అసెంబ్లీలో వైకాపాకి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చినా ఇప్పటికీ ప్రత్యేక హోదా అగమ్యగోచరంగా ఉంది. ఏపీలోని పార్టీల, నేతల అవకాశవాద రాజకీయాలు హోదాపై యూనియన్ ప్రభుత్వం కాలక్షేప ధోరణితో దాటవేయటానికి అనువుగా మారాయి.

**హోదా అంశం గందరగోళంలో పడిందని తెలిశాక కూడా ఇతర రాష్ట్రాల నుండి అభ్యంతరాలు లేకుండా వారిని కూడా ఒప్పించేలా పరిష్కారం రూపొందించి హోదా సాధించుకునే ప్రయత్నం చేయకపోవటం మూడో సమస్య.**

హోదా విషయం గందరగోళంలో పడిందని, ఇతర రాష్ట్రాల అభ్యంరాలను చూపుతూ యూనియన్ ప్రభుత్వం దాటవేస్తోందని గుర్తించాక కూడా ఏపీ నేతలు మేలుకోలేదు. సంఘటితంగా వ్యవహరించే ప్రయత్నం చేయలేదు. రాష్ట్రంలో పార్టీల్ని, ప్రజాసంఘాల్ని ప్రభుత్వం కలుపుకెళ్లటం, ఇతర రాష్ట్రాలను ఒప్పించే ప్రయత్నం చేయటం వంటివి చేయలేదు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాయానికి ఇతర రాష్ట్రాలు ఒప్పుకోకపోవటమే సమస్యయితే.. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనుకబడిన 80-100 జిల్లాలను గుర్తించి హోదా రాయితీల్ని అందించాలని జేపీ ప్రతిపాదించారు. ఈ పరిష్కారాన్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా, ఇతర రాష్ట్రాలకు నష్టం కలగకుండా పరిష్కారం చూపుతూ మన పని నెరవేర్చుకునే నైపుణ్యం, నిబద్ధతతో మన పోరాటాలు ఉండాలన్న విజ్ఞత లేకుండా ప్రధాన పార్టీలు వ్యవహరించాయి.

**హోదా లేబుల్ మాత్రమే..**

**హోదా ద్వారా ప్రజాప్రయోజనాల పరిరక్షణ ముఖ్యం**

ప్రత్యేక హోదా డిమాండ్‌ను సజీవంగా ఉంచటంలో వివిధ పార్టీలు, సంఘాల కృషి ఉందనటంలో సందేహం లేదు. కానీ వారు ప్రధానంగా ప్రత్యేక హోదా పేరు (లేబుల్)ను పరిరక్షించటానికి ప్రయత్నిస్తే, పేరు ఏదైనా హోదాకు తగ్గ పూర్తి ప్రయోజనాలు ప్రజలకు దక్కాలని లోక్‌సత్తా గట్టిగా కృషి చేసింది. ప్రత్యేక హోదా ప్రతిపాదన చేయటంతోపాటు పేరు ఏదైనా ఆ

ప్రయోజనాలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దక్కాలని నిర్దిష్టంగా కృషి చేసింది లోక్‌సత్తా. హోదా పద్దు కింద చాలా ఇచ్చాం అని యూనియన్ ప్రభుత్వం, చాలా తక్కువ ఇచ్చారని రాష్ట్రం కాలక్షేపం చేస్తుంటే, ఏమిచ్చినా హోదాయే ఇవ్వాలని పలు పార్టీలు, సంఘాలు ఆందోళనలు చేస్తుంటే.. వాస్తవాల్ని వెలికితీసి ప్రజల్లో గందరగోళాన్ని తొలగించేందుకు జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ చొరవతో 2018లో ఏర్పాటైన జేఎఫ్‌సీ (సంయుక్త నిజనిర్ధారణ సంఘం)లో కూడా లోక్‌సత్తా కీలకపాత్ర పోషించింది.

**జేఎఫ్‌సీ ఏర్పాటు**

2014లో తెలుగుదేశం, బీజేపీకి మద్దతు పలికిన పవన్ కళ్యాణ్.. హోదా, ఇతర విభజన హామీల అమలుపై ఆలస్యంగా మేలుకొన్నారనటంలో సందేహం లేదు. కానీ చిత్తశుద్ధితో పార్టీలకతీతంగా ముందుకురావటంతో ఆయనకు లోక్‌సత్తా తన వంతు సహకారాన్ని అందించింది. నాలుగేళ్లుగా ప్రభుత్వాలు, ఓట్లు సీట్లు పొందిన పార్టీలు చేయలేని పనిని జేఎఫ్‌సీ కేవలం 14 రోజుల్లో చేసి చూపింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు తాము ప్రత్యామ్నాయం కాదు అని స్పష్టంచేస్తూనే.. ఉన్న సమాచారంతోనే 7 కీలక రంగాల్లో గణించదగ్గ వివరాలను స్పష్టంగా బైటపెట్టింది. ఎంతో ఇచ్చామని కేంద్రం, ఏమీ ఇవ్వలేదని రాష్ట్రం చేస్తున్న వాదనల మధ్య కీలకాంశాలపై ప్రజల్లో గందరగోళాన్ని తొలగించింది. హోదా బదులు ప్యాకేజీ వల్ల ఏపీకి నష్టమేనని జేఎఫ్‌సీ కూడా స్పష్టంగా ప్రకటించింది. ప్రత్యేకహోదా అంటే ఏమిటో వివరించి.. పన్ను రాయితీలు అందులో ఎలా భాగమవుతాయో వివరంగా తెలియచేసింది.

జేఎఫ్‌సీ ఏర్పాటుకు చొరవ చూసిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆ నివేదికను మాత్రం ఉపయోగించుకోలేదు. రిపోర్టును ఉపయోగించి జేపీ లాంటి వారి కృషితో రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించగలిగి ఉంటే ఈవేళ ఆయన రాజకీయంగా బలమైన స్థాయికి ఎదిగేవారు. ఇన్నేళ్లుగా రాజకీయాల్లో ఉండి ఏం సాధించారు అంటే, పవన్‌కి చెప్పుకోవటానికి ఏమీ లేదు. అందువల్లే ఆయన ఇంకా సినీగ్లామర్‌ను దాటి గుర్తింపు పొందలేకపోతున్నారు. ఇప్పుడు కూడా త్వరలో జరగనున్న ఎన్నికల్లో పొత్తులపై మాట్లాడుతున్నంతగా ఎజెండాపై ఆయన దృష్టి పెట్టటం లేదు. మంచి మనసు గల నాయకుడిగా గుర్తింపు ఉన్న పవన్.. ఎజెండాను, అమలుకు రోడ్‌మ్యాప్‌ను కూడా గట్టిగా పట్టించుకోవాలి.

**తెలుగేతర రాష్ట్రాల వారి భాగస్వామ్యంతో స్వతంత్ర నిపుణుల కమిటీ (ఐజీఈ)**

జేఎఫ్‌సీ నివేదికను అటకెక్కించటంతో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా తరపున జయప్రకాష్ నారాయణ్ చొరవ తీసుకుని దేశంలో ఏ రాష్ట్రమూ, యూనియన్ ప్రభుత్వం వేలెత్తిచూపటానికి వీల్లేకుండా తెలుగేతర రాష్ట్రాల నిష్ణాతులతో ఒక స్వతంత్ర నిపుణుల కమిటీ (ఐజీఈ)ని ఏర్పాటు చేశారు. 2014-15 రెవెన్యూ లోటు భర్తీ దగ్గర్నుంచీ, పోలవరం, పన్ను రాయితీల వరకూ కీలకమైన, వివాదాస్పదమైన 10 అంశాలను కమిటీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, సమాఖ్య వ్యవస్థ పరిధిలో సమగ్ర, ఆచరణాత్మక పరిష్కారాలను చూపింది. నివేదికను 2019లో విడుదల చేశారు.

బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీలో భాగంగా ఏపీలోని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సింది ఏడాదికి రూ.50 కోట్లు కాదని, మొత్తంగా సుమారు రూ.24,350 కోట్లు యూనియన్ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని నివేదిక సాధికారికంగా వివరించింది. అత్యంత వివాదాస్పదమైన ప్రత్యేక హోదా పన్ను రాయితీలకు.. పొరుగు రాష్ట్రాలతో ఇబ్బంది లేకుండా, ఆంధ్రప్రదేశ్‌కు నష్టం లేకుండా ఆచరణాత్మకంగా మూడు పరిష్కారాలను సూచించింది. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్రం నిధుల వాటా 90 శాతానికి బదులు కేంద్రం అందిస్తానన్న రూ.16,447 కోట్ల సాయానికి విదేశీ తోడ్పాటు ప్రాజెక్టులు (ఇఏపి) పద్ధతి సరికాదని, దీని ద్వారా ఐదేళ్లలో మహాఅయితే కేవలం రూ.5,000 కోట్లు మాత్రమే ఏపీకి అందుతాయని స్పష్టం చేసింది. ప్రత్యేక సాయానికి 'సెస్' నిపుణుల అధ్యయనం ద్వారా తేల్చిన (క్వాంటిఫై చేసిన) మొత్తం, కేంద్రం ఒప్పుకున్న మొత్తం దాదాపు సమానంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసింది. అయితే ఈఏపీ పద్ధతిలో కాకుండా.. యూనియన్ రాష్ట్ర బకాయిలను చెల్లబెట్టుకునే పద్ధతిలో నిధులనిస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక సాయం ద్వారా న్యాయం జరుగుతుందని తెలిపింది. నాబార్డ్, హడ్కో రుణాలతో పాటు ఆంధ్రప్రదేశ్ సహాయ బాండ్లను కూడా విడుదల చేస్తే.. కేంద్రం ఆర్థిక భారం లేకుండానే ఏపీకి ఇచ్చిన ఆర్థిక హామీల్ని నెరవేర్చ వచ్చునని తెలిపింది. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అసంబద్ధత వల్ల ఆంధ్రప్రదేశ్‌కు పన్నుల పరంగా రూ.3,820 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇది పార్లమెంటు చట్టం ద్వారా జరిగిన తప్పిదం కాబట్టి.. జాతీయ స్థాయి ప్రభుత్వమే భర్తీ చేయాలని స్పష్టం చేసింది. విభజన వల్ల తలసరి ఆదాయంలో దేశంలోనే వెనుకబడిన పెద్ద రాష్ట్రంగా ఏపీ ఉందని, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఉత్తరాంధ్రలు రాష్ట్ర తలసరి కంటే వెనుకబడి ఉన్నాయని, అందువల్ల కేంద్రం తన విచక్షణ పరిధిలో కూడా ఉదారంగా వ్యవహరించి వెనుకబడిన జిల్లాల్లో పెట్టుబడులు పెరిగేలా ఏపీకి ఆర్థికంగా తగురీతిలో అండదండలందించాలని సిఫార్సు చేసింది.

నివేదిక విడుదల సందర్భంగా జేపీ మాట్లాడుతూ, యూనియన్, రాష్ట్ర ప్రయోజనాలంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల ప్రైవేటు వ్యవహారం కాదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులపై రకరకాల వాదనలు ప్రచారంలో ఉన్నాయని, పార్టీలకు అతీతంగా వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పాలన్న ఉద్దేశంతో.. చిత్తశుద్ధితో ఈ నివేదికను రూపొందించామని తెలిపారు.

ఈ నివేదిక ఆంధ్రప్రదేశ్‌కు విభజన సమయంలో ఇచ్చిన హామీలకు సంబంధించినదే అయినా, ఇందులో మన సమాఖ్య

వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలున్నాయని జేపీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించినట్లు అసెంబ్లీ ఆమోదం, ప్రజలను ఒప్పించటం లేకుండా ఆర్టికల్ 3తో ఏకపక్షంగా కేంద్రం రాష్ట్రాల విభజన చేస్తే దీర్ఘకాలంలో అది దేశ ఐక్యతను బలహీనపరుస్తుందని స్పష్టం చేశారు. ఒక రాష్ట్ర విభజన ఎలా చేయాలి, నిధుల విడుదల, పాలన పరంగా రాష్ట్రాలపై కేంద్ర (యూనియన్) ప్రభుత్వ నియంత్రణ ఏ మేరకు ఉండాలి, పాలన ప్రజల చుట్టూ తిరిగేలా కేంద్ర–రాష్ట్ర సంబంధాలను స్థానిక ప్రభుత్వాల వరకూ వికేంద్రీకరించి ఫెడరల్ వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలి తదితర అంశాలకు ఈ నివేదిక ఒక నేపథ్యంగా, వనరుగా ఉపయోగపడుతుందన్నారు.

**ఇందులో ప్రత్యేక హోదా వల్ల ఆంధ్రప్రదేశ్‌కు అందాల్సిన పన్ను, మరియు ఇతర రాయితీల గురించి మూడు పరిష్కారాలతో చేసిన సిఫార్సు ఇది:**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పెట్టుబడులకు పన్ను రాయితీలు సంక్లిష్టమైన, ఒడుపుగా వ్యవహరించాల్సిన, వివాదాస్పదమైన అంశం. ఈ సంక్లిష్ట అంశాన్ని పరిష్కరించటానికి పలు మార్గాలను పరిగణలోకి తీసుకోవచ్చు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, రాయితీలను ఆ ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయటం అందులో ఒక ఆచరణసాధ్య పరిష్కార మార్గం. పలు ప్రత్యేక తరగతి రాష్ట్రాలకు ఇచ్చినట్లు పూర్తి పన్ను మినహాయింపుల్ని కాకుండా.. ఇప్పుడిస్తున్న రాయితీలకంటే గణనీయంగా పెంచి పన్ను మినహాయింపు ప్రయోజనాల్ని మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు విస్తరింపచేయటం రెండో పద్ధతి. మూడోది, ఇతర రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మిగిలిన భారతదేశంలో గుర్తించిన వెనుకబడిన ప్రాంతాలకు కూడా పూర్తి పన్ను రాయితీ ప్రయోజనాల్ని అందించటం.

ఇదేసమయంలో యూనియన్ ప్రభుత్వం అదనంగా ఆంధ్రప్రదేశ్‌లో 100 శాతం ఆర్థిక సాయంతో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధికనుగుణంగా చేపట్టాలి. సహజ వనరులు, స్థానిక నైపుణ్యాలు, మార్కెట్ సామర్థ్యం ఆధారంగా.. పారిశ్రామిక మౌలిక వసతుల ఆధునీకరణ పథకం (ఐఐయుఎస్), మెగా ఫుడ్ పార్క్ పథకం, సమీకృత మౌలిక సదుపాయాల అభివృద్ధి (ఐఐడి) పథకం వంటి సముదాయ పథకాల తరహాలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టవచ్చు.

**వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి..**

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 24,350 కోట్ల అంచనాతో ప్రతిపాదనల్ని రూపొందించింది. జనాభా, ద్రవ్యోల్బణాలకనుగుణంగా ఇది దాదాపుగా బుందేల్‌ఖండ్ ప్యాకేజీతో సమానంగా ఉంది.

యూనియన్ ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద 3 ఏళ్ల పైచిలుకు కాలానికి రూ. 1,050 కోట్లను విడుదల చేసింది. రానున్న సంవత్సరాలలో రూ. 700 కోట్లు చెల్లించనుంది. కేంద్రం ఇచ్చిన కమిట్‌మెంట్‌కి, వెనుకబడిన రాయలసీమ, ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాల అవసరాలకు జిల్లాకు రూ. 50 కోట్ల చొప్పున చేస్తున్న సాయానికి హస్తిమశికాంతరముంది.

ఐదేళ్ల గడువులో నిర్ణీత కాల పద్ధతిలో రూ. 24,350 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలకు అమలు చేయటానికి యూనియన్ ప్రభుత్వం ప్రాధాన్య చర్యలు తీసుకోవాలి.

ఐజీఈ నివేదికను జేపీ అన్ని పార్టీలకు, నేతలకూ అందచేశారు.

**తెలంగాణ సమస్య మరీ ఇంత తీవ్రం కాదు**

విభజన చట్టంలో తెలంగాణకు ఇవ్వాల్సిన హామీలనూ యూనియన్ ప్రభుత్వం సమగ్రం నెరవేర్చలేదు. కానీ అసంబద్ధ సాగునీటి పథకాలు, ఉచితాలతో ప్రజాధనం దుబారా, అప్పులు వంటి సమస్యల్లాగా విభజన హామీలలో జాప్యం తెలంగాణకు మరీ తక్షణ సమస్య కాదు. చిన్న రాష్ట్రంలో పెద్ద మహానగరం హైదరాబాద్ ఉండటం వల్ల ఆ అభివృద్ధి, ఆదాయం వల్ల తెలంగాణ ప్రస్తుతానికి మెరుగైన స్థితిలోనే ఉంది. అందువల్ల ఆర్థిక భద్రత పరంగా ముందు మాట్లాడుకోవాల్సింది ఏపీ గురించి.

**ఏపీ పార్టీల్లో, సమాజంలో అంతర్మథనం కావాలి**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పార్టీలైన వైకాపా, తెదేపా, ఇతర పార్టీల్లో, ప్రజాసంఘాల్లో, పౌర సమాజంలో, ప్రజానీకంలో ఇప్పటికైనా అంతర్మథనం కావాలి. మన వేళ్లతో మన కళ్లు పొడుచుకునే రాజకీయ ధోరణులు, కులం, ప్రాంతం వంటి జాడ్యాల్ని వీడి రాష్ట్రానికి ఏం జరుగుతోందో, మన బిడ్డల భవిష్యత్తుకి ఏం జరుగుతోందో ఆత్మసమీక్ష చేసుకోవాలి. ఎన్నికలప్పుడు తప్ప మిగిలిన సమయాల్లో పార్టీ రాజకీయాల్ని పక్కనపెట్టి వ్యక్తిగతంగా ఎదిగేందుకు, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ఎజెండా మీదే దృష్టి పెట్టాలి. ఐజీఈ ద్వారా 2019లో జేపీ అందచేసిన నివేదిక సిఫార్సు మేరకు గత నెల యూనియన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు 2014–15 రెవెన్యూ లోటు భర్తీ కింద రూ. 10,460.87 కోట్లు విడుదల చేసింది. ప్రజాస్వామ్యంలో నిష్పాక్షికంగా, నిజాయతీగా, వాస్తవాల ఆధారంగా హేతుబద్ధ పరిష్కారాలను సూచించటం ద్వారా ఆలస్యంగానైనా ఫలితాలు వస్తాయనటానికి ఇదే రుజువు. ప్రత్యేక కేటగిరి హోదా, పోలవరం పూర్తి సహా వివిధ ప్రయోజనాలను కూడా ఎఫ్‌డీఆర్ కమిటీ నివేదిక ప్రాతిపదికన యూనియన్ ప్రభుత్వం నుంచి ఏపీ వేగంగా సాధించుకోవాలి.

**పదేళ్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పాలన, రాజకీయాల తీరుతెన్నుల గురించి మరోసారి మాట్లాడుకుందాం.**


### ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదిక యధాతథంగా అమలు..

# ఏపీ రెవెన్యూ లోటు భర్తీకి రూ.10,461 కోట్లు విడుదలపై జేపీ హర్షం




ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ (ఐజీఈ) నివేదికకు అనుగుణంగా యూనియన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి 2014-15 సంవత్సర రెవెన్యూ లోటు భర్తీ కింద 10,461 కోట్లు విడుదల చేయటం పట్ల ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఐజీఈ కన్వీనర్ డా॥ జయప్రకాష్ నారాయణ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన చట్టం నేపథ్యంలో యూనియన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన హామీలపై తమ కమిటీ 2019లో నివేదికను విడుదల చేయగా ఎట్టకేలకు యూనియన్ ప్రభుత్వం స్పందించిందని, నిష్పాక్షికంగా, నిజాయతీగా, పరిజ్ఞానంతో, ఒడుపుగా కృషి చేస్తే ఆలస్యంగానైనా ఫలితాల్ని సాధించవచ్చునటానికి ఆ విజయమే నిదర్శనమన్నారు.

2014-15 రెవెన్యూ లోటు భర్తీ కింద ఏపీకి 10,460.87 కోట్లు యూనియన్ ప్రభుత్వం విడుదల చేసినట్లు మే 23న మీడియాలో వచ్చిన సమాచారంపై జేపీ స్పందిస్తూ, ఈ అంశం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైందని, ఆంధ్రప్రదేశ్‌కి రూ.16878.76 కోట్ల రెవెన్యూ లోటు ఉందని రాష్ట్ర ప్రభుత్వం చెప్పగా, కేవలం రూ.4,118 కోట్లు మాత్రమే యూనియన్ ప్రభుత్వం గ్రాంట్ చేసిందన్నారు. అందులోనూ 3,979.50 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో నిజాలు నిగ్గు తేల్చి ఏపీకి న్యాయంగా రావాల్సిన నిధులు రాబట్టేందుకు యూనియన్ మాజీ మంత్రి, గుజరాత్ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ యోగేందర్ అలఘ్ నేతృత్వంలో స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ నిశితంగా, నిష్పాక్షికంగా వాస్తవాల్ని అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన కొన్ని ఖర్చులు సబబు కాదని తేల్చిందన్నారు. అప్పటి ఏపీ ప్రభుత్వం చేసిన రుణమాఫీ రూ.7,069.67 కోట్లు, యూనియన్ ప్రభుత్వం ఇచ్చిన నిధులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పెన్షన్ మొత్తం రూ.1590.74 కోట్లు చట్టబద్ధంగా, విధిగా యూనియన్ ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరం లేదని, విచక్షణతో ఇవ్వొచ్చని తెలిపిందన్నారు. కానీ విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ కోసం చేసిన వ్యయం, యూనియన్ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చేసిన బీదల పెన్షన్ల వ్యయం, విధిగా చేయాల్సిన ఖర్చయినా, వనరులలేమి వల్ల వాయిదా వేసిన పే రివిజన్ కమిషన్లకనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాలు, కాంట్రాక్టర్లకు చెల్లింపు వంటి వాటి వ్యయం మాత్రం విధిగా ఇవ్వాలని స్వతంత్ర నిపుణుల కమిటీ సిఫార్సు చేసిందన్నారు. ఇది కాకుండా అంతకుముందు ప్రకటించి చెల్లించాల్సిన రూ.138.50 కోట్లు కూడా ఇవ్వాలని పేర్కొందన్నారు. ఈ మొత్తం కలిపి ఏపీకి 2014-15 రెవెన్యూ లోటు కింద రూ.10,493.07 కోట్లు యూనియన్ ప్రభుత్వం చెల్లించాలని కమిటీ సిఫార్సు చేసిందన్నారు. ఇందులో రూ.10461 కోట్లు, అంటే 99.7% యూనియన్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇంకా రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన ఇతర హామీలు కొన్ని అమలు కావాల్సి




ఉందన్నారు. కాని ఒక కీలక అంశం - 2014-15 ఆర్థిక సంవత్సరంలోని రెవెన్యూ లోటు - సంతృప్తికరంగా పరిష్కారమయిందన్నారు.

ఒక పౌర సమాజ సంస్థ, ఉద్యమం పక్షపాతాలు, పార్టీలు పక్కనపెట్టి విశ్వసనీయతతో నిపుణులను సంప్రదించి నిర్దిష్ట వాస్తవాల్ని ప్రజల ముందు, పార్టీల ముందు, ప్రభుత్వాల ముందు పెట్టటం ఎంత కీలకమో, దీనివల్ల ఆలస్యంగానైనా ఎలాంటి సత్ఫలితాలు వస్తాయో ప్రజాస్వామ్య పీఠం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం 2019 లో విడుదల చేసిన నివేదిక రుజువు చేసిందని జేపీ అన్నారు. కమిటీ సభ్యుల్లో ప్రొఫెసర్ అలఘ్, రాఘవాచారి, వి.భాస్కర్, ప్రొఫెసర్ వి.రాధాకృష్ణ ఇప్పటికే దివంగతులయ్యారన్నారు.

**ఏపీకి యూనియన్ ప్రభుత్వ హామీలపై**
**ఎఫ్‌డీఆర్ స్వతంత్ర నిపుణుల కమిటీ సభ్యులు:**
**జాతీయ స్థాయి నిపుణులు:**

1. ప్రొఫెసర్ యోగీందర్ అలఘ్
(గుజరాత్ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్సలర్, సర్దార్ పటేల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ సోషల్ రీసెర్చ్ వైస్ చైర్మన్, యూనియన్ విద్యుత్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మాజీ మంత్రి)
2. ప్రొఫెసర్ అతుల్ శర్మ
(ఓకేడీఐఎస్‌సీడీ, గువహటి, 13వ ఆర్థిక సంఘం సభ్యులు, ఐసీఎస్ఎస్ఆర్ జాతీయ సభ్యులు, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ఢిల్లీ విభాగాధిపతి, ఆర్థిక శాస్త్ర ఆచార్యులు)
3. డా॥ ఎం. గోవిందరావు
(14వ ఆర్థిక సంఘం సభ్యులు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ, న్యూఢిల్లీ డైరెక్టర్, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి మాజీ సభ్యులు, ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ ఛేంజ్, బెంగళూరు మాజీ డైరెక్టర్)
4. ప్రొఫెసర్ కెఆర్ షణ్ముగం (మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, చెన్నై డైరెక్టర్, ప్రొఫెసర్)

**స్వతంత్ర నిపుణుల బృందంలో సభ్యులు:**

1. అజేయ్ కల్లాం
(ఐఏఎస్ రిటైర్డ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి)
2. సి. ఆంజనేయరెడ్డి
(ఐపీఎస్ రిటైర్డ్, తెలంగాణ పోలీస్ అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్)
3. వి. భాస్కర్
(ఆంధ్రప్రదేశ్ మాజీ ఆర్థిక కార్యదర్శి)
4. చెంగల్‌రెడ్డి
(కన్సార్షియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్)
5. హెచ్‌జె దొర
(ఐపీఎస్ రిటైర్డ్. ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ, కేంద్ర మాజీ విజిలెన్స్ కమిషనర్)
6. ప్రొఫెసర్ ఎస్.గలాబ్
(సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ - సెస్ డైరెక్టర్)
7. కె. మాధవరావు
(ఐఏఎస్ రిటైర్డ్, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్)
8. జస్టిస్ ఎంఎన్ రావు
(హిమాచల్‌ప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్ పర్సన్)
9. కె. పద్మనాభయ్య
(ఐఏఎస్ రిటైర్డ్, భారత ప్రభుత్వ హోం శాఖ మాజీ కార్యదర్శి)
10. జస్టిస్ పర్వతరావు
(ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి)
11. ప్రొఫెసర్ ఆర్. రాధాకృష్ణ
(సెస్ చైర్మన్)
12. డా॥ రాఘవాచారి
( విశాలాంధ్ర మాజీ ఎడిటర్)
13. డా॥ కె. సుజాతారావు
(ఐఏఎస్ రిటైర్డ్. యూనియన్ ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి)
14. డా॥ కెఆర్ వేణుగోపాల్
(ఐఏఎస్ రిటైర్డ్. ప్రధానమంత్రి మాజీ కార్యదర్శి)
15. డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
(స్వతంత్ర నిపుణుల కమిటీ కన్వీనర్, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకులు)

కమిటీలో పాలుపంచుకుని విశిష్ట కృషి చేసి తమ నైపుణ్యాన్ని, విశ్వసనీయతను తెలుగు ప్రజల కోసం పణంగా పెట్టిన నిపుణులకు ఎఫ్‌డీఆర్, తెలుగు ప్రజలు రుణపడి ఉన్నారని వారందరికీ జయప్రకాష్ నారాయణ్ మనసారా కృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షేమం ప్రజల సాధికారతకు ఉపయోగపడాలనుకున్న

# గొప్ప పాలకుడు ఎన్.టి.ఆర్

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

ఎన్.టి రామారావు గారు భౌతికంగా మన మధ్య లేకున్నా మనందరి గుండెల్లో పదిలంగా ఉన్నారు. కాలం గడుస్తున్నకొద్దీ విలువ పెరగటం కొద్దిమంది వ్యక్తుల విషయంలోనే సాధ్యం. అటువంటి అసాధారణ నాయకులు ఎన్.టి రామారావు గారు. ఉన్నకొద్దీ ఆయన స్థాయి పెరుగుతోందే తప్ప తగ్గటం లేదు. శకపురుషుడు అనే పదానికి పూర్తిగా అర్హుడాయన.

ఎన్.టి.ఆర్‌తో పోట్లాడినవాళ్లు, ఆయన్ను వ్యతిరేకించినవారు సైతం ఓ ఇద్దరు ముగ్గురు కలిస్తే ఆయన గురించే ఎక్కువ చర్చించుకుంటారంటే అతిశయోక్తి కాదు. అంత బలమైనది ఆయన వ్యక్తిత్వం. మనం స్మరించుకోవటం వల్ల పెద్దాయనకు ఒరిగేదేమీ లేదు, కానీ సరైన మార్గం వైపు మళ్లటానికి మనందరికీ గొప్ప స్ఫూర్తి లభిస్తుంది.

ఒక కళాకారుడిగా ఆయన పాత్ర, మన భాష, సంస్కృతి, సాహిత్యం, ఉనికిపై వారి ప్రభావం గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. చాలామందికి తెలుసు. కానీ మిగతా రంగాల్లో ఎన్.టి.ఆర్ ప్రభావంపై ఎక్కువమందికి లోతైన అవగాహన లేదు. గొప్ప నాయకుడు, అసాధారణ ప్రభావం చూపిన వ్యక్తి, లక్షల మందిని కదిలించిన మనిషి.. వీటిని దాటి ఆయన కృషిని చూడాలి.

42 ఏళ్ల క్రితం నేను ఐఏఎస్‌కి ఎంపికై శిక్షణలో ఉన్నప్పుడు ఓ సహచరుడు మాటల సందర్భంగా ప్రశ్న అడిగాడు. 'ఏపీలో ఏ భాష మాట్లాడతారు' అని. అప్పట్లో దేశంలో హిందీ తర్వాత ఎక్కువమంది మాట్లాడే భాష తెలుగే. నేను సాధారణంగా సౌమ్యుడిని. కానీ ఆ ప్రశ్న కోపం తెప్పించింది. 'మీ యూపీ రాష్ట్రంలో ఏ భాష మాట్లాడతారు' అని ఎదురు ప్రశ్నించాను. 'ఏం అడుగుతున్నావ్' అన్నాడు. 'నువ్వేం అడుగుతున్నావ్' అన్నాను.. అప్పటికీ ఇప్పటికీ మా మధ్య మాటల్లేవు. అదే ఎన్.టి.ఆర్ ముఖ్యమంత్రి అయ్యాక చూస్తే పరిస్థితిలో ఎంతో మార్పు!

అప్పట్లో ఎన్నికల జరుగుతున్న సందర్భంగా జమ్మూకాశ్మీర్‌లో పర్యటించాను. ఆ రోజుల్లో ముస్లింలలోని సున్నీలు నేషనల్ కాన్ఫరెన్స్‌కి, షియాలు, హిందువులు కాంగ్రెస్‌కి ఎక్కువగా మద్దతు పలుకుతుండేవారు. అందుకే వారిని అడుగుతుండేవాడిని- 'మీరు సున్నీలా, షియాలా అని'. వాళ్లకు విషయం అర్థమయ్యేది. తమ రాజకీయ, సామాజిక సమాచారం చెప్పాక.. ఎక్కడి నుంచి వచ్చారని నా వివరాలు కూడా అడిగేవారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అనగానే.. 'హాత్ మిలావ్' అనేవాళ్లు. ఎందుకని అడిగితే.. ఎన్.టి



రామారావు అని చెప్పేవాళ్లు. 'ఎన్.టి.ఆర్ కేంద్ర ప్రభుత్వంతో పోరాడుతున్నారు, మేం కూడా పోరాడుతున్నాం' అని సంతోషం వ్యక్తం చేసేవారు. పడవ నడిపేవారు, జట్కావాలాలు, పండ్లు కూరగాయలు అమ్మేవారు సహా పలువురు ఇదేరీతిలో చెప్పారు. అంతగా ఆయన తెలుగు ఖ్యాతిని వ్యాపింపచేశారు. తెలుగు భాష ఒకటి ఉంది అని యావత్ భారత జాతికి చాటిచెప్పిన వ్యక్తి ఎన్.టి రామారావు గారు. తెలుగు జాతికి, భాషకి, సంస్కృతీసాహిత్యాలకి ఓ ఉనికిని ప్రసాదించిన మహామనీషి ఆయన.

**పెత్తందారీ రాజకీయాన్ని జనరాజకీయంగా మార్చారు**

మూడోది, ఎన్‌టీఆర్ తెచ్చిన పెద్ద మార్పు.. పెత్తందారీ రాజకీయాన్ని జనరాజకీయంగా మార్చటం.

మన దేశంలో రాజకీయం చాలామంది చేశారు. కానీ ఎన్.టి.ఆర్‌కి ముందు రాజకీయం అంతా పెత్తందారుల చుట్టూ తిరుగుతుండేది. తెలుగునాట కాంగ్రెస్ పార్టీ నేతలు గ్రామాల్లో మునసబులు, కొందరు మోతుబరులని తప్ప ప్రజలను పట్టించుకునేవారు కాదు. ఎన్నికలొస్తే 10-20 లారీలలో కార్యకర్తలు సభలకు వెళ్తుండటం, ఊళ్లలో నుంచి ఆ వాహనాలు వెళ్తున్నప్పుడు మనందరం వాళ్లకి మంచినీళ్లు, పానకం వంటివి అందించటం మాత్రమే జరుగుతుండేది. అదే రాజకీయం. గెలిచిన నేతలు ఎప్పుడో తప్ప ఐదేళ్ల దాకా వారి ముఖం కూడా చూపించేవారు కాదు. అలాంటి పైస్థాయి రాజకీయాన్ని

ఎన్.టి.ఆర్ నేలకు దించారు. ప్రజలే దేవుళ్లు అని వారికి పట్టం కట్టారు. దీంతో ఏ పార్టీ అయినా జనంతో మమేకం కాకుండా రాజకీయం చేస్తే మనుగడ లేని పరిస్థితి వచ్చింది. ఎన్.టి.ఆర్ ఒరవడి దిద్దిన 'మాస్ పాలిటిక్స్' క్రమంగా దేశవ్యాప్తమైంది.



**ఎన్.టి.ఆర్ ఎమ్మెల్యేల్ని గెలిపించిన డబ్బుతో ఇవాళ ఒక కుటుంబంలో ఓట్లు కూడా రావు**

అలాగే రామారావు గారు తన జనాకర్షణతోపాటు విశ్వసనీయత ద్వారా ఓట్లు పొందారు తప్ప కొనుగోలు చేయలేదు, డబ్బు రాజకీయాలు చేయలేదు. 1983లో ఆయన ఎన్నికల్లో గెలిచినప్పుడు రూ.10 వేలతో వారి పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. అప్పట్లో బాగా కష్టం అనుకున్న నియోజకవర్గానికి కూడా రూ.25,000 మించి ఖర్చు పెట్టలేదు. ఇవాళ పది వేలకు ఒక కుటుంబంలో ఓట్లు కూడా రావు. ఇటీవల తెలంగాణలో మునుగోడు అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో చూశాం. ఒక పేద దేశంలో, చిన్న రాష్ట్రంలో, ఒక అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో, ఫలితం వల్ల ఎటువంటి ప్రభావమూ ఉండని ఎన్నికలో చేసిన ఖర్చు.. బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో 650 స్థానాలకు రెండు ప్రధాన పార్టీలూ– కన్జర్వేటివ్, లేబర్ నుంచి పోటీ చేసిన 1300 మంది అభ్యర్థులూ కలిపి చేసిన ఖర్చు కంటే ఎక్కువ. ఇవాళ ఈ స్థాయికి చేరిన మన ధనరాజకీయాన్ని చూస్తే ఎన్.టి.ఆర్ జనరాజకీయం ప్రాధాన్యత అర్థమవుతుంది.

**ఎన్.టి.ఆర్ తెచ్చిన మార్పుల్లో ఒక్కటైనా లేకుండా మన రోజు గడవదు**

అదే ఒరవడిలో ఎన్.టి.ఆర్ స్థానిక ప్రభుత్వాల్లో మేయర్ స్థాయి వరకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు, క్యాంపు రాజకీయాల స్థానంలో ప్రజలు కేంద్రబిందువుగా రాజకీయం చేశారు. మహిళలకు ఆస్తిహక్కు, మండల వ్యవస్థ ఇలా ఏం చేసినా పాలన జనానికి దగ్గరగా తీసుకువెళ్లారు. జనానికి దూరంగా ఉండే పెత్తందారుల పాలనను ఆయన తోసిపుచ్చారు. 'కొద్దిమంది పెద్దలు గద్దెనెక్కితే అది స్వరాజ్యం కాదయ్యా.. సామాన్యుడికి దగ్గరగా అధికారం రావాలి' అన్న గాంధీ గారి మాటల్ని పూర్తిగా ఆచరించారు. ఎన్.టి.ఆర్ పెద్దగా పుస్తకాలు చదవలా, మాస్టర్స్ డిగ్రీలు పొందలా.. కానీ జీవితాన్ని పరిపూర్ణంగా అధ్యయనం చేశారు. విద్య, వైద్యం, రవాణా ఇలా పలు రంగాల్లో ఉమ్మడి ప్రయోజనాల కోసం మౌలిక కృషి చేశారు. ఎన్.టి.ఆర్ తీసుకొచ్చిన మార్పుల్లో చాలావరకూ ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వాటిని తొలగించాల్సిన అవసరం రాలేదు. విద్యార్థుల బస్ పాస్‌ల దగ్గర్నుంచి ఆయన తెచ్చిన మార్పుల్లో ఏదో ఒకటైనా అన్ని వయసులవారి రోజువారీ జీవితంలోనూ అనుభవంలోకి వస్తూనే ఉంటుంది. ఎన్.టి.ఆర్ సంకల్పానికి, పాలనా సామర్థ్యానికి ఇది గొప్ప నిదర్శనం.

**ఫెదరలిజాన్ని బలోపేతం చేసి రాష్ట్రాల దశ, దిశ మార్చారు**

మరో అంశం ఫెదరలిజం. ఈనాడు కూడా చాలామందికి ఫెదరలిజం అంటే తెలియదు. ఓ పదిశాతం మందికి మినహా మిగిలినవారికి అదో పదంగానే తెలుసు. సమాఖ్య వ్యవస్థ అనే సంక్లిష్టమైన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఢిల్లీని కదిలించి ఫలితాల్ని సాధించిన నేత ఎన్.టి.ఆర్. ఆయన వచ్చేదాకా ప్రజల్లో ఎంత మద్దతు ఉన్నా, రాజకీయంగా ఎంత బలం ఉన్నా కూడా రాష్ట్రాలు ఢిల్లీకి గులాములుగానే బతికాయి. రాష్ట్రాలకు ఉనికి, గుర్తింపు, వనరులు, అధికారాలు లేవు. ఢిల్లీలో ప్రధానమంత్రి కనుసైగ చేస్తే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలిపోతుండేవి. యూనియన్ తీరుని ఎన్.టి.ఆర్ ధైర్యంగా ప్రశ్నించారు. ఈ పోరాటంలో భాగంగా ఉత్తరాన ఉన్న ఒరిస్సా నుంచి బిజూ పట్నాయక్‌ను, దక్షిణాన తమిళనాడు నుంచి కరుణానిధిని, పశ్చిమంలోని కర్ణాటక నుంచి రామకృష్ణ హెగ్డేను, ఇంకాస్త ఉత్తరాన ఉన్న పశ్చిమ బెంగాల్ నుంచి జ్యోతిబసుని కలుపుకుని 'కాంక్లేవ్'ల పేరుతో సదస్సులు నిర్వహించారు. సామాన్య ప్రజల్లో సైతం జాతీయ స్థాయి ప్రభుత్వం అంటే ఏమిటి, సమాఖ్య ప్రభుత్వం అంటే ఏమిటి, ప్రజాస్వామ్యం అంటే ఏమిటి అనే చైతన్యం పెంచారు. ఈ దేశంలో రాష్ట్రాలకి ఉనికి, గుర్తింపు వచ్చాయంటే అందులో ప్రధాన పాత్ర ఎన్.టి.ఆర్‌ది. ఈవేళ పార్టీల నాయకులు రాజకీయంగా ఎన్నో చెబుతుంటారు గానీ.. వాస్తవానికి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర భవిష్యత్తుని నిర్దేశిస్తున్నారన్నది వాస్తవం. అంతగా ఈవేళ ఫెదరలిజం బలపడింది. రాజకీయం కుళ్లిపోతున్న కాలంలో సమాఖ్య వ్యవస్థ బాగా బలపడింది. దానికి ప్రధానంగా ఆద్యుడు రామారావు గారు.

**అన్నం పెట్టటమే కాదు.. అభివృద్ధికీ బాటలు వేశారు**

ఇక ఎన్.టి.ఆర్ సంక్షేమం గురించి చాలామందికి తెలుసు. రూ.2 లకు కిలో బియ్యం పథకం, రూ.50 లకు విద్యుత్తు వంటి పథకాలు ప్రాచుర్యం పొందాయి. ఆయన ఎప్పుడూ అనేవారు– కాలే కడుపుకి అన్నం పెట్టకపోతే ఎలా అని. కానీ అంతటితో ఆగితే ఆయన పరిపాలనాదక్షుడు కాదు. ఒక పక్కన సామాన్యుడికి తాత్కాలిక అవసరాల్ని తీరుస్తూనే, మరోపక్క బీదరికాన్ని శాశ్వతంగా తొలగించి ప్రజలకు సాధికారత కల్పించటానికి దీర్ఘకాలిక ప్రణాళికల్ని అమలు చేశారు. తాత్కాలిక సంక్షేమం, అభివృద్ధి రెంటి మధ్యా సమతూకాన్ని ఆయన పాటించారు. ఓ తెలుగుగంగ వచ్చినా, గాలేరు–నగరి, హంద్రీనీవా వచ్చినా, వంశధార, శ్రీరాంసాగర్ రెండో దశ వచ్చినా, విద్యుత్‌ప్లాంట్లు వచ్చినా, రోడ్ల నిర్మాణం వంటివి అయినా ఈ సమతూకం నుంచే, సంక్షేమం–అభివృద్ధిని కలిపి చూడటం వల్లే వచ్చాయి. తాత్కాలికంగా తాయిలాలిస్తే బతుకులు బాగుపడతాయనే భ్రమ ఆయనకు ఏనాడూ లేదు. సామాన్యుల కష్టాల్ని తీరుస్తూనే, వారి కన్నీటిని తుడుస్తూనే, దీర్ఘకాలంలో ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడాలి, ఆత్మగౌరవంతో బతకాలి, ఏ కులంలో, ఏ తల్లి గర్భాన పుట్టినా.. ఫలానా కుటుంబంలో పుట్టానని ఏ బిడ్డా కన్నీరు

కార్చకూడదని తపన పడ్డారాయన.

**1984 నుండే ఆర్థిక సరళీకరణను అమలు చేసిన నాయకుడు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా యన్‌టిఆర్ వచ్చేటప్పటికి ఆర్థిక సరళీకరణ ఇంకా లోతుగా వేళ్లూనుకోలా. భారతదేశ రాజకీయాల్ని విశిష్టంగా ప్రభావితం చేసిన మరో తెలుగు నేత పి.వి నరసింహారావు గారి ఆధ్వర్యంలో 1991 నుండి మన దేశంలో ఆర్థిక సంస్కరణలు వేగవంతమయ్యాయి. కానీ 1984 సమయంలోనే, లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యం బలంగా ఉన్న సమయంలోనే యన్‌టిఆర్ అమెరికా వెళ్లి పెట్టుబడుల కోసం ప్రయత్నం చేశారు. నిజాయతీ, నిబద్ధత, సామర్థ్యం గల అనేకమంది ఎన్నారైలు తెలుగునేలకు తిరిగొచ్చి అభివృద్ధి చేసేలా ఒప్పించగలిగారు. ఆ సమయంలోనే ఆయన పార్టీలో ఆగస్టు సంక్షోభం వచ్చింది. తిరిగి ఎన్నికల్లో నెగ్గాక కూడా ఆ కృషిని ఆయన కొనసాగించారు. అన్నీ ప్రభుత్వం చేయాలన్న వైఖరికి ఆయన విరుద్ధం. ప్రయివేటు రంగం సమర్థంగా చేయగలిగే పనులను ఆ రంగానికే వదిలేసేవారు. ఆర్థిక సరళీకరణకు ఎంతో ముందుగానే బాటలు వేసిన నేత యన్‌టిఆర్.

**ప్రజల పట్ల నిరంతర తపన**

1994లో అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రంలో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటోంది. ప్రతిరోజూ వేకువజామున సమావేశంలో 'జయప్రకాష్ గారూ! రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. మునిగిపోతాం' అని తీవ్ర ఆవేశంగా ఆక్రోశాన్ని వ్యక్తం చేసేవారు. ఎన్.టి.ఆర్ ఆవేశమంటే ఎలా ఉంటుందో ఆయన దగ్గర ఉన్నవారికి తప్ప బయటివారికి తెలియదు. ఆయన్ని ఆవేశాన్ని చల్లార్చి ఎదుర్కోవటం అనితరసాధ్యమనిపిస్తుంది. ఆయన్ని చల్లబరిచి, కూర్చోబెట్టి 'ఆందోళన పడకండి. జాగ్రత్తగా పర్యవేక్షిద్దాం. మీరు మంచి పునాదులు వేశారు. క్రమంగా ఫలితాలొస్తాయి' అని నచ్చచెప్పేవాణ్ణి. నేను వైద్యుడిని కావటం వల్ల ఆ ఉపమానంతో చెప్పేవాడ్ని. 'బిడ్డ పుట్టాలన్నా 40 వారాలు పడుతుంది. బలవంతంగా బయటకు తీయటం సాధ్యం కాదు' అని. మళ్లీ మర్నాడు తెల్లారి గం॥ 4..30కి మొదలు. 'రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అభివృద్ధి ఎలా?'.

**ఎంత తపన! ఎంత తపన!!**

**ఒక్క రూపాయి ప్రజాధనం కూడా దుర్వినియోగం చేయలేదు**

ఎన్.టి. రామారావు గారు అవినీతిని అసహ్యించుకునేవారని అందరికీ తెలుసు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఉద్యోగిగా ఎలా నిక్కచ్చిగా ఉన్నారో, ముఖ్యమంత్రిగా కూడా అవినీతి పట్ల అంత కఠినంగా వ్యవహరించారు. అంతేకాదు, ఒక్క రూపాయి కూడా ప్రజాధనాన్ని ఆయన వృధా చేయలేదు. నేను కచ్చితంగా చెప్పగలను. ఒక్క రూపాయి కూడా! ప్రాణం పోతున్నా కూడా ఆ పని చేయరాయన.

ప్రజాధనం దుర్వినియోగం చేయటం ఎన్.టి.ఆర్ పాపంగా భావించేవారు. జీవితమంతా కూడా అన్ని సుఖాలూ చూసిన మనిషి. సొంత సంపాదనతో రారాజులా బతికిన మనిషి.. అలాంటి వ్యక్తి ఇంటెలిజెన్స్ వారు ముఖ్యమంత్రి కారు మార్చాలి అంటే ఒప్పుకోలేదు. కారు మార్చకపోతే భద్రతాపరంగా సమస్యలొస్తాయి అని మొత్తుకున్నా వినిపించుకోలేదు. అప్పట్లో కొత్త అంబాసిడర్ కారు ఖరీదు రూ.2 లక్షలు. కానీ రామారావు గారు ససేమీరా అన్నారు. పాత కారునే రిపేరు చేయించమన్నారు.

సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయం బ్లాకు పాడయినా కూడా అదే ధోరణి. పునర్నిర్మాణానికి ఎన్.టి.ఆర్ ఒప్పుకోలేదు. ఎందుకు కోటి రూపాయలు దండగ అని దాటవేశారు. మరీ అలర్జీ, జలుబు వస్తోందని నేను పట్టుబట్టి పది వేల రూపాయలతో ఫ్లోర్ బాగుచేయించాను. అది తప్ప ఇంకే రిపేరూ చేయలేదు. ప్రజాధనాన్ని అంత పవిత్రంగా భావించేవారు, రూపాయి ఖర్చు పెడితే పది రూపాయల ఫలితం వచ్చేలా ఖర్చు చేసేవారు. ప్రజాధనాన్ని ఇష్టారాజ్యం దుర్వినియోగం చేస్తున్న ప్రస్తుత రాజకీయంలో ఎన్.టి.ఆర్ విలువల్ని అర్థం చేసుకోవటం కూడా కష్టం. ఆయనో పిచ్చోడుగా కనపడతాడు.

**పార్టీ గుత్తాధిపత్యానికి తెరదించారు.. జాతీయ స్థాయిలోనూ ప్రత్యామ్నాయం తెచ్చారు**

ఎన్.టి రామారావు గారు వచ్చేదాకా స్వతంత్రం తెచ్చిన కాంగ్రెస్ పార్టీకి దేశంలో తిరుగులేదు. గుత్తాధిపత్యం అప్రతిహతంగా కొనసాగుతుండేది. అలాంటి కాంగ్రెస్‌కు రాష్ట్రంలో ఎలాగైతే ప్రత్యామ్నాయం తీసుకొచ్చారో, జాతీయస్థాయిలో కూడా అలాగే ప్రత్యామ్నాయాన్ని ఎన్.టి.ఆర్ తీసుకొచ్చారు. 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం ఆ సానుభూతి వల్ల కర్ణాటకలో ఎంతో ప్రజాదరణ ఉన్న జనతా పార్టీ కూడా లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయింది. వాజపేయి లాంటి హేమాహేమీ నేతలు ఓడిపోయారు. ఇవాళ దేశంలో అధికారంలో ఉన్న బీజేపీకి కేవలం రెండు స్థానాలు వచ్చాయి. అలాంటి పరిస్థితుల్లో ఎన్.టి.ఆర్ తెలుగునాట 35 స్థానాలను గెలుచుకుని దేశంలో ఏకైక ప్రతిపక్ష పార్టీగా నిలిచారు. ఆ తర్వాత ప్రతిపక్షాలన్నిటినీ కలిపి, వీరోచిత పోరాటం చేసి, పార్లమెంటు బయట, లోపల ధర్మయుద్ధం చేసి ఈ దేశంలో ఒకే పార్టీ స్థానంలో ప్రత్యామ్నాయాన్ని తీసుకొచ్చారు.

**సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సమతూకంతో ఎన్.టి.ఆర్ చూపిన మార్గం నేడు భారత్‌కి అనుసరణీయం**

సంక్షేమానికి, దీర్ఘకాలిక అభివృద్ధికి సమతూకాన్ని సాధిస్తూ ప్రజల సాధికారత కోసం ఎన్.టి.ఆర్ చూపిన పాలనాదక్షత ఇవాళ భారతదేశానికి ఎంతో అవసరం. అద్భుత ప్రగతిని సాధించే అవకాశం మన దేశానికి ఉన్నా.. అది యథాతథ పరిస్థితితో, ఆషామాషీ వ్యవహారశైలితో జరగదు. మన దేశంలో ఏ తల్లీతండ్రీ కూడా తమ పిల్లల భవిష్యత్తును తాకట్టు పెట్టి అప్పుచేసి పప్పుకూడు తినరు. ఈవేళ్టి ఖర్చులు కొంత తగ్గించుకుని పిల్లల భవిష్యత్ అవసరాల కోసం పొదుపు చేస్తారు. మనందరం అలా ఎదిగినవాళ్లమే. మన తల్లిదండ్రులు అలా చేశారు కాబట్టే.. ఎదిగాం. మనం సామాన్య కుటుంబాల నుంచే వచ్చాం, కోటీశ్వరుల కుటుంబాల నుంచి రాలే. కానీ వాళ్లు ఆర్థిక క్రమశిక్షణ పాటించారు కాబట్టే మన తాతల కంటే, తల్లిదండ్రుల

కంటే గౌరవంగా, ఉన్నతంగా బతకగలుగుతు న్నాం. కేవలం వాళ్ల పొదుపరితనం, ముందుచూపు, పెట్టుబడుల వల్ల ఈ స్థాయిలో ఉన్నాం. అంతేగానీ వాళ్లు అప్పు లు చేసి పప్పుకూడు తిని మన మీద అప్పుల భారం వేసి దివాలా తీసేలా చేయలేదు. పాలనలో ఎన్.టి.ఆర్ చూపిన ఆ ఇంగితజ్ఞానం, విజ్ఞత ఈవేళ ఈ దేశంలో కావాలి.

**స్వల్పకాలంలోనే ఇన్ని పనులూ**

వీటిల్లో ఏ ఒక్క పని చేసినా కూడా చరిత్రలో నిలిచిపోతారు. ఇన్ని పనులూ ఒక్క మనిషి-ఎన్.టి.ఆర్ చేశారు. ఆయన 30 ఏళ్లు అధికారంలో లేరు. 1983లో వచ్చె, 89లో పోయె.. 1994లో వచ్చె, 95లో పోయె. ఇంత స్వల్పకాలంలో ఇంత విశిష్ట పాత్రను జాతీయ స్థాయిలో పోషించటం అనితరసాధ్యం. అందుకే ఆయన మనందరి గుండెల్లో గూడుకట్టుకున్నారు, ఆయన రాజకీయ ప్రత్యర్థులు సైతం ఆయన్ని గౌరవిస్తారు.

**ఓటు మీకు నచ్చినవారికి వేసుకోండి..**

**కానీ కులాన్ని దాటి మీ అభివృద్ధి, బిడ్డల భవిష్యత్తు కోసం ఆలోచించండి**

ఎన్.టి.ఆర్ కృషిని చూశాక నేటి రాజకీయాన్ని చూస్తే నిర్వేదం కలుగుతుంది. కానీ నిరాశ చెందనక్కర్లేదు. ఆయన ఆశయాలు, వెదజల్లిన బీజాలు మన చుట్టూనే ఉన్నాయి. వాటి నుంచి మనం స్ఫూర్తిని పొందాలి. ఎన్.టి.ఆర్ కులం, మతం, ప్రాంతం వంటివి పట్టించుకునేవారు కాదు. చివరికి పార్టీని కూడా ఒక పరిధి దాటి పట్టించుకునేవారు కాదు. ఎన్నోసార్లు అంటుండేవారు- 'పార్టీ ఏముందండీ, పూర్వం మన పార్టీ వాళ్లున్నారా? మంచి చేసి ప్రజలను మెప్పించటం ముఖ్యం' అనేవాళ్లు. అందుకే ప్రజలకు, ముఖ్యంగా తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.. 'ప్రతి దాన్లో కులం జొప్పించకండి. ఎన్నికల్లో తప్ప మిగిలిన సమయాల్లో పార్టీల్ని పక్కనపెట్టండి. మనకు జరిగే మంచి ఏమిటి, పదేళ్ల తర్వాత జరిగే మంచి ఏమిటి, మన పిల్లలకు జరిగే మంచి ఏమిటి.. ఇప్పుడున్న తీరు ఇలాగే కొనసాగితే 20 ఏళ్ల తర్వాత మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందా, ఇలాగే ఉంటుందా' అని ఆలోచించండి. స్వచ్ఛంగా, హేతుబద్ధంగా ఆలోచించండి. ప్రతి పౌరునికీ ఈ ఇంగితజ్ఞానం వస్తే చాలు. కచ్చితంగా మన సమాజం ఆ ఉన్నతస్థాయిని సాధిస్తుందనే విశ్వాసం నాకు ఉంది. పితృసమానులు ఎన్.టి రామారావు గారి స్మృతికి శతజయంతి సందర్భంగా అంజలి ఘటిస్తూ.. వారి జీవితం, కృషి వందేళ్ల భారతదేశ దిశగా ప్రస్థానంలో వ్యక్తులుగా, వ్యవస్థగా మనకు, ముఖ్యంగా యువతకు స్ఫూర్తినిస్తాయని ఆశిస్తున్నాను.

**(ఎన్.టి.ఆర్ శతజయంతి ప్రత్యేక సంచిక నుండి)**

# చుక్కల భూములపై ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

రాష్ట్రంలో దశాబ్దాల క్రితం నుండి అత్యంత కీలకమైన 'చుక్కల భూముల' సమస్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిష్కారం చూపుతూ ప్రకటన చేయటం అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 97,471 రైతు కుటుంబాలకు మేలు జరుగుతుందని, దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన 2,06,171 ఎకరాల చుక్కల భూములపై రైతులకు సంపూర్ణ హక్కులు లభిస్తాయన్నారు. చుక్కల భూముల విషయంలో ప్రభుత్వమే తొలి ముద్దాయని, రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి అలసిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అమలుకి, శాశ్వత పరిష్కార నిర్వహణకి ప్రతి జిల్లాలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని, లేకుంటే రైతులు మళ్లీ లంచాలతో దళారుల బారిన పడే అవకాశం ఉందని భీశెట్టి అన్నారు. సమావేశంలో మాతృభూమి సేవా సంఘ కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు పాల్గొన్నారు.

## వ్యక్తిగత కార్యక్రమం కాదు

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపనను ప్రజల కార్యక్రమంగా కాకుండా వ్యక్తిగత కార్యక్రమంలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహించటం విచారకరమని లోక్‌సత్తా పార్టీ విజయనగరం జిల్లా కార్యదర్శి అల్లంశెట్టి నాగభూషణం మీడియాతో మాట్లాడుతూ అన్నారు. వివిధ పార్టీల నేతలతోపాటు జిల్లాకు ఎంతో సేవ చేసిన వారిని మాటవరకు కూడా పిలవలేదన్నారు. సమావేశంలో లోక్‌సత్తా నేతలు పొలుపర్తి అప్పారావు, నగర కార్యదర్శి పి.ఎల్.ఎన్ రాజు, శిమ్మ శ్రీను, పిల్లా ఆదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణలో కీలక విజయం

యూనియన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి 2014-15 రెవెన్యూలోటు భర్తీ కింద రూ.10,461 కోట్లు విడుదల చేయటం జేపీ కృషి వల్లే సాధ్యమైందని లోక్‌సత్తా పార్టీ నేతలు వివిధ జిల్లాల్లో మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులెన్నో కూడా నిర్ణయించలేక, ఒకతాటిపైకి వచ్చి అందుకోసం పోరాడలేక తెలుగు నేతలు కుమ్ములాటల్లో మునిగిపోయి ఉంటే, రాష్ట్ర ప్రజల ఆర్థిక భవిష్యత్తు కోసం జేపీ పోరాడి ఒక కీలక విజయం సాధించారని రాష్ట్ర నేతలు వెంకటరమణ బాబు అనంతపురం జిల్లా రాయదుర్గంలో, ఆకుల దామోదరరావు బొబ్బిలిలో, ఆనందాచారి కర్నూలు జిల్లా పత్తికొండలో అన్నారు. ప్రజాప్రయోజనాల విషయంలో హేతుబద్ధంగా, పార్టీలకతీతంగా ఆలోచించటం ఎంత అవసరమో జేపీ తెలియచేశారన్నారు.

# నల్లధనం నియంత్రణకు ఇంకా చాలా చేయల్సి ఉంది





**రూ.2,000 నోటును చలామణి నుంచి ఉపసంహరిస్తూ రిజర్వుబ్యాంకు తీసుకున్న నిర్ణయం స్వాగతిస్తున్నట్లు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. ఆచితూచి, ప్రజాజీవితానికి ఆటంకం లేని రీతిలో నిర్ణయం తీసుకున్నారన్నారు. నల్లధనాన్ని నియంత్రించేందుకు ఇంకా చాలా చేయాల్సి ఉందన్నారు. నగదు ఆర్థిక వ్యవస్థకు మూడు అంశాలు ప్రధాన చోదక శక్తులుగా పనిచేస్తున్నాయన్నారు. 1. అవినీతి 2. రియల్ ఎస్టేట్ లావాదేవీలు 3. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టటం. ఈ మూడు విభాగాల్లోనూ భారీస్థాయిలో మౌలిక, వ్యవస్థీకృత మార్పులు అవసరమన్నారు. మొదటి రెండు అంశాల్లో విశ్వసనీయ చర్యలు తీసుకుంటే, మూడో సమస్యను ఎదుర్కొనేందుకు రాజకీయ సంస్కరణలపై ఏకాభిప్రాయం సాధించవచ్చన్నారు. సమగ్ర రీతిలో వ్యవహరించాల్సిన సమయమిది అని జేపీ పేర్కొన్నారు.**

# జేపీ కృషి వల్లే ఏపీకి రూ.10,461 కోట్లు




తెలుగు ప్రయోజనాలతోపాటు దేశ ప్రయోజనాల కోసం నిరంతరం పనిచేసే గొప్ప నాయకుడు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మాత్రమేనని, నిజాయతీ, పరిణతి, సామర్థ్యం ఆయన సొంతమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 2014-15 రెవెన్యూ లోటు కింద తాజాగా విడుదల చేసిన రూ.10,461 కోట్లు జేపీ కృషి వల్లే వచ్చాయన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రెవెన్యూ లోటు సహా ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధుల విషయంలో వివాదం నెలకొందని, ఒక్కొక్కరు ఒక్కో రకంగా మాట్లాడారని, ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఒక స్వతంత్ర నిపుణుల కమిటీని జేపీ ఏర్పాటు చేసి నిష్పాక్షికంగా, నిశితంగా లెక్కల్ని నిగ్గుతేల్చారన్నారు. తెలుగువారు అనే పక్షపాతానికి ఆస్కారం లేకుండా కమిటీలోని తెలుగేతర నిపుణులు వాస్తవాల్ని సమగ్రంగా పరిశీలించి నివేదికను ధృవీకరించారన్నారు. కమిటీ నివేదికను 2019 జనవరిలో ప్రజల ముందు ఉంచిందని, అన్ని పార్టీలు, నేతలు, యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికను జేపీ అందచేశారన్నారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అధ్యక్షతన ఢిల్లీలో కూడా కమిటీ నివేదికను విడుదల చేశామని, పలువురు ఎంపీలు, మంత్రులు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారికి స్వయంగా కలిసి అందచేశామన్నారు. కోట్ల రూపాయల జీతాలు తీసుకుంటూ, ప్రజాసేవ బాధ్యత నెరవేర్చాల్సిన అధికారులు, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, నాయకులు చేయలేని పనిని తెలుగు ప్రజల పట్ల ప్రేమతో, బాధ్యతతో జేపీ చేశారన్నారు. కమిటీలో పనిచేసిన నిపుణులకు లోక్‌సత్తా, రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో లోక్‌సత్తా సీనియర్ నాయకుడు శిమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఏపీలో పది మూల్యాంకనం: బేస్‌లైన్ పరీక్షలో ఇంగ్లిష్ వాక్యం

# చదవలేకపోయినా ఫలితాల్లో అత్యధిక మార్కులు

విద్య అంటే మార్కులు, ర్యాంకులు మాత్రమే అనే భ్రమ తల్లిదండ్రుల్లో, సమాజంలో పాతుకుపోవటంతో తెలుగు రాష్ట్రాల్లో వార్షిక పరీక్షల ఫలితాలు వెలువడగానే 100 శాతం, 99.99 శాతం అంటూ ప్రకటనలు హోరెత్తుతుంటాయి. 95 శాతం మార్కులు వచ్చినా ఆ మిగిలిన అయిదూ ఎందుకు రాలేదనే అసంతృప్తులు వ్యక్తమవుతుంటాయి. ఈ నేపథ్యంలో, మనం ఒక్క పేరా కూడా చదవటం రాని సబ్జెక్టును రెండో భాషా సబ్జెక్టుగా తీసుకుని వంద మార్కులు రావటమనే వింత ధోరణి మన విద్యారంగంలో సాధారణమైంది. ఈ ప్రహసనంలో కూడా పదో తరగతి పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ మరో అడుగు ముందుకేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలకనుగుణంగా ప్రశ్నాపత్రాలను రూపొందించకపోవటంతోపాటు, మూల్యాంకనంలో మార్కుల వరద పారించారంటున్నారు.

ఏపీలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 72.26% మంది ఉత్తీర్ణులవగా, ఇందులో 76% మందికి 60 శాతం పైగా మార్కులు వచ్చాయి. 590కి పైగా మార్కులు వచ్చినవారే 500 మంది వరకు ఉన్నారు. ఉత్తీర్ణులైనవారిలో తృతీయ శ్రేణి 7% మందికే వచ్చింది. కొందరు అభ్యర్థులకు తెలుగు, హిందీల్లో 99 మార్కులు రాగా.. ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రాల్లోనూ వందకు వంద మార్కులు సాధించారు. భాషా పరీక్షల్లోనూ 99, 100 మార్కులు వేస్తూ, మూల్యాంకనంలో మార్కుల వరద పారిస్తున్నట్లు విమర్శలున్నాయి. 600కు 597 మార్కులు ఎలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అత్యధిక మార్కులు వస్తున్న జవాబుపత్రాలను మచ్చుకు కొన్నయినా తనిఖీ చేయట్లేదు. కొన్ని సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు సాధించినవారు మరికొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలవుతున్నారు, లేదా బాగా తక్కువ వస్తున్నాయి. గణితం, భౌతిక, రసాయన శాస్త్రం లాంటి వాటిలో బాగా రాస్తే ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ, భాషల్లోనూ వందకు వంద వేస్తున్నారు.




**ఆబ్జెక్టివ్ టైప్ తొలగించినా..**

పదో తరగతి పరీక్షల్లో బిట్ పేపర్ విధానం తొలగించారు. ఒకటి, రెండు, నాలుగు, ఎనిమిది మార్కుల ప్రశ్నలు ఇచ్చారు. అన్నింటికీ సమాధానాలు రాయాలి. ఇలాంటి పరిస్థితుల్లో అన్నేసి మార్కులు ఎలా వస్తున్నాయన్న విషయాన్ని పరిశీలించట్లేదని ఓ ప్రముఖ పత్రిక పేర్కొంది. 2022లో ఉత్తీర్ణత 67.26 శాతానికి పడిపోయినా 76.70% మందికి 360 కంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. 41 వేల మంది 545 కంటే ఎక్కువ మార్కులు సాధించారు. దీంతో మూల్యాంకనంపై విమర్శలు వస్తున్నాయి.

**బ్రిటన్‌లో కంటే మనకే ఇంగ్లిష్ ప్రావీణ్యం ఎక్కువనుకోవాలి**

ఆంగ్లేయుల కంటే మన దగ్గర పదో తరగతి విద్యార్థులే ఇంగ్లిష్ భాషలో అత్యధిక మార్కులు సాధిస్తున్నారు. బ్రిటన్‌లో 2021లో జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (జీసీఎస్ఈ) పరీక్షలో ఇంగ్లిష్ సబ్జెక్టులో గ్రేడ్ 7 వచ్చిన విద్యార్థులు 28.5%. అంటే మన దగ్గరతో పోల్చి చూస్తే 61% వచ్చినవారు. ఈ పరీక్ష దాదాపు మన పదో తరగతి పరీక్షకు సమానం. పదో తరగతిలో మన విద్యార్థులకు ఇంగ్లిష్‌లో వచ్చిన మార్కులు చూస్తుంటే బ్రిటన్ వారి కంటే మనకే ఎక్కువ ఆంగ్ల భాష వస్తుందనుకోవాలా? అని సామాజికవేత్త గుంటుపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షల్లో అన్ని పాఠ్యాంశాల కంటే అధికంగా ఇంగ్లిష్‌లోనే 98.15% మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రభుత్వం చూపిస్తోందని, బడులు బాగా ఉన్నాయని చూపేందుకు చేతికి ఎముక లేదన్నట్లు మార్కుల వరద పారించటమే అందుకు కారణమన్నారు. ప్రపంచంలో ఏ పరీక్షల్లోనైనా మొదటి శ్రేణి (ఫస్ట్ క్లాస్)లో ఉత్తీర్ణులయ్యేవారు తక్కువగా ఉంటారు.

ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో ఎక్కువమంది విద్యార్థులు ఉంటారు. కానీ మన వద్ద ఉత్తీర్ణత సాధించినవారిలో మూడొంతులకుపైగా ప్రథమ శ్రేణివారే ఉంటున్నారు.

పరీక్షల్లో అడిగే ప్రశ్నలతో పాటు మూల్యాంకనంలోనూ మార్పులు తేవాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు ఎప్పటి నుంచో సూచిస్తున్నారు. తార్కికంగా, విశ్లేషణాత్మకంగా ప్రశ్నలు ఉండాలనే వాదన ఉంది.

**బేస్‌లైన్ అథమం.. మార్కుల్లో ప్రథమం**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు గతేడాది పాఠశాల విద్యాశాఖ బేస్‌లైన్ పరీక్ష నిర్వహించింది. 9, 10 తరగతుల్లో ఇంగ్లిష్ వాక్యం చదవలేనివారు 46.92% ఉన్నట్లు గుర్తించారు. కొన్ని ప్రైవేటు బడుల్లోనూ దాదాపు ఇలాంటి పరిస్థితే ఉంటుంది. కానీ, పదో తరగతి పరీక్షల్లో ఇంగ్లిష్ సబ్జెక్టు, ఆంగ్ల మాధ్యమంలో అత్యధిక మార్కులు సాధిస్తున్నారు. పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో చదివి అత్యధిక మార్కులు సాధిస్తున్నవారిలో చాలామంది ఆ తర్వాత ఇంగ్లిష్‌లో మాట్లాడలేకపోతున్నారు.

## ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచేందుకు 'ఫోరం ఫర్ స్టేట్ స్టడీస్'

మన దేశంలో ఎన్నికలకి, ప్రజలకి సంబంధాలు తెగిపోవటంతో చాలా అంశాలు చర్చకు రాకుండా పోతుంటాయి. ఇదో కోణమైతే, ప్రజలు గమనించినా కొరుకుడుపడక పట్టించుకోని అంశాలు కొన్ని ఉంటాయి. ముఖ్యంగా ఆర్థిక రంగంలో. ఇలాంటి వాటి మీద చర్చలు పెట్టినా అందులో పాల్గొనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయమూర్తులు వంటి వారికే ఆవలింతలు వస్తుంటాయి. కొన్ని సంస్థలు సమాచారంతో కుస్తీ పట్టి ప్రజల్లో వివరాల్ని తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నా అన్ని వర్గాల ప్రజలకూ ఆ వివరాలు చేరటం కష్టమవుతుంటుంది. ఎంత సమాచార సాంకేతికత ఉన్నా ఆ అంశాల్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పటం ఓ పెద్ద ప్రయాసే. అయితే ఈ ఆర్థికాంశాలే జనజీవితాన్ని కీలకంగా శాసిస్తుంటాయి కాబట్టి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి నిరంతర ప్రయత్నం చేస్తూనే ఉండాలి. పన్నులు, యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ఖర్చులు, అప్పులు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, బడ్జెట్‌లు, ధరలు, వాతావరణ మార్పులు మొదలైన అంశాల గురించి ప్రజలకు విశ్లేషణాత్మకంగా, గణాంకాల ఆధారంగా వివరాలు అందించేందుకు ఆర్థికవేత్తలు, పరిశోధకులు, యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నతస్థాయిలో పనిచేసే అధికారులు.. ఇలా అనేకమంది కలిసి ఒక వేదికపైకి వచ్చారు. రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్ వై.వేణుగోపాల్‌రెడ్డి ప్యాట్రన్‌గా ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ మాజీ వైస్ ఛాన్సలర్, కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైసెస్ కమిటీ ఛైర్మన్ మహేంద్రదేవ్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటైంది. పలువురు ప్రముఖులు సభ్యులుగా ఉన్నారు. ఈ మేరకు 'ఫోరం ఫర్ స్టేట్ స్టడీస్' పేరుతో వివిధ అంశాలపై ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మలయాళం తదితర భాషల్లో విశ్లేషణాత్మక సమాచారం అందిస్తారు. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే ఆర్థిక నిర్ణయాల ప్రభావం తమ రోజువారీ జీవితాల మీద ఎలా ఉండబోతోందో ప్రజలు అర్థం చేసుకోవటం కష్టమవటానికి పారదర్శకత లేకపోవటం, సమాచారాన్ని స్పష్టంగా తెలుపకపోవటం కూడా కారణాలు. దీంతో, యూనియన్, రాష్ట్రాల ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమస్యలను అర్థమయ్యేలా ప్రజలకు చెప్పటం నిపుణులకు, ఈ అంశాలపై పరిజ్ఞానం ఉన్నవారికి కూడా సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో అనేక ఆర్థిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించటంతోపాటు పక్షపాతరహితంగా లోతైన విశ్లేషణలు అందించే ప్రయత్నం చేస్తామని 'ఫోరం ఫర్ స్టేట్ స్టడీస్' నిర్వాహకులు తెలిపారు. సమాచారాన్ని స్పష్టంగా, పారదర్శక విధానంలో తెలియచేస్తామన్నారు. రాష్ట్రాలకు సంబంధించి కేవలం ఆర్థిక విషయాలే కాకుండా మరిన్ని అంశాలపైనా దృష్టి పెట్టాల్సి ఉందని, విస్తృతస్థాయి సమస్యలను విశ్లేషించటానికి ప్రయత్నిస్తామని.. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాలూ ఇందులో ఉంటాయని తెలిపారు.

ఫోరం ఫర్ స్టేట్ స్టడీస్‌లో వై.వేణుగోపాల్‌రెడ్డి, మహేంద్రదేవ్‌లతోపాటు ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌కు చెందిన జీఆర్ రెడ్డి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ మాజీ డైరెక్టర్ గోవిందరావు, యూనియన్ ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అజయ్ ఝా, బెంగళూరులోని సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీకి చెందిన ప్రొఫెసర్ ఎం.ఎస్ శ్రీరామ్, 14వ ఆర్థిక సంఘం సలహాదారుగా ఉన్న పనిచేసిన పినాకి చక్రవర్తి, విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ వ్యవస్థాపకులు ఆర్ఘ్య సేన్‌గుప్తా, ఈపీడబ్ల్యూ పత్రిక మాజీ సంపాదకుడు రామ్ మనోహర్‌రెడ్డి ఉన్నారు. ఈ సంస్థ సలహామండలిలో కార్పొరేషన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ బి.ఎస్ మూర్తి, రిజర్వుబ్యాంకు మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.పద్మనాభన్, వైద్య ఆరోగ్య కేంద్ర మాజీ కార్యదర్శి కె.సుజాతరావు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ డాక్టర్ కె.శ్రీనాథరెడ్డి, ఐటీ, టెలికాం యూనియన్ మాజీ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ ఉన్నారు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## జుగాడ్ 50:50 రాజనీతి!
## నమూనా మార్పు (paradigm shift) తప్పదు

ఓటర్ల ఐక్యతే దేశానికి ప్రగతి! దేశ భవిష్యత్తుని సమిష్టిగాతప్ప ఒంటరిగా ఏఒక్క ఓటరూ నిర్ణయించలేడు. కనీసం 3 లేదా 5 మంది రాజనీతిజ్ఞులు (Statesmen) ఉంటేనే ప్రజాస్వామ్యానికి అర్ధముంటుంది. గంగిగోవుపాలు గరిటెడైనను చాలు అన్నట్టు, జుగాడ్ ఓటర్ల ద్విపక్ష పార్టీ ఒక్కటి చాలు. లేదా 100 కోట్లమంది ఓటర్లకూ 3 లేక 5 జాతీయ పార్టీలు సరిపోతాయి. 100 మంది జుగాడ్ ఓటర్లలో అధికార పక్షం 50 మంది ప్రతిపక్షం 50 మంది.

అవును 50 / కాదు 50

ఆర్థిక వికేంద్రీకరణ 50 / అధికార వికేంద్రీకరణ 50
75 మెజారిటీ / 25 మైనారిటీ సంఖ్యతో సుపరిపాలన.

తస్మాత్ జాగ్రత్తగా వినండి/ఆలోచించండి!
జుగాడ్ ఓటర్ల-ఆలోచనా పద్ధతిలో మెజారిటీ అంటే హిందువులు మాత్రమే కాదు.
అలాగే మైనారిటీ అంటే ముస్లిములు మాత్రమే కాదు.

క్రీస్తు శకం 1300 సంవత్సరాలనాటి MADE-IN-INDIA బంగారు రాజదండం ఒకటి మనదేశానికి ఆంగ్లేయులనుండి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తరువాత వెలుగులోకొచ్చింది. ఆ జ్ఞాపిక (Sengol) మన ప్రస్తుత ప్రధానమంత్రి ఆ "సెంగోల్" ని నూతన పార్లమెంట్ లో ప్రతిష్టించిన ఆజాదీకా అమ్రిత్కాల్ శుభ సందర్భం! Congress గ్రూపు, భవిష్యప్రధానిగా కలలుకంటున్న BRS అధినేత, పార్లమెంటుని బహిష్కరించకుండా, హుందాగా వ్యవహరిస్తే బాగుండేదని ఒక జుగాడ్ ఓటర్గా నా వ్యక్తిగతమైన అభిప్రాయం.

**As independent Jugaad Voters it is our constitutional prerogative to exercise our vote to any political party or any candidate of OUR choice, irrespective of OUR political likes and dislikes.**

**OUR vote shall remain secret till WE caste it. Let us practice natural democracy with Voters' Authority, BUT NOT as an "organised democracy thrust on Voters" by selected/elected Representatives' WHIMS &FANCIES. Let us shed Hypocrisy and practice participatory democracy with our own small amount of our hard earned money.**

**Contact:Jugaad Parthasarathy (9866416798) & 25 other Jugaad Voters' one-time collective donation of Rs 1 lakh fixed deposit fund. . Initially we need to collect fund not exceeding Rs 3 lakhs to form Jugaad Voters' Party (temporary name only) to contest Elections conforming to ECI Rules and Income Tax Rules. Any person with ECI granted PIC preferably between 25 and 60 years with voluntary donation of a limited fund as prescribed in Janabalam May 2023 issue, without any criminal antecedents is welcome.If the person is married, both wife and husband become Jugaad Voters.**

ADVT

# మానవత్వం పరిమళించిన మంచి మనిషి కాచరాజు జయప్రకాష్ రావు




అంకితభావం గల ఉపాధ్యాయుడిగా ఉద్యోగరీత్యా తాను ఏ చోట పని చేసినా ఏ ఊర్లో నివసించినా ఆ ఊరినే తన సొంత గ్రామం గా భావించి అక్కడి సమాజాన్ని తాను సొంతం చేసుకుని ఆ సమాజంలో తాను ఒక వ్యక్తిగా మెరుగైన సమాజాన్ని నిర్మించే క్రమంలో కాచరాజు జయప్రకాష్ రావు గారు తన అర్ధ శతాబ్ది జీవితాన్ని సామాన్య ప్రజలకి అంకితం చేశారు. 50 సంవత్సరాల ప్రజా జీవితంలో మనసున్న మారాజుగా మానవత్వమున్న మంచి మనిషిగా అనేక సంఘాలలో పనిచేస్తూ వృత్తిపరంగా ఉపాధ్యాయుడే కాకుండా సామాజిక ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన వ్యక్తి కాచరాజు జయప్రకాష్ రావు.

స్వాతంత్రానంతరం ఆనాటి హైదరాబాద్ స్టేట్ లో భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఒకవైపు రజాకార్ల ఆగడాలు మరొకవైపు సాగుతున్న క్రమంలో వరంగల్ జిల్లా సింగరాజు పల్లి గ్రామం నుండి విజయవాడకు వలస వెళ్లిన కుటుంబం వారిది. రెండు సంవత్సరాల పాటు విజయవాడలో ఆ తర్వాత గుడివాడకు షిఫ్ట్ అయి గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కాచరాజు జయప్రకాశ్ రావు జన్మించారు. అప్పటి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్ లో కలిసిన తర్వాత వారి కుటుంబం తిరిగి స్వగ్రామానికి చేరుకుంది. అక్కడ నుండి యువకుడిగా ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించి ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని కొరవి గ్రామంలో మొదటి పోస్టింగ్ వచ్చింది అక్కడ కురవి వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. అలాగే అక్కడి నుంచి బదిలీపై ప్రస్తుత జనగామ జిల్లాలోని బమ్మెర గ్రామంలో పనిచేసినప్పుడు ఆంధ్ర మహాభాగవతం రచించిన బమ్మెర పోతన సాహితీ పీఠాన్ని స్మారక స్తూపాన్ని నెలకొల్పే క్రమంలో బమ్మెర గ్రామస్తులతో కలసి ప్రజా ఉద్యమాన్ని

నిర్మించారు. ఏ సమస్య పైన అయినా అధికారులను కలిసి ప్రజాప్రతినిధులతో పోరాడి తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ఏనాడు ఆయన వెనకాడ లేదు.

1997 లోక్ సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భావం నుంచి మరణించేవరకు భువనగిరి పట్టణ బాధ్యుడిగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శిగా, జిల్లాల విభజన తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లా సమన్వయకర్తగా పనిచేశారు. విద్యుత్తు రంగ సంస్కరణలో భాగంగా లోకసత్తా ఉద్యమ సంస్థ భువనగిరి పక్కనే ఉన్న రాయగిరి విద్యుత్ సబ్ స్టేషన్ బాధ్యత తీసుకున్న సందర్భంలో కార్యకర్తలను సమీకరించి లోక్ సత్తా ఆదేశించిన విధంగా పనిచేశారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు లోక్ సత్తా భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లారు.

అలాగే భువనగిరి ఖిలా సాక్షిగా ఆయన సొంత ఇంటిలో పై అంతస్తు లో “కాచరాజు మినీ హాల్” నిర్మించి రూపాయి ఖర్చు లేకుండా అనేక ప్రజాసంఘాల ఉద్యమ సమావేశాలకు ఆశ్రయం కల్పించిన మహానుభావుడు. ప్రతి వారం కనీసం రెండు కార్యక్రమాలైనా కాచరాజు మినీహాల్లో జరిగేవి. మిత్రమండలి ద్వారా వారానికి రెండు సమావేశాలు నిర్వహించడమే కాకుండా భువనగిరికి సమీపంలో ఉన్న యాదాద్రి పుణ్యక్షేత్రంలో వేశ్య వృత్తిలో మగ్గుతున్న అనేకమంది మహిళలకు చేయూతనిచ్చి వారి వారి స్వస్థలాలకు పంపించిన ఘనత వారిది. వేశ్యల సంఘానికి కూడా నీవే నాయకత్వం వహిస్తావా అని ఆయన మిత్రులు సరదాగా వ్యాఖ్యానించేవారు. క్షేత్రస్థాయి లో పర్యావరణం నుండి ప్రజా ఉద్యమాల వరకు సుమారు 20 నుండి 30 సంఘాలకు ఏదో ఒక రకమైన బాధ్యతలు తీసుకొని ప్రతిరోజు తిరిగే చైతన్య రథం గా ఆయన మారారు. భువనగిరిలో బస్టాండ్ ముందు ఆటోవాలా తో సహా జిల్లా కలెక్టర్ వరకు ఆబాల గోపాలానికి ఆయన పరిచయం అక్కరలేని పేరుగా కాచరాజు సార్ గా ఆయన ఇంటి పేరే ఉద్యమ సార్థక నామధేయంగా మారింది.

చిన్నల్లో చిన్నగా పెద్దల్లో పెద్దగా కుల మత భేదాలు లేకుండా అన్ని వర్గాలు అన్ని వయసుల వారిని ఆకట్టుకొని చిరునవ్వే ఆయుధంగా ఎవరు ఏమన్నా తన పని తాను చేసుకుంటూ పోతూ అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్నారు. తన ప్రసంగాలు కవితల ద్వారా ప్రజలను ఉత్తేజపరిచేవారు. మున్సిపాలిటీలో సమస్యలు మొదలుకొని ఏ ప్రభుత్వ ఆఫీసులో అయినా అధికారులు ప్రజా ప్రతినిధుల క్షేత్రస్థాయి సమస్యలను దృష్టికి తీసుకురావడంలో ఆయన ఏనాడు వెనకాడలేదు. దానికి ఆనాటి వినియోగదారుల చట్టం నుంచి మొదలుకొని నేటి సమాచార హక్కు చట్టం వరకు ఉపయోగించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ఉద్యోగరీత్యా ఉపాధ్యాయుడు కనక ఉపాధ్యాయ సంఘాలతో పాటు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేట్ ఉద్యోగులు అనే బేధం లేకుండా కరోనా కష్టకాలంలో అనేకమంది ప్రైవేటు పాఠశాలల టీచర్లకు వేలాది రూపాయల సహాయం చేసిన జయప్రకాష్ రావు విద్యారంగంలో మహిళలు రాణించాలని ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రోత్సహిస్తూ విద్యా ఆరోగ్య కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించేవారు.

“హక్కులకై కలబడు బాధ్యతలకై నిలబడు” అనే నినాదంతో బాలల హక్కుల నుంచి మొదలుకొని మహిళలు వృద్ధుల హక్కుల వరకు హక్కుల పోరాటం చేసిన ప్రజా ఉద్యమకారుడు కాచరాజు జయప్రకాశ రావు.

మే 25 2023 మరణించేనాటికి 75 సంవత్సరాల వయసు ఉన్న ఆయన భువనగిరిలో కాళ్లకు కదిలే చక్రాలు అమర్చుకున్నారా అన్నంతగా ఒకే రోజు పది మీటింగులు జరిగినా అలుపెరగకుండా ఆ మీటింగ్ లకు తప్పక హాజరయ్యేవారు. అది ఏ సమావేశమైనా కాచరాజు గారి కవిత లేక మాటలు లేకుండా ముగిసేది కాదు. అంతగా భువనగిరి సమాజంతో మమేకమై పనిచేసిన ఆయన సంతాప సభకు సంతాప సభకు సుమారు 500 మందికి పైగా ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు హాజరై ఘనమైన నివాళులు అర్పించారు. జూన్ 5న భువనగిరిలో జరిగిన సంతాప సభకు లోక్ సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రధాన వక్త గా తెలంగాణ తొలి సాహిత్య అకాడమీ చైర్మన్ కవి రచయిత సాహిత్యకారుడు నందిని సిద్ధారెడ్డి భువనగిరి జేపీగా ప్రసిద్ధి పొందిన జయప్రకాష్ రావు గారి గురించి మాట్లాడారు.సుమారు 6 గంటల పాటు జరిగిన ఈ సంతాప సభలో 50 మందికి పైగా వక్తలు జయప్రకాష్ గారి సమాజ సేవను కొనియాడారు.వచ్చే వర్ధంతి సభలోపు ఆయన కవితలు కార్యక్రమాల తో కూడిన ఒక పుస్తకాన్ని ప్రచురించాలని కాచరాజు అభిమాన సంఘాలు తీర్మానించారు. అదేవిధంగా భువనగిరి మున్సిపాలిటీలో కాచరాజు జయప్రకాష్ రావు విగ్రహాన్ని ప్రతిష్టించాలని మున్సిపాలిటీకి విన్నవిస్తూ ఒక వినతిపత్రం కూడా సమర్పించారు. ఏదేమైనా ప్రజా జీవితంలో ఉన్నవారికి రాజకీయ పార్టీ మాత్రమే సరిపోతుందనే భావనను తుడిచివేస్తూ లోక్ సత్తా లాంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా అనేక ప్రజా సంఘాల ద్వారా ఎంతో మంది జీవితాలకు మంచి విద్య అందించడం ద్వారా వెలుగు నింపిన కాచ రాజు జయప్రకాష్ రావు ధన్యజీవి.

# స్పెక్ట్రమ్‌లోలా మార్పులు రావాలి...

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో కటారి ముఖాముఖి (ఐదవ భాగం)




**కటారి:** ప్రభుత్వం పాత్ర సమర్ధంగా ఉండాలి, పరిమితంగా ఉండాలని మీరు చెబుతున్నారు. అయితే ఈ రోజు ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుని ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వరంగ సంస్థలను ధారాదత్తం చేస్తోంది. కొంతమందికే దోచిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. విలువైన భూములను అప్పనంగా కట్టబెడుతున్నారు..దీనిపై మీ స్పందన ఏంటి?

**జేపీ:** పన్నుల రూపంలో ప్రజలు కట్టిన డబ్బును వృథాగా పెట్టి దేశ సంపదను వృథా చేశారనేది స్పష్టంగా తెలుస్తోంది. ఎయిరిండియాను ఇంతకు ముందే ప్రైవేటీకరణ చేసి ఉంటే ఇప్పుడు లాభాలు వచ్చేవి..మొత్తం నష్టపోయి ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. టాటాలు ముందుకు వచ్చి కొనుగోలు చేశారు. వారు వ్యాపారంలా కాకుండా మమకారంతో ఈ పనిచేశారు. ఒకప్పుడు టెలికం సంస్థలు ప్రభుత్వానివి తప్ప మరొకటి లేవు. ఇవాళ చాలా సంస్థలు వచ్చాయి. ప్రజలకు లాభం జరిగిందా? నష్టం జరిగిందా? ప్రభుత్వం రంగం అంటే పవిత్రమైంది..ప్రైవేటురంగం అంటే పాపపంకిలమైన రంగం అనే పిచ్చి ఆలోచన మన మనస్సుల్లో పాతుకుపోయింది. పిల్లి నల్లదా? తెల్లదా? అనేది కాదు..నాకు ఫలితాన్ని ఇచ్చిందా? లేదా? అనేదే కీలకం. ఫోను వచ్చిందా..బాగా పనిచేస్తుందా..చౌకగా అందుతుందా...ఇవే చూడాలి. నా పిల్లలకు చదువు వస్తుందా..నా కుటుంబానికి ఆరోగ్యం నా జేబులో రూపాయి ఖర్చు కాకుండా అందుతుందా..లేదా?.. అనేది అవసరం. మన వనరులు విద్య కోసం, ఆరోగ్యం కోసం పెట్టకుండా..చట్టబద్ధపాలన కోసం కాకుండా, మౌలిక సదుపాయాలకు కేటాయించకుండా, మన ప్రజల జీవితాలను బాగు చేయకుండా వాడెవడో పెట్టుబడి పెడితే నువు శాసించడం దేనికి. దానిలో నాకు ఏ విధమైన సందేహం లేదు. కచ్చితంగా అందర్నీ సమానంగా చూడాలి. అదానీకో, అంబానీకో మొత్తం కట్టబెడుతున్నారనే భయాందోళనలు ఉన్నాయి. ఎవరు వ్యాపారం చేసినా కచ్చితంగా జరగాలి, పారదర్శకత ఉండాలి. ఉదాహరణకు 2 జీ స్పెక్ట్రమ్ కోసం పోరాడింది మనం. సుప్రీంకోర్టులో మన వాదన నెగ్గింది. మొన్నే 5జీ స్పెక్ట్రమ్ చేశారు. రూ. 1.50 వేల కోట్లు వచ్చాయి. ఇందులో మోసం జరిగిందని ఒక్క మనిషినైనా చెప్పమనండి. ఆ పద్ధతిలో జరగాలి. దానికోసం పోటీపడాలి..

ప్రశ్న: ఇవాళ అలా జరుగుతుందా?

జేపీ: స్పెక్ట్రమ్ మన కళ్ల ముందు కనబడుతోంది. మిగతావి కూడా ఆ విధంగా జరిగేలా పోరాడాలి. అంతేకానీ జరగదేమో అనే అనుమానంతో ఉండడం మార్గమే కాదు. మనదేశంలో లోతుగా ఆలోచించకుండా పైపైన అంశాల ఆధారంగా నిర్ణయానికి వస్తున్నాం. ఎకానమిస్టు పత్రిక ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే పత్రిక..ఈ మధ్యనే భారతదేశంలో మీద లీడ్ స్టోరీ రాశారు. దానిలో ఒక మాట చెప్పారు. కచ్చితంగా మోదీ ప్రభుత్వం కొంతమంది పట్ల పక్షపాతం చూపెడుతోందనే విమర్శలున్నాయి. వాస్తవం కూడా కావచ్చు..నేను కూడా అదే నమ్ముతున్నాను. ఎంతో కొంత వాస్తవం ఉండొచ్చు. కానీ స్థూలంగా చూస్తే రెండు విషయాలు... అమెరికాలో నాలుగు పెద్ద కంపెనీలను తీసుకుంటే ఆ నాలుగు కంపెనీల మార్కెటు కాపిటల్ జాతీయాదాయంతో పోలిస్తే 1.7 శాతం. భారతదేశంలో నాలుగు పెద్ద కంపెనీలది 0.6 శాతమే. వీళ్లందరూ కూడా వచ్చే నాలుగేళ్లలో దేశంలో 250 బిలియన్ డాలర్లు మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేయనున్నారు. కచ్చితంగా ఈ క్రోనీ కేపిటలిజం ఆపాలి. లేకపోతే దేశం చాలా నష్టపోతుంది. ఈ దేశంలో పెట్టుబడులు పెట్టేవారు వెయ్యికళ్లతో పరిశీలిస్తుంటారు. ఈ దేశంలో ఏదైనా అదానీకి కట్టపెడతారనే భావం కలిగితే నష్టపోయేది మనమే. వాళ్ల పెట్టుబడులు కావాలి..వాళ్ల టెక్నాలజీ కావాలి..మార్కెటింగ్ స్కిల్స్ కావాలి..అది జరగాలంటే మనం విజ్ఞత ప్రదర్శించాలి. దానిలో ఏమాత్రం రాజీ లేదు. అదే సమయంలో అన్నీ కూడా కట్టబెడుతున్నారనే దానికి ఆధారాలు లేవు. మనం పూర్తిగా ఒక కోణం నుంచి చూస్తున్నాం. మన్మోహన్‌సింగ్ గారు నేనంటే ఆప్యాయత చూపారు..ఆయనంటే ఇష్టం. ఆయన ఉంటే అన్నీ బాగున్నాయి..అనేది సరైన పద్ధతి కాదు. అంశాలను వ్యక్తులకు అతీతంగా చూసే శక్తి కావాలి. వాస్తవాలను గమనించాలి. తప్పులు జరుగుతున్నాయి..తప్పులను సవరించాలి. అన్నీ తప్పులు అంటే పొరపాటు.


(ఇంకావుంది)

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జులై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

## సిఫార్సుల సారాంశం

## ప్రాథమిక ఆరోగ్యం

| | |
|---|---|
| ఔషధాల సేకరణ, సరఫరా | మొత్తంగా ఔషధాల వ్యయం తగ్గి, నాణ్యతకు భరోసా ఉండాలంటే, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలోలా కేంద్రీకృత సేకరణను అనుసరించటం మేలు. సేవల అందుబాటును పెంచుతూ అదే తరహా వ్యయాన్ని ప్రాథమిక ఆరోగ్య స్థాయిలో చేస్తారు. |
| ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికీ డిస్పెన్సరీ | ప్రతి ప్రాథమిక ఆరోగ్య సెంటర్‌లో ప్రయివేటు ఔత్సాహికుల ద్వారా ఒక ఉమ్మడి డిస్పెన్సరీని ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వం సేకరించిన ఔషధాల్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అది సరఫరా చేస్తుంది. |
| మందుల కొనుగోళ్లపై సహ చెల్లింపు | ప్రతిసారీ ప్రిస్క్రిప్షన్‌కి రోగులు బిల్లులో 25% చెల్లిస్తారు. అయితే నెలకు రూ.100 పరిమితి దాటకుండా. ఔషధాల్ని బ్రాండెడ్ పేరుతో కాకుండా కేవలం ఔషధ మూల పదార్థం పేరుతో ఫిజీషియన్ ప్రిస్క్రయిబ్ చేయాల్సి ఉంటుంది. |
| డయాగ్నొస్టిక్ సేవలు | ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలోని అన్ని స్థాయిల్లో పి.పి.పి నమూనాలో ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలను (డయాగ్నొస్టిక్‌లు) అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ నమూనాను దేశమంతటా అనుసరించాలి. |
| ప్రతి సెంటర్‌లో ల్యాబొరేటరీ | మొదటి అంచె (టయర్ 1) సేవలను అందించే ఒక ఉమ్మడి, స్వతంత్ర క్లినికల్ డయాగ్నొస్టిక్ ల్యాబ్ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంటుంది. స్థానికంగా 10 నుండి 12 సాధారణ పరీక్షలు జరుగుతాయి. |

| | |
|---|---|
| | మరింత అధునాతన రెండవ అంచె (టయర్ 2) పరీక్షలను ఆంధ్రప్రదేశ్ నమూనాను అనుసరించి ప్రయివేటు రంగానికి ఔట్‌సోర్స్ చేస్తారు. |
| డయాగ్నొస్టిక్ సేవలకు సహ చెల్లింప | రూ.100 పరిమితి దాటకుండా రోగి 25% సహ చెల్లింపు చేస్తారు. నిరుపేద వ్యక్తులకు సహ చెల్లింపు నుండి మినహాయింపు. |
| జవాబుదారీతనానికి ఏర్పాటు | ఎఫ్.పిలపై పర్యవేక్షణ, తన పరిధిలోకి వచ్చే డయాగ్నొస్టిక్ ల్యాబొరేటరీలు, ఔషధ దుకాణాల పరిశీలనకి కమ్యూనిటీ స్థాయిలోని ప్రాంతీయ ఆరోగ్య బోర్డులు బాధ్యత తీసుకోవచ్చు. ఎఫ్.పిలతో కాంట్రాక్టు కుదుర్చుకోవటం, నిధుల పంపిణీ బాధ్యతల్ని జిల్లా ఆరోగ్య బోర్డులకు అప్పగించవచ్చు. ఎఫ్.పి నేతృత్వంలోని ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అమలు, మార్గదర్శకత్వం, పర్యవేక్షణ, పరిశీలనలకి రాష్ట్ర ఆరోగ్య బోర్డుల్ని ఏర్పాటు చేయవచ్చు. |

**ప్రాథమిక ఆరోగ్యానికి ఏడాదికి అయ్యే వ్యయ అంచనా - రూ.30,000 కోట్లు.**

# ద్వితీయ స్థాయి వైద్యం

| | |
|---|---|
| ఏక చెల్లింపుదారు (సింగిల్–పేయర్) ఇన్సూరెన్స్ నమూనా | ఆయుష్మాన్ భారత్‌ని ఆరోగ్యశ్రీ వంటి రాష్ట్ర స్థాయి కార్యక్రమాలతో సంధానం చేయటం. |
| అందరికీ ఆరోగ్య సేవల వర్తింప | కార్యక్రమాన్ని జనాభా మొత్తానికీ విస్తరించటం. అందరికీ కవరేజీ విధానం.. లబ్ధిదారుల గుర్తింపు, సేవల నాణ్యతను మెరుగుపరచటం వంటి వాటి ద్వారా ఎదురయ్యే సమస్యలను తొలగిస్తుంది. |
| అన్ని రకాల ద్వితీయ సేవలను కవర్ చేయటం | అన్ని ద్వితీయ స్థాయి సేవలకూ వర్తింపచేయటం, అత్యంత ఖరీదైన తృతీయ స్థాయి చికిత్సలన్నింటినీ క్రమంగా మినహాయించటం. |
| ఎఫ్.పి నుండి రెఫరల్ | ఎమర్జెన్సీలలో మినహాయించి, ఎఫ్.పి నుండి సిఫార్సుతో మాత్రమే ఈ కార్యక్రమం కింద ఆస్పత్రి సంరక్షణ అందుబాటులోకి వస్తుంది. |
| సి.హెచ్.సిలు, చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంల మధ్య ఎంపిక, పోటీ | అర్ధ గ్రామీణ, చిన్న పట్టణాల్లో వ్యయ ప్రయోజనకరమైన రీతిలో ద్వితీయ స్థాయి సేవలకు చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలను కార్యక్రమం కింద అధీకృత జాబితాలో చేర్చటం |
| | ప్రభుత్వ రంగంలో నాణ్యమైన ద్వితీయ స్థాయి సేవలను అందించేందుకు సి.హెచ్.సిలు, ఉప–జిల్లా ఆస్పత్రులకు తగినంత సాధనాసంపత్తిని సమకూర్చటం. జిల్లా ఆస్పత్రులు క్రమంగా తృతీయ స్థాయి వైద్య కేంద్రాలుగా మారటం. |
| డయాగ్నొస్టిక్‌ల ఉమ్మడి వినియోగం | జిల్లా ఆస్పత్రులు, సి.హెచ్.సిలు, చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంల మధ్య రోగ నిర్ధారణ పరీక్ష సేవల ఉమ్మడి వినియోగం. ఆ ప్రాంతంలోని జాబితా ఆస్పత్రులు ప్రభుత్వాస్పత్రుల నుండి కొంత రుసుముతో సేవలను పొందవచ్చు. |
| | నికర ప్రతిఫల ఆదాయానికి భరోసాతో మూలధన పెట్టుబడిలో, పరికరాలు, యంత్రాల నిర్వహణలో ప్రయివేటు పెట్టుబడుల్ని ప్రోత్సహించవచ్చు. |

(ఇంకా ఉంది. . . )



FDR
FOUNDATION for
DEMOCRATIC
REFORMS

## ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు ప్రజాస్వామ్య పీఠం (FDR) చేసిన కృషిలోని కొన్ని కీలకాంశాలు:



**2014 :** రాష్ట్ర విభజన వల్ల హైదరాబాద్ ఆదాయం కోల్పోయే నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏర్పడే రెవిన్యూ లోటు వెల్లడి, మొదటిసారిగా రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక హోదా, సాయం ప్రతిపాదన. జేపీ సూచనలే విభజన చట్టం, ప్రధాని హామీల్లో చోటుచేసుకున్నాయి.



**2015 :** విభజన చట్టం అమలుకు 'తెలుగు భవిత' కార్యక్రమం, హైదరాబాద్ లో ఏపీ, తెలంగాణ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం.



**2018 :** జనసేన వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ తో కలిసి JFC (జాయింట్ ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ) ద్వారా కృషి



**2019 :** FDR, లోక్ సత్తా నేతృత్వంలో జాతీయ స్థాయి స్వతంత్ర నిపుణుల కమిటీ (IGE) ఏర్పాటు, సమగ్ర నివేదిక విడుదల - 2014 - 15 లో వనరుల లోటు భర్తీ కోసం యూనియన్ ప్రభుత్వం విడుదల చేయాల్సిన మొత్తం రూ. 10493.57 కోట్లుగా నిర్ధారణ.




**2023 :** FDR, లోక్ సత్తా నిపుణుల కమిటీ నివేదికకనుగుణంగా AP కి 2014 -15 రెవిన్యూ లోటు భర్తీ కింద రూ.10,460.87 కోట్లు విడుదల చేసిన యూనియన్ ప్రభుత్వం

**తెలుగు ప్రజలందరి తరపున స్వతంత్ర నిపుణుల కమిటీ సభ్యులకు FDR, లోక్ సత్తా హృదయపూర్వక కృతజ్ఞతలు**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th JUNE, 2023 Posting Date 15 &16th of every month



# ప్రయివేటు పెట్టుబడులు పేద, మధ్యతరగతికి ఆరోగ్యం అందించలేవు

విద్యలోలాగే ఆరోగ్యానికి మన దేశంలో భారీ డిమాండ్ ఉంది. ప్రయివేటు రంగం నుంచి పెట్టుబడుల ప్రవాహం ఉధృతమవుతుండటమే ఇందుకు సంకేతం. 2011లో 94 మిలియన్ అమెరికన్ డాలర్ల నుంచి 2016లో 1275 మిలియన్ డాలర్లకి, అంటే 13.5 రెట్లు ఈ పెట్టుబడులు పెరిగాయి. భారత మెడికల్ టూరిజం మార్కెట్ వేగంగా పెరుగుతూ కేవలం ఆస్పత్రి సేవల్లోనే 2026కి 13 బిలియన్ డాలర్లకు చేరనుంది. అయితే మూడో దశ వైద్యంలో ప్రయివేటు పెట్టుబడులు పెరగటం వల్ల రోగులకు పెద్దగా ప్రయోజనం ఉండదు. పేద, మధ్యతరగతి వర్గాలు ఈ సేవల్ని అందుకోలేరు కూడా. ప్రభుత్వాలు అక్కడో పథకం, ఇక్కడో పథకం అమలు చేసినా డబ్బు ఖర్చు తప్ప, ఆరోగ్యం అందదు. ప్రభుత్వం కొంత అదనపు పెట్టుబడితో ప్రాథమిక స్థాయి నుంచి సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయటమే ఇందుకు పరిష్కారం. భారతదేశ ఆరోగ్య వ్యవస్థలోని ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకుని ఒక సమగ్ర దృక్పథంతో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య విధానం ఈ రకంగా రూపొందించినదే. ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ దగ్గర ఔట్ పేషెంట్ సేవల దగ్గర్నుంచి తృతీయ స్థాయి వైద్యం వరకు ఈ విధానంలో అయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ. అదనంగా కేవలం 0.5 శాతం జీడీపీలో కేటాయిస్తే, అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని ఆర్థిక భారం లేకుండా అందించవచ్చు. అవగాహన, రాజకీయ సంకల్పం ఉంటే చాలు. భారత్ 2047 నాటికి తాను ఆశిస్తున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్ని చేరుకోవాలంటే ఈ విధానం అమలు తప్పనిసరి అవసరం.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020